

ఆంధ్ర ప్రదేశ్
జూన్ 1975
50 పైసలు

ఆంధ్రకేసరి కథ



ఆంధ్రకేసరికీ జై! ప్రకాశానికీ జై!
మీకు ధైర్యం ఉంటే ఆ గుర్రాల్ని మా మీదుగా తోలండి!
ప్రకాశాన్ని అరెస్టు చేసి జైల్లో పెట్టారు.

ఆంధ్రప్రదేశ్

జూన్, 1975

సంపుటి: 19] జ్యేష్ఠ—ఆషాఢ, 1897 [సంచిక : 8

ప్రధాన సంపాదకులు
శ్రీ రాజ్యం సిన్హా

సంపాదకులు
యస్. వి. గోపాలశాస్త్రి

" తేనెలో మాగిన తియ్య మామిడిపండు
పన్నీట పెరిగిన పాల చెఱుకు రసంబు
కలసి కమ్మదనాలు, మెలసి మెత్తదనాలు
మందార మాకంద, మకరంద పాకమై
స్రవ్య మాయె మహాంధ్ర సంతతికి తెలుగు "

-రాయప్రోలు

మొదటి కవరు పేజీ : తప్త ప్రకృతిలో వానజల్లు మొదలయింది

రెండవ, మూడవ కవరు పేజీలు : ప్రకాశం కథ (చిత్రాల్లో)

చివరి కవరు పేజీ : చవులూర్చే తియ్యందనాలు
తెలుగునాట మామిడి ఫలాలు

సాలు చందా : ఆరు రూపాయలు

వెల: 50 పైసలు

రిజిస్టరు నెం: హెచ్/హెచ్. డి. 81

ఈ సంచికలో...

పేజీ

కృష్ణవేణి

కన్నీరు తుడుచుకో కృష్ణవేణీ నీ
కష్టాలు ఈడేరెనమ్మా!
ఇన్నాళ్ల కన్న నీ కలలన్ని నిజములై
ఆనందములు పండునమ్మా!

అడవి పాలైన నీ అందాల బ్రతుకునకు
కడలి పాలైన నీ సంపాద సంపదకు
మంచివాళ్లేతెంచె, మరచిపో గత గాథ
మధుర భావిని నీకు మరిలేదు ఏ బాధ

నీవు దేశ చరిత్ర గర్భాన పుట్టితివి
ఒక మహాప్రస్థాన మెదియొ తలపెట్టితివి
ఏ నెరెంగుదు జీవనమ్మెందరికొ ఇచ్చి
ఎటు తోచకీవె సంద్రము త్రోవ పట్టితివి

నీ మహాగాన నిక్వాణమ్ములో కరిగి
పోయెను శతాబ్దాలవెన్నో
నీ సుధామయ పుణ్య తీరమ్ములో పెరిగి
పోయె సామ్రాజ్యాలవెన్నో,
కాని నీ కొరక ఆలయమును కట్టనేలేదు
నే నెరుంగుదు. నీకు నిల్వ నీడే లేదు

నీ దరినె గుండె తడిలేని భూముల జూచి
నీ ముందె ప్రజలు పస్తుపడుండుటను జూచి
నిలయమ్ము లేక వారికి సాయపడలేక
నీ ప్రచైతన్య ధారాశక్తి యంతయును
అడవి గాచిన వెన్నెలాయనే యని ఎంత
గా పరితపించినావో నదీ జననీ!

నవయుగారంభోత్సవమ్ములో ఈనాడు
నవ భారత ప్రభాత ప్రభాస్నాతులై
నీ బృహచ్ఛక్తి నిర్భర హృదయము గ్రహించి
తమ జీర్ణ జీవితాలకు సౌఖ్య మాశించి
నీ ప్రజాకోటి ధృఢముగ నడుములు బిగించి
నిర్మించుచున్నారు నీకు బంగరుకోట

అపర బుద్ధావతారుడగు నాగార్జుని
ధర్మ ప్రబోధ ప్రతి ధ్వనిత గిరిసీమ
విస్మృతేక్ష్వాకు సామ్రాజ్య నిర్మిత బౌద్ధ
విశ్వ విద్యాలయ కళా పునీత స్థలుల
నిర్మించుచున్నారు నీకు నాగార్జున
సాగర మహాలయము సౌందర్య నిలయమ్ము!

నీ కనులముందె కళకళలాడి ఆనాడు
కాలపర్జన్య సంపాత నిర్ఘాతముల
నశియించిన విజయపురము పునర్నిర్మించి
నీ ప్రాంగణాన నిత్యమ్ము శోభించులే
అలనాటి బౌద్ధ శిల్పసుమాల మాలికల
నీ గృహమలంకరింతురులే జనులు తల్లి

నీ సేవ చేయ పడవలు తిరుగు నీ యింట.
నీ భవన కుడ్యాలపై విశాల పరిష్కృతి
సుందర సువర్ణ చిత్రాలు చిత్రించులే,
నీ నిలయ సౌందర్య గరిమ తిలకించగా
రసికులు, కళాప్రియులు, అభ్యుదయకాముకులు
దేశదేశాల నుండియు చేరవత్తురులే

నీ చూపు ప్రసరించు వంత దూరము నేల
పల్లవించు, శ్రుతించు నవ్య జీవన హేల,
నీ లాస్య జలపాత జనిత జీవన ధ్వనులు
నీ హాస విద్యుజ్జనిత కాంతి రేఖికలు
పట్టణాలను పల్లెపల్లెలో ప్రతియింట
కలిగించు మోదమ్ము వెలిగించు భాగ్యాలు

ఆంధ్రదేశమున కళా కాంతి నిలయమై
నవభారతాభ్యుదయమునకు సంకేతమై
బాధా దరిద్రాలపై విజయ చిహ్నమై
నీ భూరి సాగర సదనము వర్ధిల్లులే

నీ మహా గంభీర హృదయ సాగరములో
నీ తేనె కలలు అలలై ఎపుడు ఆడులే,
కన్నీరు తుడుచుకో కృష్ణవేణీ! నీ
కష్టాలు ఈడేరెనమ్మా!

శ్రీ జె. బాపురెడ్డి
ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ సహజ సంపదలు

శ్రీ పిడతల రంగారెడ్డి



ప్రకృతి సంపద దృష్ట్యా ఐశ్వర్యవంతమైన ప్రాంతాల్లో ఆంధ్ర ప్రదేశ్ దే అగ్రతాంబూలం. పాడి, పంట, నీరు, ఖనిజాలు, అటవీ సంపత్తి కోకొల్లలు. ప్రకృతి సిద్ధంగా లభించేవనరులు, ముడి సరుకులు, ఇంధనం వృధాపోకుండా ఆధునిక శాస్త్ర విజ్ఞానంతోనూ, సాంకేతిక పరిజ్ఞానంతోనూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి మొదలైన రంగాలలో విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించడానికి కృషి జరుగుతోంది. మనరాష్ట్రం విస్తీర్ణం 679.94 లక్షల ఎకరాలు. అందులో సుమారు సగం విస్తీర్ణం సేద్యయోగ్యమైంది. తక్కినదంతా బీడులూ, కొండలూ, దట్టమైన అడవులూ. సేద్యానికి పనికిరాని బంజరు భూములూను. ఏటేటా లెక్కకు మిక్కిలిగా పెరుగుతోన్న జనాభా కోసం రాష్ట్ర విస్తీర్ణం పెరగదు కదా! వ్యవసాయం రాష్ట్రంలోని ఎనభై శాతం ప్రజలకు జీవనాధారం అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని నీటిపారుదల సౌకర్యాలు కల్పించడానికి,ఎరువుల ఉత్పత్తికి అత్యధిక ప్రాముఖ్యత యివ్వటం జరుగుతోంది. భూగర్భంలో నిక్షిప్తమైవున్న అపారమైన ఖనిజ సంపదా, చీకట్లను పారద్రోలటంతోపాటు అన్ని రంగాల్లోనూ తప్పనిసరిగా వినియోగింపబడే విద్యుచ్ఛక్తీ, అరుదైనసామగ్రిని అందించే అటవీ సంపద, — వీటన్నిటినీ ప్రణాళికా బద్ధమైన కార్య దీక్షతో ఉపయోగించుకొంటున్నాం.

నీటి వనరులు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ హెచ్చుగా వ్యవసాయం మీదనే ఆధారపడి వుంది. అందుకే నాల్గవ ప్రణాళిక అంతం నాటికి—అంటే 1974 మార్చి నాటికి నీటి పారుదల సౌకర్యాల కోసం రూ. 380 కోట్లు ఖర్చు చేశాం. ఫలితంగా ప్రణాళికకు ముందుకంటే ఇప్పుడు రెట్టింపు ప్రాంతానికి నీటిపారుదల సదుపాయం అంద చేయడం జరిగింది. అయిదో పంచవర్ష ప్రణాళికలో అంతకు ముందు మిగిలి పోయిన కార్యక్రమాలను పూర్తిచేయడం జరుగుతుంది. వీటి కోసం సుమారు 158 కోట్ల రూపాయలు ఖర్చు కాగలవని అంచనా. తుంగభద్ర దిగువ కాలువ, ఎగువకాలువ, కడప-కర్నూలు కాలవలను అభివృద్ధి పరచడం, అనావృష్టి పరిసరాలతో నిండిన పోచంపాడు ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వెనకబడ్డ ప్రాంతాల్నీ గిరిజన ప్రాంతాల్నీ అభివృద్ధి పరచడానికి తోడ్పడే వంశధార ప్రాజెక్టు చెప్పుకోదగ్గ అంశాలు. కొత్తగా ప్రారంభించబడే నీటిపారుదల కార్యక్రమాల ద్వారా ఒకలక్ష ఏభై ఏడువేల యకరాల భూమి సాగులోనికి వస్తుంది. మొత్తంమీద అయిదో ప్రణాళిక పుణ్యమా అని 21 లక్షల యకరాలకు నీటి వనరులు లభ్యమవుతున్నాయి.

ఎరువులు

వ్యవసాయరంగానికి జీవనాడి ఎరువులు. ఇటీవలి కాలంలో ఎరువుల వాడకం ఎంతో హెచ్చుగా వుంది. మనకు కేంద్రం నుండి లభ్యమయ్యే ఎరువుల సరఫరా మన అవసరాలకు సరిపోవడం లేదు. ఏటా మూడు పంటలు-అందులో అవి హెచ్చు దిగుబడినిచ్చే పంటలు-ఇప్పటి రైతుకు లక్ష్యాలు. నీటి పారుదల సౌకర్యాలు విస్తారంగా పెరగడంతో సాగుకు వచ్చిన భూమి విస్తీర్ణం కూడా అంచెలంచెలుగా పెరుగుతోంది. దాంతో ఎరువులు మరింతగా అవసరమయ్యాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు చాలక, ప్రతియేటా అమూల్యమైన విదేశీమారక ద్రవ్యాన్ని వెచ్చించి పెద్ద మొత్తాల్లో ఎరువులు దిగుమతి చేసికోవాల్సివస్తోంది. అంచేత, 1978-79 నాటికి కనీసం 70 లక్షల టన్నుల నత్రజనిని, 17 లక్షల టన్నుల ఫాస్ఫారిక్ యాసిడ్ ఎరువులను ఉత్పత్తి చేయడం మన ప్రణాళికా లక్ష్యం. స్వయంసమృద్ధిని సాధించి, అవసరాలకు సరిపడా రసాయనిక ఎరువులను ఉత్పత్తి చేసుకొనే ఆశయంతో

రాష్ట్రంలో సుమారు 120 కోట్ల రూపాయల ఖర్చుతో రామగుండం వద్ద భారీ యెత్తున బొగ్గు ప్రాతిపదికగాగల ఎరువుల ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. ఇక్కడ ప్రతి దినం 900 టన్నుల అమ్మోనియా, 1500 టన్నుల యూరియా ఉత్పత్తి అవుతాయి. ఇందువల్ల సాలీనా 36 కోట్ల రూపాయల విలువచేసే ఎరువులు తయారవుతాయి.

ఇంధనాలు చవుకయితే పరిశ్రమలు మూతబడతాయి. గనుల త్రవ్వకం, విద్యుచ్ఛక్తి ఉత్పాదక పారిశ్రామిక రంగంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. నేలబొగ్గు విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రముఖ స్థానం వుంది. ఉభయ గోదావరి జిల్లాలు, తెలంగాణా యీ ముఖ్య ఖనిజానికి ఆట పట్టులు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోను, ఖమ్మం జిల్లాలోని రామగుండం, ఎల్లెందు, కొత్తగూడెం ప్రాంతాల్లోనూ, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ దొరికే బొగ్గు కొంత వరకూ మన అవసరాలకు అందివస్తోంది.

సింగరేణిలోని బొగ్గు గనులు రాష్ట్రానికే గాక, దేశానికంతటికీ తరగని ఇంధన సంపదకు నిలయాలు. రైళ్ళకూ, విద్యుదుత్పాదక కేంద్రాలకూ, సిమ్మెంటు, కాగితం, చక్కెర, జవుళి — ఒకటేమిటి, ఎన్నో కర్మాగారాలకు మన రాష్ట్రంలోనే కాకుండా, దక్షిణాదికంతటికీ వరప్రసాది సింగరేణి. పెట్రోలు ధరలు పెరిగి, దిగుమతులు కష్టం కావడంతో బొగ్గుకు ప్రాధాన్యం మరింతగా యినుమడించింది. బొగ్గు ఆధారంగా పెద్ద ఎరువుల కర్మాగారం ఒకటి యిక్కడ నిర్మించాలని ప్రతిపాదింపబడింది. అంతే గాకుండా కొత్తగూడెంలోవున్న విద్యుచ్ఛక్తి కేంద్రానికి తోడు మరో విద్యుదుత్పాదక కేంద్రాన్ని భారీ యెత్తున నిర్మించాలని తలపెట్టారు.

పారిశ్రామిక అభివృద్ధి

ఖనిజ సంపద అపారంగా వున్నప్పటికీ, పొరుగు రాష్ట్రాల్లో వలె మన రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. అయిదో ప్రణాళికలో, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠంగా పునర్నిర్మించే ఆశయంతో పారిశ్రామిక పథకాలు రూపొందించడం జరిగింది. రూ. 310 కోట్లు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి సంస్థ సారథ్యంలో వినియోగింపబడతాయి. చిన్నా, పెద్దా, పరిశ్రమలకు మొత్తంమీద రూ 440 కోట్లు కేటాయింపబడ్డాయి. పరిశ్రమలు అభివృద్ధి అయ్యే కొలదీ విద్యుచ్ఛక్తి అవసరం పెరుగుతూనే వుంటుంది. సుమారు 1,550 మెగా వాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కోసం రూ 450 కోట్లతో ఒక ప్రణాళికా పథకం అమలు జరగబోతోంది. ఇందుతోనే 6000 గ్రామాలు విద్యుద్దీపాల సౌకర్యాన్ని పొందటమేగాకుండా అదనంగా రెండు లక్షల పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి నిశ్చయింపబడింది.

సహజ వనరులు

పారిశ్రామిక అభివృద్ధికి ఎంత పెద్ద మొత్తాల్లో ధనం కేటాయించినా ఉత్సాహవంతులయిన పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలోని అనువైన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పుకొనేందుకు ముందుకు రానిదే లాభం లేదు. ఇంధన సదుపాయం, ఆర్థిక వనరులు, రవాణా సౌకర్యాలు తగినంతగా సమకూర్చడానికి ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తూనే వుంది. మన రాష్ట్రంలో లభ్యమయ్యే ముడి సరుకులు ఇతర ప్రాంతాలకు తరలింపబడే విధానం అరికట్టి, మన రాష్ట్రాన్ని పారిశ్రామికంగా స్వయం సమృద్ధి చేసుకోవడానికి యింకా కృషి జరగాల్సివుంది. గనుల అభివృద్ధి రంగంలో మొత్తం 23 కోట్ల 46 లక్షల ఖర్చుతో పథకాలను అమలు జరుపుతున్నాం. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ ప్రధాన పాత్ర నిర్వహిస్తుంది. అంతేగాక, చిన్న తరహా పరిశ్రమలూ, ఖాదీ గ్రామోద్యోగ పరిశ్రమలూ, చర్మకారీ, చేనేత, పట్టు పరిశ్రమలూ రాష్ట్రమంతటా నెలకొల్పేందుకు మొత్తం రూ. 484 కోట్లు కేటాయింపబడ్డాయి. దీనిలో రాష్ట్ర ప్రభుత్వంచేసే ఖర్చు రూ. 62 కోట్ల 12 లక్షలు. పరిశ్రమలు ప్రారంభించడానికి ఆరంభ దశలో పరిశ్రమదారుల పనులు సులభంగాను, సత్వరంగాను జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకూ ఒక జిల్లాస్థాయీ సంఘాన్ని నెలకొల్పింది. వీటికి జిల్లా కలెక్టర్లు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. మన రాష్ట్రంలో ఖనిజ వనరులు ఎన్నో నిక్షిప్తమై వున్నాయి. బొగ్గు, ఇనుము, మాంగనీసు, ఏస్బెస్టాసు, అభ్రకం, సున్నపురాయివంటి ఖనిజాలను వెలికి తీయాల్సివుంది. ఈ ముడి పదార్థాలతో ఇనుము, ఉక్కు, సిమెంటు, గాజు, పింగాణీ, ఎరువులు, యింకా ఎన్నో పరిశ్రమలూ, కర్మాగారాలు నిర్మింపబడే అవకాశం వుంది. ఇవన్నీ ఖనిజాలపై ఆధారపడే పరిశ్రమలే. ఆంధ్రప్రదేశ్‌లో 17 లక్షల టన్నుల బెరైటు వుంది. ఇది బేరియం రసాయనాలను ఉత్పత్తి చేయడానికి ఎంతగానో వినియోగింపబడుతుంది. 4,000 లక్షల టన్నుల ముడి ఇనుము మన రాష్ట్రంలో లభ్యమవుతుంది. సాగే ఇనుము, ఉక్కు, తదితర ఫెర్రస్ లోహాలను తయారుచేయడానికి ఇది అక్కరకు వస్తుంది. నాణ్యమైన చెకుముకిరాయి ఇక్కడ అపారంగా లభిస్తుంది. దీన్ని గాజు పరిశ్రమకు ఉపయోగిస్తారు. క్రిసోలైటు, ఏస్బెస్టాసు ఖనిజాలు కేవలం మన రాష్ట్రంలో మాత్రమే లభిస్తున్నాయి. సుద్ద, క్వార్ట్జ్ స్టీటైజు, ఎపటైటు మొదలైనవెన్నో రాష్ట్రంలో వున్నాయి. అవన్నీ దేశం మొత్తం ఉత్పత్తిలో కనీసం 50—80 శాతం వరకు మన రాష్ట్రంనుండే ఉత్పత్తి అవుతున్నాయి. ఆ మాటకువస్తే మొత్తం దేశపు ఖనిజ సంపదలో మన రాష్ట్రానిది నాల్గవ స్థానం. రాగి, వజ్రాలు, గ్రాఫైటు, పాలరాయి. ఖనిజ సంబంధమైన రంగులు, స్టియలైటు ఖనిజాలు రాష్ట్రంలో అపారంగా వున్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ఆంధ్రప్రదేశ్‌లో దొరకని ఖనిజమంటూలేదంటే ఆశ్చర్యపోనక్కరలేదు. ఎక్కడ, ఏ పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలున్నాయనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విషయంలో ప్రతిపాదనలను రూపొందించేటప్పుడు రాష్ట్రవనరుల సమీకరణతోపాటు ఉపాధి కల్పనావకాశాలనుకూడా దృష్టిలో వుంచుకొంటున్నారు. కలప, మత్స్య పరిశ్రమ, జనపనార, పత్తిగింజలు, ఉన్ని, ఆముదము—యీ మొదలైన పరిశ్రమలు విస్తారంగా అభివృద్ధిచెందడానికీ, యివి అటవీ ఉత్పత్తి ప్రాతిపదికగాగల పరిశ్రమలయినప్పటికీ యిందులో ఖనిజ సంపద వినియోగానికీ, వ్యవసాయోత్పత్తుల ఉపయోగానికీ ఎన్నో అవకాశాలున్నాయి. చేనేత

పరిశ్రమ మన రాష్ట్రంలో కీలకమైన పాత్ర నిర్వహిస్తోంది. ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 10 లక్షల మందికి జీవనోపాధి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 29 నూలు మిల్లులున్నాయి. ఇందులో అయిదు సహకార రంగంలో వున్నాయి. మన అంచనాల ప్రకారం రాష్ట్రానికి సాలీనా కనీసం 3 లక్షల బేళ్ళ నూలు కావల్సివుంది అందువల్ల చిత్తూరు, కర్నూలు, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాల్లో మరో నాలుగు సహకార నూలు మిల్లులు నిర్మించడానికి ప్రతిపాదించబడింది. మిల్లు పరిశ్రమకూ, చేనేత పరిశ్రమకూ మధ్య పోటీనీ, తారతమ్యాలను తొలగించే ఆశయంతో చేనేత వస్త్రాల అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీనిస్తోంది. సిల్కు పరిశ్రమ రంగంలో టసోర్, ఎరి — ఇంకా యితర రకాల సిల్కును ఉత్పత్తిచేసే సంఘాలు, ముడి సిల్కును మార్కెటింగ్‌చేసే సంఘాలు, సిల్కు నూలును వంటె మీద చుట్టే నిపుణుల సంఘాలూ వాటి కృషిని నిర్వహిస్తున్నాయి. లఘు, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం ఎప్పటికప్పుడు లభిస్తూనేవుంది. అభివృద్ధి కార్యక్రమాలకు ఏ ఆటంకాలూ రాకుండావుంటే మరో దశాబ్దిలో మన రాష్ట్రం పారిశ్రామికంగా దేశంలోకల్లా ప్రముఖస్థానం పొందగలదు.

ఆటవీ సంపద

రాష్ట్రంలోని సహజసంపదల్లో అడవులు అత్యధిక ప్రాధాన్యం కలిగివున్నాయి మన రాష్ట్రం మొత్తం భూభాగంలో 22 3 శాతం అడవులే. ఉభయగోదావరి జిల్లాలు, శ్రీకాకుళం, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల్లో ఎన్నోరకాల అమూల్యమైన వస్తువులకు ఆటపట్టులయిన అడవులున్నాయి. గంధపు చెక్క, లక్క, కలప, తేనె, బీడీ ఆకులు, ఔషధాల్లో వినియోగించే మూలికలు, జీడిగింజలు మొదలయిన అరుదైన సామగ్రి అంతా పెద్ద మొత్తాలలో లభిస్తుంది. వీటితో ఎన్నో లఘు, కుటీర పరిశ్రమలను స్థాపించడానికి ప్రభుత్వ ప్రోత్సాహం వుంది.

వన్య మృగాలు ప్రకృతిలో సహజసంపద వాటి పరిరక్షణ, రక్షిత ప్రాంతాల నిర్వహణకోసం "బ్లాక్ షూటింగ్" పద్ధతిని ప్రవేశపెట్టడం జరిగింది. "వన్య మృగ సంరక్షణ బోర్డు" జాతీయ పార్కులను, అభయారణ్యాలను నిర్వహిస్తోంది. మన రాష్ట్రంలో నాలుగు వన్య మృగ అభయారణ్యాలూ, ఒక పక్షుల రక్షణ స్థావరం, నెహ్రూ జూలాజికల్ పార్కు నెలకొల్పబడ్డాయి.

ఈతరం మానవుడు ప్రకృతి శక్తుల్ని వశపరచుకొని నవ సమాజాన్ని నిర్మించుకొంటున్నాడు ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే సంపత్తితో జీవితాన్ని సౌభాగ్యవంతం చేసుకోవడం నాగరికతకు కొలబద్ద. సంఘటితంగా కృషిచేసి మన సహజ సంపదలను అన్నింటినీ వినియోగించుకొనే దృక్పథాన్ని అలవరచుకోవాలి. ఒక్కపెట్టున ఆకాశం చిల్లి నిత్యజీవితావసర వస్తువులన్నీ రాష్ట్రమంతటా రాలిపడవు ప్రతి వ్యక్తీ తన వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాల్సి వుంది. ప్రభుత్వానికి అండగా, ప్రగతికి బాసటగా నిల్చి దరిద్రంమీద దండయాత్ర చేయాల్సి వుంది. ప్రకృతి మానవుడికిచ్చిన ఆ ఐశ్వర్యాలూ నిక్షిప్తంగా, నిగూఢంగా పడివుంటే నానాటికీ పెరుగుతోన్న జనాభా అవసరాలు తీరడం దుర్లభం. అందుచేతనే సహజ సంపద లెన్ని వున్నా సామాన్యుడి స్థితి అంతంత మాత్రంగానేవుంది. ప్రజలూ, వారి నిత్యజీవితావసరాలూ, ఆడంబరాలూ, పెరిగినంతగా వస్తూత్పత్తి పెరగడంలేదు. వస్తు వినియోగానికి తగ్గట్టుగా ఉత్పత్తి పెరగాలి. "గరీబీ హటావో" నినాదానికి ప్రధాన లక్ష్యం యిదే. మన సహజ సంపదలను వెలికిదీసి, సాంఘికాభ్యున్నతికి వినియోగించే లక్ష్యంతో కలిసికట్టుగా కృషి చేద్దాం

ఆరు సూత్రాల పథకాన్ననుసరించి పరిపాలనా ట్రిబ్యునల్ ఏర్పాటు

రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ 1975 మే 19 వ తేదీన ఒక ప్రకటనలో రాజ్యాంగ చట్టంలో 371 (డి) ఆర్టికల్‌కు సంబంధించి సర్వీసుల విషయికంగా వచ్చే యిబ్బందులను పరిష్కరించేందుకు ఆంధ్ర ప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్ ఉత్తరువును జారీచేశారు. 1972 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడ్డ స్తబ్దతను తొలగించిన ఆరు సూత్రాల పథకంలోని నాలుగవ అంశానికి అనుసంధానంగా యీ ఉత్తరువు జారీచేశారు. పరిపాలనా ట్రిబ్యునల్‌ను ఇప్పుడు సర్వీసులో వున్న హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షుడుగాను, మరో యిద్దరికి తక్కువగాకుండా దేశాధ్యక్షునిచే నియమితులయిన సభ్యులతోను ఏర్పాటుచేస్తారు. కేంద్రం ప్రకటించిన తేదీ లగాయితు యీ ట్రిబ్యునల్ పనిచేయడం ప్రారంభిస్తుంది.

రాజధాని విశేషాలు

—శ్రీ తిరుమల రామచంద్ర

నిజాం నవాబుల ఏడు తరాల వైభవ నివాసమైన కింగ్ కోఠీ ప్రాసాద సమూహం ఇక చరిత్రలో కనిపించదు. ఇన్‌కంటాక్స్ శాఖ వారు 15 యకరాల ప్రాంతం ఆక్రమించివున్న ఈ ప్రాసాద సమూహాన్ని గడిచిన మార్చి నెలలో 22 లక్షల రూపాయలకు కొన్నారు. ఇకమీద ఈ ప్రాసాదసమూహం, ఇన్‌కంటాక్స్ కార్యాలయానికి, ఆ శాఖ ఉద్యోగుల నివాసానికి వినియోగించ బడుతుంది.

సంచార నేత్ర చికిత్సా శిబిరాలు

ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ కోదాటి రాజమల్లు ఏప్రిల్ 6వ తేదీన ఒకచోట ప్రసంగిస్తూ పేదల సౌకర్యం కోసం ప్రభుత్వం నెల కొకమారు సంచార నేత్ర చికిత్సా శిబిరాలు నిర్వహించదలచిం దని ప్రకటించడం నేత్ర రోగులకు ఎంతో ఆనందం కలిగించింది. పద్మశ్రీ డాక్టర్ శివారెడ్డి, ఆయన సహచరులు సంచార నేత్ర చికిత్సా శిబిరాలను ఏర్పాటు చేసి చేస్తున్న కృషిని శ్రీ రాజమల్లు ప్రశంసిస్తూ, సేవాభావంతో ఈలాంటి సత్కార్యం చేస్తున్న వారిని ప్రభుత్వం తగువిధంగా బహూకరిస్తుందని అన్నారు.

ఛార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర

పరిశ్రమల శాఖామాత్యులు శ్రీ పి. బసిరెడ్డి ఏప్రిల్ 5వ తేదీన జూబిలీ హాలులో భారత ఛార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ దక్షిణ ప్రాంతీయ సంఘం ద్వితీయ మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతూ, పన్నులు ఎగవేసే వారిని ప్రభుత్వానికి పట్టి ఇవ్వడంలో ఛార్టర్ అకౌంటెంట్ల పాత్ర గొప్పదని అన్నారు. ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఆర్థిక సంబంధమైన చట్టాలు చేయడంలో ప్రభుత్వానికి తోడ్పడాలని ఆయన అన్నారు. "ఆడిటింగ్ చాలా ముఖ్యమైన సంగతి. ఇది చిత్త శుద్ధితో, సమర్థతతో జరిగితే, పన్నుల ఎగవేతను చాలావరకు అరికట్టవచ్చు." అని మంత్రి సూచించారు. రాష్ట్రంలో వున్న కొన్ని మోసపు పరిశ్రమలను ఆయన ప్రస్తావించి, ఆడిటర్లు ఈలాటి పరిశ్రమలు ముడిపదార్థాలను తీసుకొనడం అమ్మడం మొదలైన వాటిలో చేస్తున్న మోసాలను కనిపెడితే దేశానికి ఎంతో మేలు చేకూరి, ప్రభుత్వానికి ఎంతో సహాయం కాగలదని, ఇలాటి దొంగ పరిశ్రమలను కనుగొనడం అకౌంటెంట్ల ధర్మమని మంత్రి ఉద్బోధించారు.

రాస్ పరాశ్రయక్రిమి రోగ పరిశోధన సంస్థ

దోమలు మలేరియా జ్వరాన్ని వ్యాపింపజేస్తాయని కనిపెట్టిన డాక్టర్ రోనాల్డ్‌రాస్ హైదరాబాద్ నగరంలోని బేగంపేటలో ఒక పెంకుల ఇంట్లో వుంటూ, మలేరియా జ్వర పీడితులకు చికిత్సచేస్తూ, ఆ ఇంట్లో కొంతభాగాన్ని తన పరిశోధనకు వాడుతూ సేవచేశారు. రాస్ స్మారక నిర్మాణ సంఘం ఏర్పడి, ఆ మహనీయుని జ్ఞాపకార్థం స్థాపించదలచిన 'రాస్ పరాశ్రయ రోగ పరిశోధన సంస్థ'కు (రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారసైటాలజీకి) ఏప్రిల్ 9వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియాలోని ప్రాంతీయ నిర్దేశకుడు డాక్టరు వి. టి. హెచ్. గుణరత్నే ప్రారంభోత్సవం జరిపారు. ఇలాటి సంస్థను డాక్టర్ రోనాల్డ్ రాస్ పేర స్థాపించడం ఎంతో సముచిత మని డాక్టర్ గుణరత్నే ప్రశంసించారు. ప్రస్తుతం భారత వైమానిక శాఖవారు తమ శిక్షణకోసం వాడుతున్న రాస్ పాత ఆస్పత్రి కట్టడాన్ని తమకు అప్పగించాలనే రాస్ స్మారక నిర్మాణ సంఘం వారి కోరికను ఆయన సమర్థించారు. ఈ సంస్థ ఆరునెలలుగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పని కొనసాగిస్తున్నది. కాని, ఏప్రిల్ 9వ తేదీన రాస్ పరిశోధనలు జరిపినచోట లాంఛనంగా ప్రారంభించబడింది. ప్రారంభోత్సవ సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్‌ఛాన్సలర్ శ్రీ జగన్మోహన రెడ్డి ప్రసంగిస్తూ, భారతదేశంలో జన్మించి, మలేరియా జ్వర మూలకారణాలు కనిపెట్టి నోబెల్ బహుమానం పొందిన డాక్టర్ రాస్ హైదరాబాద్‌లో వుండి తన పరిశోధనలు కొనసాగించడం తెలుగువారికి గర్వకారణమ న్నారు. రాస్ స్మారక నిర్మాణానికి శ్రీ జగన్మోహనరెడ్డి అధ్యక్షులు కూడా. ఉపాధ్యక్షుడు డాక్టరు బంకట్‌చంద్ర.

ఆర్మీ ఆర్డినెన్స్ ద్విశత వార్షికోత్సవం

కేంద్ర రహదార్ల శాఖా ఉపమంత్రి శ్రీ జగన్నాథ్ పహాడియా ఏప్రిల్ 8వ తేదీన భారత సైన్యం తాలూకు ఆర్డినెన్స్ కోర్ ద్విశత వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఇది మూడు రోజుల పాటు జరిగింది. కర్నల్ ఎ.డి. మోహూని సైనిక విన్యాసాలకు నాయకత్వం వహించగా, లెఫ్టినెంట్ జనరల్ ఎస్. ఎన్. ముబాయి సైనిక వందనం స్వీకరించారు. శ్రీ జగన్నాథ్ పహాడియా తమ ప్రసంగంలో ఆర్డినెన్స్ దళం సేవను ప్రశంసిస్తూ, "యుద్ధ రంగంలో పోరాడుతున్నవారికి ఆయుధాలు, తక్కిన అవసరాలు సరఫరా చేయడంలో ఈ దళం పాత్ర అతిముఖ్యమూ, అనివార్యమూ అయినది" అన్నారు. ఈ దళానికి తగిన తపాలా సౌకర్యాలు కలిగిస్తామని ఆయన హామీ యిచ్చారు.

సాహిత్యంలో పాలనా వ్యవస్థ

శ్రీమతి డి. శ్యామలాదేవి
శ్రీ పి. కృష్ణప్రసాద్

సాహిత్యమనునది ఒక కళ. సృజనాత్మక భావాలకు అక్షరరూపమే సారస్వతము. సమాజపరమైన యదార్థ స్వరూపమును నిరూపించునది ఏదైననూ ఆ సమాజ పాలనావ్యవస్థ పరిశీలనతో సంబంధము కలిగియుండునని ఒక భావన. రచయిత పాత్రి భావవ్యక్తీకరణముతోనూ, విషయవ్యక్తీకరణ, భావప్రవాహము లతో కూడినదిగా వర్ణితమైనది. ఏ దేశ సౌభాగ్యమైననూ ముఖ్య ముగా పరిపాలన సంస్థలపై ఆధారపడి యుండునని, వానిలో సారస్వ తము ఒకటి అని శ్రీ అడవి బాపిరాజుగారు తమ 'కోణంగి' నవ లలో పేర్కొనియున్నారు. ఈ సంస్థ రాజకీయ మరియు పాలనా వ్యవస్థకు మార్గదర్శియని చెప్పవచ్చును. సారస్వతము పాలనా వ్యవస్థలోని తప్పొప్పులను ఎంచటంద్వారా ప్రయోజనకారి కాగలదు. కాని తెలుగు సారస్వతము యదార్థస్వరూపమును బయల్పరచ గలుగుచున్నారా? అనునది పరిశీలించదగిన విషయము

పరిపాలనావ్యవస్థ, ఆంగ్లభాషాపదమైన 'బ్యూరోక్రసి' అను దానికి మారుగా ఈ వ్యాసములో ఉపయోగించబడింది. ప్రత్యక్షం గానో, పరోక్షంగానో ప్రభుత్వ ధనముచేత పోషింపబడుతూ, పాలనా సంబంధమైన కార్యకలాపములు నిర్వహించేవారిని, పర్య వేక్షించేవారికి సాధారణంగా పరిపాలనాధికారులు అందుము. ఈ వ్యవస్థ వివిధ అంతరువులతో, వివిధములైన విధులను నిర్వహించుటకు వీలుగా పటిష్టమైన నిర్మాణము (Hierarchical structure) కలిగి ఉంటుంది. మామూలుగా చెప్పవలెనంటే కార్యనిర్వాహణం వారి ధ్యేయం. దీనికిగాను వారికి కొంత అధికారం, బాధ్యత యివ్వబడినవి.

రచనలు వివిధ ప్రకృతులు కలిగి ఉండును. గాన రచనా స్వభావములనుబట్టి రచయితలను నాలుగు తరగతులుగా విభజింప వచ్చును. మొదటి తరగతి రచయితలు సాంప్రదాయపరమైన భావాలతో కూడిన రచనలు చేయుదురు. రెండవ తరగతి రచయితలు పాశ్చాత్య పద్ధతులచే ప్రభావితులైనట్టుగా కన్పట్టును మూడవ తరగతి రచయితలను విప్లవ రచయితలుగా పేర్కొనవచ్చును వీరి రచనలు తీవ్ర స్వభావముగలిగి త్వరితగతి మార్పులకొరకు ఉద్దేశింప బడినవిగా ఉండును. మరియొక తరగతి రచయితలు సమస్యా పరిష్కారం ముఖ్య అంశంగా తమ రచనలలో చిత్రించెదరు.

రచయితలను నడిపించునది రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక శక్తులలో ఏదైననూ కావచ్చును. రచయిత యొక్క సామా జిక స్థితి ఆర్థిక పరిస్థితులు, పెరిగిన వాతావరణము, మరియు అతని లోని మేధాశక్తి కొన్ని విధములైన రచనలే చేయునటులుగా, కొన్ని నియమములకు, పద్ధతులకు కట్టుబడియుండునటులుగా చేయును.

పాలనా భాగస్వాముల నడవడికను తెలుగు సారస్వతము వర్ణించినతీరు కొన్ని రచనలు ఉదాహరణగా తీసికొని పరిశీలింతము.

పాలనా వ్యవస్థ ధనిక, బీద మొదలగు వర్గతత్వములచే ప్రభావింపబడునని, ఈ రకమైన సాంఘిక పరిస్థితుల బలిష్టత, వ్యవస్థల పాక్షికాభివృద్ధికి తోడ్పడునని శ్రీ రమణమూర్తిగారు వారి 'ఇదేన్యాయం' అను కథలో వర్ణించినారు. దీని పరిణామమే సాంఘిక ఆధిక్యతయని రైల్వేకు సంబంధించిన ఇతివృత్తం ద్వారా ఋజువుపరచినారు. పాలనావ్యవస్థపై సాంఘిక ఆధిక్యత ఈ క్రింద నుడివిన విధములుగా కన్పించగలదు. ఉద్యోగస్తుడు తన చర్యలచే లాభమునొందు ప్రజలచేతనూ, బంధుమిత్రులవలననూ ప్రభావితుడగును. బంధుమిత్రులు తమ వక్తి ఉద్యోగములో ఉన్నది నిజాయితీ, కర్తవ్యము అంటూ తమ చర్యలకు ఆటంకము కల్పించుటకు కాదు అని అభిప్రాయపడుతుందురని, కొమ్మూరి వేణుగోపాలరావుగారు వ్రాసిన 'తప్పు' అను కథలో వ్యక్తపరచ బడినది. ఈ రకమైన అభిప్రాయములు ఉద్యోగస్తుని వక్రమార్గ మునకు తీసికొనిపోగలవు. సంఘ ఆధిక్యతకు గాని, బంధు మిత్రుల అభిప్రాయములకుగాని లోబడక సంస్థాధర్మములనే పాటించు వ్యక్తిని సంఘము మూర్ఖుడిగా భావించుచుండును.

ఈ విధమైన ప్రవర్తనగల వ్యక్తులకు మానవతా దృక్పథము వుండక, పశుత్వము అలవడునని 'బ్లడ్ బాత్' ద్వారా తాతినేని వెంకట నరసింగ్ రావు గారు వెలిబుచ్చినారు.

'పశుబుద్ధి' అను కథద్వారా సాధారణంగా ఉద్యోగస్థులు తమ తప్పొప్పులను ధైర్యముతో ఒప్పుకొనలేక, వారి తప్పులను వేటి పైననో మనుషులుగాని, జంతువులుగాని చూపి తమ స్వలాభము చూసుకొందురను అభిప్రాయమును కథారచయిత కీర్తిప్రియగారు వ్యక్తీకరించారు.

ఉద్యోగులలోనే పై ఉద్యోగులు క్రింది ఉద్యోగులను ఉదారభావముతో ఆదరించ లేరు. క్రిందివారు కూడా తమవలె అభిమానమున్న మనుష్యులు అనే సత్యాన్ని మరచి జంతువు కన్నా హీనంగా చూస్తుంటారని రూపకల్పనచేయబడినది. 'అల్పజీవి' రాచకొండ విశ్వనాథశాస్త్రి, 'కొరడవిరో గంధపు మాను' పుండికోట బ్రహ్మాజీరావు. ఉదాహరణకు 'అల్పజీవి' నవలలో తన కుమార్తెకు కాలికి దెబ్బతగిలిందని అందు వలన ఆలస్యమయినదని క్షమాపణకోరుచున్న గుమస్తాని, హెడ్ గుమస్తా ఏ విధంగా తూలనాడినది క్రిందివిధంగా వివరించినారు. 'మీ అమ్మాయి గిమ్మాయి! డోన్టాక్ రాట్! ప్రతిరోజు లేటుగా వస్తావు. అడిగితే ఇన్సోలెంట్ గా జవాబులుచెస్తావ్. నీ మనసులో నీవు ఏమనుకుంటున్నావ్? ఐ. సి. యస్ ఆఫీసరువా? గెజిటెడ్ ఆఫీసరువా? ఫ్యాన్ ఈజ్ ఫార్ బెటర్ దేన్ యు! షేక్స్పియర్! డిస్మిస్ అయిపోతావు' పై ఉద్యోగుల ఈ విధమైన ప్రవర్తన సాధారణ ముగా వివిధ స్థాయిలలో ఉన్న ఉద్యోగులమధ్య వివాదములను రేకెత్తించును.

కొందరు రచయితలు పాలనావ్యవస్థలో అవినీతి అంటు వ్యాధిలా ప్రబలినట్లుగా చిత్రించినారు. లంచము ముట్టనిదే ఆఫీసరు ఎద్దనుండి ప్యూనువరకు కూడ ఏపనిచేయరని పేర్కొనబడినది. ప్రబలిన లంచగొండితనము సామాన్య ప్రజల కష్టములను ఇంకా దుర్భరముచేయుచున్నది. వ్యవస్థాధర్మముల పై విజ్ఞాయితీ, నిష్పాక్షి కత మరచిన పై ఉద్యోగస్థుల చర్యలు క్రింది ఉద్యోగులకు మార్గ దర్శకములగుచున్నవి ఇది మహేంద్ర మరియు అంగర కృష్ణారావు వ్రాసిన 'నల్లగీతలు' కథలోని కథాంశము.

సంస్థలోని వివిధ కార్యాలయములలో పనిచేయుచున్న పలువురి మధ్య సదవగాహన లేనటులుగా చెప్పియున్నారు. ఒకే కార్యాలయములోయున్న ఒకరిమీద మరియొకరికి సదుద్దేశ్యములు, నమ్మకములు లేనటులుగా, ప్రతివారు తాము తప్ప మిగిలిన అందరు చెడ్డవారే అన్న అభిప్రాయముతో ఉందురని చిత్రింపబడినారు. ఉదాహరణకు 'వనశ్రీ' తమ రచన 'కురుక్షేత్రం' ద్వారా ఉద్యోగుల మనస్తత్వాలు వివరించారు. ఈ నవలలో ఆఫీసులో క్రొత్తగా చేరిన లోవర్ డివిజన్ గుమస్తాదగ్గర ఆఫీసర్ని మేనేజర్ని తిట్టడం, మేనేజర్ని హెడ్ గుమాస్తా తిట్టడం. హెడ్ గుమాస్తాని అప్పర్ డివిజన్ గుమాస్తా తిట్టడం' యివన్నీ చూస్తుంటే వాళ్ళలో వాళ్ళకి సద్భావం లేనటు మనకి సులభంగా తెలిసిపోగలదు. క్రొత్తగా చేరినవాళ్ళకు ఆఫీసు ఒక సాలెగూడులా అందులోవున్న గుమాస్తాలు ఒక్కొక్క చిక్కుదారంలా కన్పిస్తారు.

అదేనవలలో మూడు, నాల్గవతరగతి ఉద్యోగస్థులు దుర్భర జీవితములు గడుపుచున్నట్లుగా వ్రాసినారు. తమ ఆశలు, ఆశయాలు, కోరికలు నెరవేర్చుకోలేక వారు నిరాశావాదులగుచున్నారు. ఈ రకమైన నిరాశాభావము వారిలోని కర్తవ్యోత్సాహాన్ని నశింపచేస్తు న్నట్లు అభిప్రాయపడినారు. 'వనశ్రీ' గారి కథా వస్తువుకో ఇంటర్ ఫస్టుక్లాసులో పాసయ్యాననీ మెడిసన్ చదువుతానని సంతోషంగా చెప్పవచ్చిన కుమారునికి తండ్రి మౌనమే ఎదురవుతుంది. పూర్వీకులు యిచ్చిన రెండెకరాలు అమ్మి కొడుకుని మెడిసిన్ కు పంపుదామన్నా అప్లికేషన్ తెప్పించడానికి రూపాయిడబ్బులు కూడా వుండవు. చివరకు అతను తెచ్చుకొచ్చిన గోల్డుమెడల్ అమ్మి అప్లికేషన్ ఫారమ్ తెప్పించుకుంటాడు. రిజిస్ట్రేషన్ ఫీజుకి డబ్బుల్లేక చివరకి ప్రభుత్వం ఇచ్చే ఫీజుతీసుకొనైనాసరే కొడుకుని మెడిసిన్ కు పంపాలని మంచానపడివున్న తండ్రి ట్రెజరీ ఆఫీసుకు వెళ్లి రిక్షా అయినా దిగ కుండానే చచ్చిపోతాడు. ఫలితం, గుమస్తా కొడుకు మళ్ళీ గుమాస్తా కావడమే. డాక్టర్ కావలసినవాడు గుమాస్తా అయితే నిరాశకాక ఏం మిగులుతుంది? ఇదేవిధంగా 'ఊబిలో దున్న' నవలలో వినుకొండ నాగరాజు గారు గుమస్తాజీవితాన్ని వర్ణించియున్నారు.

ఈ నాడు జరుగుతున్న ఇంటర్వ్యూలలోను, ప్రమోషన్లలోను చాలా అవకతవకలున్నట్లుగా కొన్ని నవలలో వర్ణించినారు. శ్రీరాజ్ రచించిన 'గ్రహణం' కథలో ఎమ్. ఏ. పరీక్షలు వ్రాసి, నాలుగు సుందర ప్రదేశాలు హాయిగా చూసివచ్చిన కుమారునికి పేరుపొందిన సంస్థలో జనరల్ మేనేజర్ గా చేరమని అప్పాయింట్ మెంట్ ఆర్డర్ చేతికిస్తాడు తండ్రి. ఈ యువకుడు మేనేజర్ అయి తన స్నేహి తుడిని గుమస్తాగా చేరమని అప్పాయింట్ మెంట్ ఇస్తాడు. ఇందులో రచయిత వాడిన కొన్ని పదాలు చాలా ఆసక్తిదాయకంగా ఉన్నాయి. ఉదాహరణకు 'ఎల్లకాడులో అయినా దయ్యానికి భూతం అయ్యే' ప్రమోషన్ వస్తుందేమో గాని, మన ఆఫీసులో ఎవరికి ప్రమోషన్లు రావు. ఇలాంటి అవకాశం ఎప్పుడైనావచ్చినా ఆఫీసర్లు స్వార్థానికి పక్ష పాతానికి వినియోగించు కుంటారు. ప్రమోషన్లు వాళ్ల వాళ్లకి ఇచ్చు కుంటారు బండచాకిరీలు మనచేత చేయించుకుంటారు. ఈ ఆఫీసులో గుమస్తాగా చేరినవాడు గుమాస్తాగా రిటైరయిపోవల్సిందే. ఈ ఆసులో అర్హతలున్నవాళ్ళు చాలామంది వున్నారు. వాళ్లలో సిన్సియారిటీ ఉంది, సీనియారిటీ వుంది. డివోషను వుంది. అవసరం అనుకుంటే ఆఫీసరు ఇంటి పనులు చేయడానికి డిగ్నిటీ ఆఫ్ లేబర్ వుంది. కావాలనుకుంటే పచ్చనోట్లతో ఆఫీసర్ని దిష్టిబొమ్మని చేసే కన్విన్స్డ్ నేచర్ ఉంది." అంటూ రచయిత వర్ణించారు.

పాలనావ్యవస్థ అభివృద్ధిచెందుతున్న ప్రజాస్వామిక దేశాలలో ఆశించినంత అభివృద్ధిని తీసుకొని రాలేకపోవుట చాలామందికి తెలిసిన విషయమే. దేశాభివృద్ధి పాలనా పద్ధతి యొక్క పటిష్టతపై ఆధారపడి ఉంటుంది. ఉద్యోగస్థుల దృక్పథముల విలువల ప్రవృత్తుల ప్రభావం వ్యవస్థ పటిష్టతపై ఎల్లప్పుడూ కన్పిస్తూంటుంది. వ్యవస్థలో ఏలోపములు ఉన్నది, ఏయే పద్ధతులు అభివృద్ధికి అటం కములుగ నిలిచి నిరోధకము లగుచున్నది, దృక్పథములలో ఉన్న కుత్సితములను వీటిపై ప్రజల అభిప్రాయములను బయల్ప రచగలిగినట్టిదగు సాహిత్యం పాత్ర చాలా విలువైనది. సామాజిక స్థితి, పరిణామములు, విలువలు చర్చించుచున్న సారస్వతము, పాలనా వ్యవస్థ సంబంధమైన విషయములు, వ్యక్తీకరించుటద్వారా ఎక్కువ ప్రయోజనకారి కాగలదు. విషయములు సామాన్యమానవ పరిధిలోనికి తీసుకువచ్చి, వివరించగల శక్తి ఉన్నది, కాన పాలనావ్యవస్థపై ప్రజలలో విచక్షణాభావం ఏర్పరచి వారి విజ్ఞానం పెంపొందింప చేయవలసిన బాధ్యత కూడా సాహిత్యంపై ఉన్నది.

వివరణాత్మకంగా తెలుగులోకి తెచ్చుకోవాలి. కొత్త భావాలు వారి ఆలోచనా విధానంలో కలిసిపోతే కొత్త మాటల కూర్పు సహజంగా ఏర్పడుతుంది. మాటల కంటె కాన్సెప్ట్స్ అర్థం చేసుకోటం ప్రధానమైంది.

శాస్త్రజ్ఞులే శాస్త్ర విషయ చర్చలు, సందర్భోచితంగా కొత్త మాటలు కూర్చుకోటం సహజమైన విధానం. అకాడమీలు కోశకారులు మాటలను సృష్టించి ఇతరులను వాడుకోమనటం భాషా సహజ పరిణామానికి దోహదం కాదు. ఈ పద్ధతి ప్రపంచంలో చాలా భాషలో జరిగింది గాని సత్ఫలితాలు రాలేదు.

ద్విభాషా మిశ్ర శైలి

పరిపాలనలోను, న్యాయ స్థానాల్లోను తెలుగును ప్రవేశ పెట్టాలంటే ద్విభాషా శైలి వాడటం మొదటి మెట్టు. అంటే ఇంగ్లీషు మాటలు. పదబంధాలు అవసరమైనచోట కలిసి తెలుగు వాక్యాల్లో మాట్లాడటం, క్రమంగా తెలుగులో ఆలోచించి రాయటం సాధ్య పడ్డప్పుడు అన్యదేశ్యాల స్థానంలో దేశ్య శబ్దాలు వస్తాయి. లేదా అన్యదేశ్యాలు మన భాషలో కలిసిపోతాయి. న్యాయస్థానాల్లో వాదోప వాదాలు మిశ్ర శైలిలో జరిగినా నిర్ణయాలు కొంతకాలం ఆంగ్లంలోనే ఉండవచ్చు. మరో ఇరవై ఏళ్లలో తెలుగులోనే చట్టాలు, న్యాయ సూత్రాలు నిక్కచ్చిగా రాయటం సాధ్యమవుతుంది.

మన భాష పెరుగుదలలో గుర్తు పెట్టుకోవలసినవి

కొత్త భావాల అవగాహన కొత్త మాటలను సృష్టించటం కన్నా ప్రాథమికం. సందర్భం, వాడుక లేని పొడి మాటల సృష్టి వల్ల భాష పెరగదు.


దేశ్యాలయినా అన్యదేశ్యాలయినా మాటలు భాషలో అతకటానికి వాడుక ప్రధానం. సంస్కృతం నుంచి తెచ్చుకొన్న మాటలే తెలుగులో కలుస్తాయనుకోటం ఇంగ్లీషు, మొదలైన ఇతర భాషల నుంచి తెచ్చుకొన్నవి కలవవు అనుకోటం, భాషా స్వభావం తెలియని వాళ్లలో అపోహ, ముఖ్యంగా గ్రంథకర్తల్లోను. అధ్యాపకుల్లోను ఇది పోవాలి.

ఆధునిక విద్యా బోధనలోను, న్యాయస్థానాల్లోను. రాష్ట్ర పరిపాలనలోను కొంతకాలం మిశ్ర శైలిని సహించాలి. ప్రోత్సహించాలి. ఇలాటి శైలి మనం ప్రతిదినం వాడుతూనే ఉన్నాం. దీన్ని లిఖిత రూపంలో గూడా ఆమోదించాలి.

ఆధునిక అవసరాలకు అనువుగా భాషా బోధన విధానంలో మార్పులు రావాలి బి. ఏ. ఎం. ఏ లలో 'తెలుగు' ప్రధాన విషయంగా చదివేవారి పాఠ్య విషయంలోను శిక్షణ విధానంలోను మార్పు రావాలి.

శాస్త్ర విషయాలను గురించి స్వతంత్ర గ్రంథ రచనను ప్రోత్సహించాలి. వేరు వేరు శాస్త్రాలకు సంబంధించిన పరిశోధక పత్రికల ప్రచురణకు ప్రభుత్వం విశ్వ విద్యాలయాలు అవకాశాలు కలిగించాలి.

భాష విజ్ఞాన సాధనం. అది ఉపకరణంగా మన విజ్ఞానం ఎంత పెరిగితే భాష అంత పెరుగుతుంది. వాడుకే భాషకు జీవగర్ర



ప్రవర్తించాలి. మనశక్తి యుక్తులన్నీ ఆ లక్ష్యసాధనకు ఉపయుక్తం కావాలి. దేహదారుఢ్యంగల వారూ, బుద్ధిబలం కలవారు అందరూ సాంఘిక ఆర్థిక న్యాయప్రాతిపదిక పైన ఉజ్జ్వల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో శాయ శక్తులా కృషి చేయడానికి పరిపూర్ణమైన అవకాశం వుండాలి. మూఢనమ్మకాలకూ, స్వార్థానికీ దూరంగా వుండి కృషి చేయాలి. పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా చేపట్టిన పనియందు గౌరవాభిమానాలతో స్త్రీ పురుషులందరూ ఏకోన్ముఖంగా దీక్షతో కృషి చేయాలి.

కృషితో నాస్తి దుర్భిక్షం

ప్రకృతియందు దాగియున్న శక్తులను మనం ఉపయోగించుకోవాలి. భూగర్భంలో దాగియున్న సంపదను మనం వెలికి తీయాలి.

మనం యిదివరకే సస్య విప్లవంలో అడుగు పెట్టినాము. వ్యవసాయరంగంలో శాస్త్రీయ విజ్ఞాన సహాయంతో, యింకా యెక్కువ కృషి చేసి వ్యవసాయోత్పత్తులను అధికంగా సాధించి, తద్వారా భవిష్యన్నిర్మాణానికి గట్టి పునాదులు వేయగలము. మన శక్తి అపారమైనది. నూతన మార్గంలో మన పద్ధతులను అనుసరించి మన ఆశయాలను నూతనోత్తేజంతో నెరవేర్చుకోవడానికి మనం పాటుపడాలి.

మన పంచవర్ష ప్రణాళికలలో మన ఉజ్జ్వల భవిష్యత్తుకు రూపురేఖలు తీర్చి దిద్దడం జరిగింది. మన ఆశయాలు, మన భావితరాలవారి ఆశయాలు కూడా వాటిలో పేర్కొనబడి వున్నాయి. మూఢ విశ్వాసాల మీద కాక జ్ఞానమార్గంలో నవభారత నిర్మాణానికి పంచవర్ష ప్రణాళికల్లో పునాదులు వేయడం జరిగింది. నిరాశాపేతమైన గతనుంచి విడివడి, ఆశాజనకమైన భవిష్యత్తులో అడుగు పెట్టడమే మన ప్రణాళికల లక్ష్యమైవుంది. మన ప్రణాళిక కృషి బృహత్తరమైనది. అపూర్వమైనది. వనరులనన్నింటినీ సమీకరించి జాతినంతటినీ చైతన్యవంతం చేయడమే ప్రణాళికల ప్రధానోద్దేశ్యమై వుంది. వేలాది ప్రజలు నడుము బిగించి నూతనోత్తేజంతో కృషిచేసే కార్యక్షేత్రాలు మనకు పూజనీయములు. వ్యక్తిగత నీతి, సాంఘిక నీతి, విజ్ఞానము, హేతు బద్ధమైన వాదము యీ పునాదులపైన ఏర్పడిన మతమే జాతి మతముగా ప్రకటించబడాలి. "కృషి ఆరాధన" అనేది మన భవిష్యత్తుకు రాచబాటగా వుండాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రులు ఈ ఆరాధనా కార్యక్రమంలో యీ యజ్ఞంలో పాల్గొని అజ్ఞానము లేమి అనే పీడలను నిర్మూలన చేయాలి.

మన గత తరంవారు మనస్వాతంత్ర్యం కొరకు పాటు పడినారు మనదేశంలో అనేక గొప్ప సంఘటనలు జరుగుతున్న సమయంలో దేశస్వాతంత్ర్యం కోసం ప్రజలు ఎనలేని త్యాగాలు చేస్తున్న సమయంలో మీరు జన్మించారు. ఆకాలపు సంఘటనల ప్రభావం మీకు ప్రత్యక్షంగా తెలియదు. వారు చేసిన కృషి, త్యాగాల ఫలితాలను మనం అనుభవిస్తున్నాము. ఇప్పుడు మనం సర్వతంత్ర ప్రజాతంత్రంలో గర్వించ తగిన పౌరులుగా వున్నాము. భావితరాల వారి కొరకు ఇప్పటితరం వారు చేయదలచుకొన్నది ఏమిటి ? మనం కష్టపడి పనిచేసి భావితరాల వారికి అభివృద్ధి అనే దివ్యజ్యోతిని అందించాలి. మన పిల్లలకు మన పిల్లల పిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మనం ప్రసాదించాలి ప్రణాళికాయుతమైన జాతీయోద్యమంలో పాల్గొని భారత భాగ్యవిధాతలుగా పటిష్టమైన నవభారత నిర్మాతలుగా మనం రాణించాలి దేశభవిష్యత్తును తీర్చి దిద్దడంలో మనమంతా సముచితమైన పాత్రను నిర్వహించాలి. దీక్షతో శ్రద్ధా సక్తులతో కృషి చేయాలి. ఇదే వ్యక్తిగతంగా మనం దేశానికిచేయగలిగిన సేవ.

బహు భాషా పాండిత్యం

గత రెండున్నర దశాబ్దాలలో హైదరాబాదు తెలుగు భాషాధ్యయనానికీ తెలుగు సంస్కృతికీ గొప్ప కేంద్రంగా రూపొందింది తెలుగు సాహిత్య ప్రచారానికి పాటు పడుతున్న అనధికారసంస్థలు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలు విశ్వ విద్యాలయ అనుబంధ సంస్థల కృషిఫలితముగా ఇతర నగరాలకంటే హైదరాబాదు నగరం తెలుగు అభివృద్ధి విషయంలో ప్రధాన స్థానం ఆక్రమించింది. సాధ్యమైనంత వరకు హైదరాబాదు యొక్క సమిష్టి సంస్కృతిని పరిరక్షించేందుకు కృషిచేయాలి ఉర్దూ భాషా కేంద్రాలలో హైదరాబాదు కూడా ఒక ప్రధాన కేంద్రంగా రాణించాలి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్లభాషకు సముచితస్థానం కల్పిస్తున్నందుకు హర్షిస్తున్నాను తగిన విధంగా ప్రయత్నాలు చేయనిదే ఆంగ్లభాషను తొలగించడం సాధ్యంగాదు ఆధునిక విజ్ఞానానికి ఆంగ్లభాష మార్గాలు చూపుతున్నది.

ఇక్కడ భాషాశాఖలు పటిష్టంగా పని చేస్తున్నందుకు హర్షిస్తున్నాను. అయితే మన విశ్వ విద్యాలయములలో భాషావిషయాలలో అనేక మంది మంచి శిక్షణ పొందాలని కోరుతున్నాను ఒరియా, గుజరాతీ, మళయాళం వంటి భాషలను నేర్చుకొన్న తెలుగువారు చాలా అరుదుగావున్నారు. మన దేశం బహు భాషాయుతమైనదిగా వుండడం అనేది కనిపిస్తున్న యథార్థం. పరస్పర అవగాహన లేకుండా. మనం ఏకాకిగా వుండగలమా ? భారత దేశ భాషలను నేర్చుకున్న పండితులు చాలామంది వుండడం అవసరం. ఇది భావసమైక్యతకు దారితీస్తుంది. భాషలను నేర్చుకొనడానికి తగిన సౌకర్యాలు కల్పించే బాధ్యత విశ్వవిద్యాలయాలపైన వున్నది. కొన్ని సందర్భాలలో భాషలను నేర్చుకొనడం తప్పనిసరి చేయాలి.

జీవిత ధ్యేయం

పోస్ట్ గ్రాడ్యుయేట్లయి మీరందరూ యువ వయస్సులో వున్నారు. జీవితమంటే ఏమిటో మీకు కొంతవరకు తెలుసు. ఇప్పుడు జీవితపు నూతన ప్రాంగణంలో మీరు అడుగు పెడుతున్నారు. మీ కాళ్ళపై మీరు నిలబడబోతున్నారు. ఇప్పటినుంచి మీ జీవితానికి మార్గం చూపడానికి మీ అధ్యాపకులు మీకు వుండరు. ఇంతవరకు మీకు ఒక విధమైన రక్షణ, అండదండలు వుండినాయి. మీరు సుశిక్షణ పొందినారు. విశ్వవిద్యాలయపు ప్రాంగణాన్ని విడిచి. మీరు మరొక జీవితంలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటి నుంచే జీవితపు నిజమైన పాఠం మీరు నేర్చు

పంటారు. మీరు జీవితంలో ఏ రంగంలో పనిచేసినా మీ చుట్టూవున్న ప్రజలను, మిమ్మల్ని గుర్తువుంచుకొని భవిష్యత్తును తీర్చిదిద్దడానికి బాధ్యతతో వ్యవహరించాలి. మీరు చదువుకొన్న చదువువల్ల పొందిన క్రమశిక్షణ వల్ల, సమాజంలో ప్రత్యేక అర్హతగల విభాగానికి మీరు చెందినారు. బడుగు వర్గాల ప్రజలు అనే మహా సముద్రంలో మీరు ఒక ద్వీపం వంటివారు.

స్వార్థంతో, స్వలాభాపేక్షతో మీరు ఉండడం సాధ్యంకాదు. ప్రజల్ని గురించి, వారి సమస్యలను గురించి మీరు ఆలోచించవలసి వుంటుంది. వారి యోగక్షేమాల కొరకు, వారి శ్రేయస్సు కొరకు ఏమి చేయవలసి వుంటుందో మీరు ఆలోచించి పనిచేయవలసి వుంటుంది. విద్యార్థులుగా వున్నప్పుడు, జీవితంలో సౌకర్యాల కొరకు మీరు యెదురు చూచేవారు. ఇప్పుడు విద్యావంతులైన పౌరులైనారు. కనుక, ఇతరులకు సహాయపడడం మీ వంతు. విద్యావంతులైనందుకు, మీరు ఆ యోగ్యత ఆ అర్హత సంపాదించారు. స్వలాభాపేక్షతో పనిచేసే వ్యక్తి సమాజంలో పరాన్నభుక్కు వంటి వ్యక్తి అవుతాడు. అటువంటి హేయమైన పరిస్థితికి మీరు దిగజారకూడదని నా కోరిక. జాతీయ కృషిలో పాల్గొని యథాశక్తి తోడ్పడండి. మిమ్మల్ని మీరు కించ పరచుకోరాదు. మేము ఏమీ చేయలేమని భావించరాదు. మీరు నేర్చుకొన్న విద్యవల్ల చేసే కృషివల్ల ఎంతపైకి అయినా వెళ్ళగలరు. ఎంతదూరమైనా వెళ్ళగలరు. ప్రజల కొరకై పాటుపడితే (కేవలం రాజకీయాలేకాదు) మీ ప్రాముఖ్యతను మీరేగుర్తించగలరు. మీరు సాంఘిక వ్యక్తులు. మీ కొరకు సమాజం ఎంతో కృషిచేసింది. మీరు సమాజానికి ఋణపడి వున్నారు. సమాజ శ్రేయస్సుకై కృషిచేసి, ఆ ఋణాన్ని తీర్చుకోవడం మీ ధర్మం.

విద్యావంతుల ప్రవర్తన

మీరు జీవితంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొనవలసి వుంటుంది. కొన్ని సందర్భాలలో ఇతరులతో సహకరించి కృషి చేయవలసి వుంటుంది. మరికొన్ని సందర్భాలలో పోటీతో పాటు పడవలసి వుంటుంది. మీరు ఈ కృషిలో విజయలక్ష్మిని చేపట్టాలని కోరుతున్నాను. అయితే ఇతరులు నష్టపడిన ఫలితంగా మీరు విజయం పొందరాదు. విజయం పొందడానికి అక్రమ పద్ధతులను పాటించరాదు. మనము బాగుపడువాము, మనవల్ల యితరులూ బాగుపడాలి-అనేది మన జీవిత ధ్యేయంకావాలి. సంఘానికి మనం చేయవలసిన విధులను మనము గుర్తుంచుకోవాలి. అనుమానాస్పదమైన పద్ధతులు అవలంబించి పనులు సాధించారని ఎవరూవేలెత్తి చూపకుండా వుండే విధంగా మీరు ప్రవర్తించాలి. నీతి నిజాయితీలతో పనిచేస్తే, అనుకొన్నది ఏదో ఒకటి మీరు సాధించ లేక పోవచ్చు. అయితే దీని అంతిమ పరిణామం మీకు అనుకూలంగా వుంటుంది. దీని ఫలితం మీకు తృప్తిని యిస్తుంది. విద్యావంతుడైన వ్యక్తి బుద్ధిమంతుడుగా ప్రవర్తించాలి. ఇతరులతో వ్యవహరించ వలసినపుడు అతని ప్రవర్తనలో అతని బుద్ధిబలం ప్రస్ఫుటం కావాలి.

మహిళాలోకం

అఖిల దేశ సమాఖ్యయై, ఐక్యరాజ్య
సమితి మహిళల సమమని సముచితమతి
నిర్ణయించె డెబ్బది యైదు నిఖిల జనులు
దంబు మీర సమధికోత్సవంబు జరుప.

మానవాళి మనుగడను మహిళ బహుళ
పాత్ర నెన్నంగ సాధ్యమా? బ్రహ్మకైన
లెండు, సాగుడు, ముందుకు లేమలార!
లేదు అపజయంబన్నది లేశమైన

శాంతి, సమతయు, ప్రగతియు, సర్వజనుల
శ్రేయమాశించి మీరలు శీఘ్ర గతిని
సాగిపోవలె ముందుకు జంకులేక
బూజు పట్టిన భావాల మోజు వదిలి.

ఒకతె రుద్రమ, మాంచాల యొకతెగాగ
తెలుగు పడుచుల కీర్తి వెలుగు రేఖ
దేశ దేశాల వ్యాపింప దీక్షబూని
ముందు కురుకుడు వెరువక ముదితలార!

వెల్లి విరిసె నాకానాక వేళయందు
విశ్వ మహిళల విను వీధి వేగుజుక్క-
తమము తొలగి స్తబ్ధత వీడి తరుణు లెల్ల
కాంతి చైతన్య భావ సంక్రాంతి నలర!

— శ్రీ వి. పాలవెల్లి



మన శాసనసభ పనిచేసే తీరు

శ్రీ వి. సుబ్బరామశర్మ

"శాసనసభలు ప్రజావాణిని ప్రతిఫలింపచేస్తాయి. అవి ప్రజావళికి మార్గదర్శకాలుగా ఉండి ప్రజాస్వామ్యానికి రూపురేఖలు దిద్దుతాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం స్థిరపడింది. దానిని నిరంతరం పోషిస్తూ పరిరక్షించుకోవాలి. ప్రజాస్వామ్యం ఒకచోట స్తంభించిపోయేదికాదు. అది అభివృద్ధిచెందుతూ ముందుకు పోయే వ్యవస్థ. శాసనసభలు భావి అభ్యున్నతిని ముందుగానే తెలుసుకుని త్రోవ చూపాలి."

—శ్రీమతి ఇందిరాగాంధీ

1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యంసిద్ధించింది. మన దేశాన్ని మనమే పరిపాలించుకోవాలని మన భవితవ్యాన్ని మనమేస్వేచ్ఛగా తీర్చిదిద్దు కోవాలని ఎన్నో సంవత్సరాలుగా వున్నకలలు ఆనాడు ఫలించాయి సువిశాల భారతభూమిలో ప్రజానీకం అందరి శ్రేయస్సుకు అభ్యుదయానికి అవసరమైన శాసనాలు మనమే చేసుకుంటూ మనకు తోచిన విధంగా పరిపాలించుకునే హక్కును అప్పుడు సంపాదించుకున్నాం. అంటే ఆనాటి నుండి మనకు సర్వం సహాధికారం లభించిందన్నమాట. ఈ అధికారం ప్రజలందరిలోనూ నిక్షిప్తమైవున్నది అది ప్రతి భారతపౌరుడికీ చెందుతుంది.

ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టేందుకు ఇంత వరకు రెండు విధానాలున్నాయి ఒకటి పార్లమెంటరీ విధానం. ఇది ఇంగ్లాండుదేశంలో వున్నది. రెండోది అమెరికాదేశం అవలంబించిన అధ్యక్షవిధానం. మనం పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని ఎన్నుకుని అందుకు అనుగుణంగా మన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. మన రాజ్యాంగం అవతారికలో భారతప్రజలు తమ దేశాన్ని సర్వస్వతంత్ర ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా నెలకొల్పడానికి రాజ్యాంగచట్టాన్ని తాముగా ఏర్పాటు చేసుకున్నామని పేర్కొనటం జరిగింది. తాము నిర్ణయించిన లక్ష్యాలను అందులో పేర్కొన్నారు. పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సమకూర్చాలని; ఆలోచనలో, ప్రకటనలో, మతపరంగా, విశ్వాసాల్లో ఆరాధన విషయంలో స్వేచ్ఛను కలిగించాలని; ప్రతిపత్తి, అవకాశాలలో సమానత్వాన్ని కల్గించాలని; వ్యక్తిగౌరవాన్ని, జాతీయసమైక్యతను పరిరక్షిస్తూ పౌరులందరిలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలన్నవి ఆ లక్ష్యాలు.

ఈ ఉత్కృష్టమైన లక్ష్యాలను సాధించాలన్నా, సాధించిన వాటిని కాపాడుకోవాలన్నా ఎన్నో బాధ్యతలు, విధులు వుంటాయి. అవి నిర్వహించాల్సిన వివిధాంగాల ఏర్పాటు, వాటి అధికారాలు, అవి చేయాల్సిన తీరుతెన్నులు విపులంగా మన రాజ్యాంగంలో నిర్దేశించబడ్డాయి. చట్టనిర్మాణం, ప్రభుత్వనిర్వాహణా, న్యాయవిచా

రణ వంటివి మన రాజ్యాంగ విధానంలో ముఖ్యాంగాలు. వాటి ఏర్పాటు, విధులు. పరస్పర సంబంధాలను గురించి రాజ్యాంగచట్టంలో విస్పష్టమైన నియమాలు పొందుపరచబడ్డాయి.

చట్టనిర్మాణానికి సంబంధించినవి కేంద్రంలో పార్లమెంటు ఉభయసభలు, రాష్ట్రాల్లో శాసనసభలు. మన రాజ్యాంగవిధానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనానిర్వహణకు సంబంధించిన విషయాలు మూడు విధాలుగా భాగించబడినయ్యి. దేశానికంతటికీ సంబంధించిన విషయాలలో అంటే దేశరక్షణ, విదేశీవ్యవహారాలు. రైల్వేలు, తంతితపాలావంటి వాటికి శాసనాలు చేసే అధికారం కేంద్ర పార్లమెంటుకు, వాటి పరిపాలనచేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇయ్యబడింది. కేవలం రాష్ట్రాలకే సంబంధించిన విషయాలు అంటే భూమిశిస్తు, గ్రామపంచాయతీలు, ఆరోగ్యం, వైద్యం వంటి వాటికి శాసనాలుచేసే అధికారం రాష్ట్ర శాసనసభ్యులకు వాటి పాలన రాష్ట్రప్రభుత్వాలకు యివ్వబడినయ్యి. మరికొన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా శాసనాలుచేసి నిర్వహించే విషయాలున్నాయి. ఈ మూడు జాబితాలు అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడిజాబితాలలో లేని విషయాలు కేంద్ర ప్రభుత్వమే చూస్తుంది. వాటిని గురించిన శాసనాలుచేసే అధికారం పార్లమెంటుకే వుంది. కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాల మధ్య పరిపాలన, ఆర్థిక సంబంధమైన లావాదేవీలు సక్రమంగా సాగేందుకు రాజ్యాంగచట్టంలో నిర్దిష్టమైన నిబంధనలున్నాయి.

శాసనమండలి

కేంద్ర పార్లమెంటు మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు శాసనసభలున్నాయి. దిగువ సభను శాసనసభ లేక విధాన సభ అని ఎగువ సభను పరిషత్తు లేక విధాన పరిషత్తు అని పిలుస్తారు ఉభయ సభలను కలిపి శాసన మండలి అనిగాని విధాన మండలి అనిగాని పేర్కొంటారు. పార్లమెంటులోను, రాష్ట్ర శాసన సభల్లోను ఉండాల్సిన మొత్తం సభ్యులసంఖ్యకు గరిష్టపరిమితి, కనిష్టపరిమితి రాజ్యాంగంలో నిర్ణయించారు. రాష్ట్ర శాసనసభలో మొత్తం సభ్యులసంఖ్య 500లకు మించరాదని, 60కంటె తగ్గరాదని నిర్ణయించబడింది. 1956లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏర్పడినప్పుడు అందులో వున్న సభ్యులు గవర్నరుచేత నియమితుడైన ఆంగ్లోఇండియన్ సభ్యునితో కలుపుకుని 301 మంది ఉన్నారు తరువాత జరిగిన జనాభా లెక్కల దృష్ట్యా పునర్వ్యవస్థీకరించిన నియోజకవర్గాలను బట్టి శాసనసభ సభ్యులమొత్తం 288కి తగ్గింది. 1971లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణను అనుసరించి శాసనసభ సభ్యులసంఖ్య 294కు పెరుగుతున్నది. అంటే రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలు అంతమంది సభ్యులను శాసన సభకు ఎన్నుకోవాలి. కుల, మత వివక్షత లేకుండా 21 సంవత్సరాలు నిండిన స్త్రీ పురుషులచేత ఈ సభ్యులు ఎన్నుకోబడుతారు. ఈ వయోజన వోటింగు ప్రాతిపదికగా లోక్ సభకు, రాష్ట్ర శాసన సభలకు అయిదు సంవత్సరాలకొకసారి ఎన్నికలు జరుగుతాయి. కనీసం 25 ఏళ్లుండి పార్లమెంటుకు నిర్దేశించిన అర్హతలున్నవారు శాసనసభ ఎన్నికకు అభ్యర్థిగా పోటీచేయవచ్చు.

రాష్ట్ర శాసనసభ కాలపరిమితి ఆ సభ మొదటి సమావేశం నుండి అయిదు సంవత్సరాలు అయితే ఈ కాలపరిమితి లోపలే రాష్ట్రపతి సలహాప్రకారం గవర్నరు శాసన సభను సస్పెన్షనులో పెట్టవచ్చు లేదా రద్దుచేయవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రతిష్ఠంభన ఏర్పడినప్పుడు 1973 జనవరి 18 నుండి ఆ సంవత్సరం డిసెంబరు 9 వరకు మన శాసనసభ సస్పెండు చేయబడింది. ఆ కాలంలో ఉభయ సభల సమావేశాలు జరగలేదు

శాసన పరిషత్తు

ఇక శాసన పరిషత్తు నిర్మాణం ఎట్లావుంటుందో చూదాం. రాజ్యసభ మాదిరిగానే శాసన పరిషత్తు ఖాయంగావుండే సంస్థ. అయితే రాష్ట్రంలో శాసనసభ మూడింట రెండువంతుల మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదించి అప్పటికేవున్న శాసన పరిషత్తును రద్దు చేయవచ్చు. శాసన పరిషత్తులేని రాష్ట్రాలలో కొత్తగా ఎగువ సభను ఏర్పాటు చేసుకోవాలన్నా అనుసరించాల్సిన పద్ధతి యిదే.

1957 శాసన పరిషత్తుల చట్టంప్రకారం ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు నిర్మాణానికి అవకాశం ఏర్పడింది. రాష్ట్రపతి ఆర్డరు ప్రకారం 1958 జూలై ఒకటో తేదీ నుండి మన శాసన పరిషత్తు ఏర్పాటై ఆ నెల 7 నుండి పనిచేయటం ప్రారంభించింది.

రాజ్యాంగ చట్టంప్రకారం రాష్ట్ర శాసన పరిషత్తులో సభ్యుల సంఖ్య 40 మందికి తగ్గకుండా, రాష్ట్ర శాసనసభలో వున్న మొత్తం సభ్యుల సంఖ్యలో మూడోవంతుకు మించకుండా వుండాలి. ఆ విధంగానే 1957 చట్టం ప్రకారం ఆంధ్ర పదేశ్ శాసన పరిషత్తు మొత్తం సభ్యులసంఖ్య 90 వుండాలని నిర్దేశించబడింది. సభ్యుల సభ్యత్వకాలం ఆరు సంవత్సరాలు. రాష్ట్రంలోని స్థానిక పరిపాలనా శాఖల నియోజకవర్గంనుండి 31, పట్టభద్రుల నియోజకవర్గం నుండి 8, ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి 8, శాసనసభ నియోజకవర్గం నుండి 31 మందిని ఈ పరిషత్తుకు ఎన్నుకుంటారు. వీరు కాక గవర్నరు 12 మందిని నామినేటు చేస్తారు. ఈ సభ్యులలో మూడోవంతు రెండేళ్లకొక పర్యాయం పదవీ విరమణ చేయటం, ఆ స్థానాల్లో కొత్తసభ్యులను ఎన్నుకోవటం జరుగుతుంది. నామినేటు అయిన సభ్యుల విషయంలో కూడా ఇదేవిధంగా జరుగుతుంది.

ఉభయ శాసన సభలకు ఎన్నుకున్న సభ్యులు ఏదో ఒక పార్టీకిచెందిన వారుగావున్నారు. ఏ పార్టీకీచెందని స్వతంత్రులు కొందరున్నారు. ప్రస్తుతం అధిక సంఖ్యాబలంకల కాంగ్రెసు పార్టీ అధికార పక్షంగావున్నది. మంత్రులందరూ ఈ పక్షానికిచెందినవారే. అల్పసంఖ్యాబలంకల భారత కమ్యూనిస్టు పార్టీ, పీపుల్సు డెమాక్రాటిక్ ఫ్రంటు, జనసంఘం వంటి రాజకీయపార్టీల సభ్యులు ప్రతిపక్షాలకు చెందినవారు.

గవర్నరు నిర్ణయించిన ఒక తేదీన శాసనసభకు అధ్యక్షులుగా సభ్యులనుండి ఒకరిని ఎన్నుకుంటారు. అట్లాగే నిర్ణీతమైన రోజున ఉపసభాపతిని ఎన్నుకుంటారు. వీరిని స్పీకరు, డిప్యూటీస్పీకరు అంటారు. తెలుగులో వారిని సభాపతి, ఉపసభాపతి అని అంటారు. స్పీకరు ఏకారణంవల్లనైనా సభకు అధ్యక్షత వహించలేనప్పుడు

ఆయన అంగీకారంతో డిప్యూటీస్పీకరు సభకు అధ్యక్షత వహిస్తారు. శాసనసభ ప్రతి సమావేశారంభంలోను స్పీకరు శాసనసభ్యుల నుండి నలుగురిని అధ్యక్షుల పట్టికకు నామినేటు చేస్తారు. స్పీకరుగాని డిప్యూటీస్పీకరుగాని సభకు హాజరు కానప్పుడు వారిద్దరిలో హాజరైన వారి కోరికపైన అధ్యక్షుల పట్టికలో ఉన్న వారెవరైనా సభకు అధ్యక్షత వహించవచ్చు.


అదే విధంగా శాసనపరిషత్తుకూడా సభ్యులనుండి సభకు అధ్యక్షత వహించటానికి ఛైర్మను, డిప్యూటీఛైర్మనును ఎన్నుకుంటారు. వీరిని అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అని తెలుగులో అంటున్నాము. శాసనసభలో మాదిరిగానే నలుగురు సభ్యులను అధ్యక్షుల పట్టికకు నామినేటు చేయటం జరుగుతుంది.

ఉభయసభల్లోను అధ్యక్షత వహించేవారు సభాకార్యక్రమాలు క్రమబద్ధంగా జరిగేటట్లుచూస్తారు. వారు పార్టీ రాజకీయాలకు అతీతంగా వుండి నిష్పక్షపాతంతో వ్యవహరిస్తారు. సభయొక్క గౌరవ స్వాతంత్ర్యాలను నిలబెట్టటంలో శ్రద్ధ వహిస్తారు. సభ్యుల ప్రత్యేక హక్కులను రక్షించటంలో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ఈ విధి నిర్వహణలో సభకు సంబంధించినంతవరకు వారికి సర్వాధికారాలున్నాయి. వారు అలంకరించే పీఠం న్యాయస్థానంలో న్యాయాధీశుడు అలంకరించే స్థానం వంటిది. అందుచేత సభలో ఒకపక్షం గెలుపొందాలనిగాని ఇంకోపక్షం ఓడిపోవాలనిగాని ఉద్దేశించకుండా సభా కార్యక్రమాలను రాజ్యాంగసూత్రాల ప్రకారం, సభానియమావళిని అనుసరించి నడిపించటం వారి విధి.

ఉభయ సభల సమావేశాల్లో సాధారణంగా జరిగే కార్యక్రమాన్నిగురించి వివరించేముందు సమావేశాలకు సంబంధించి వాడుకలోవున్న మూడు పదాలు తెలుసుకొనటం అవసరం. ఒక రోజున జరిగే సమావేశాన్ని 'సిట్టింగ్' అంటారు. అటువంటి సిట్టింగులు కొన్నికలిస్తే అది 'మీటింగు' అవుతుంది. ఒకటిగాని అంతకుపైబడిగాని వున్న మీటింగులను కలిపి 'సెషన్' అని పిలుస్తారు. గవర్నరు ఫలానారోజునుండి ఉభయ సభల సెషన్లు ప్రారంభమవుతయ్యాని ఆదేశిస్తారు. ఆ సెషన్లు ఫలానారోజున ఆఖరవుతయ్యాని నిర్ణయించేదికూడా గవర్నరే. దీనిని సెషన్ ప్రోరోగ్ చేయటం అంటారు. గవర్నరు సమనుచేసిన సభ ప్రథమ సమావేశానికి ప్రోరోగుచేసిన సమావేశపు రోజుకు మధ్యకాలాన్ని సెషన్‌గా పరిగణిస్తారు. ఉదాహరణకు మన శాసనసభ మూడవ సెషను 1971 జనవరి 16 న ఆరంభమై మూడు మీటింగులు జరిపి 1971 సెప్టెంబరు 16 న ప్రోరోగు చేయబడింది. అట్లాగే మన శాసన పరిషత్తు ఇరవై ఒకటవ సెషను 1974 జనవరి 18న ఆరంభమై 1974 డిసెంబరు 16న ప్రోరోగు చేయబడింది. తిరిగి గవర్నరు 1975 జనవరి 27న శాసన సభను నాల్గవ సెషన్ ప్రారంభించేందుకు శాసన పరిషత్తు ఇరవై రెండవ సెషను ప్రారంభించేందుకు సమను చేశారు.

రాజ్యాంగ చట్టంలోవున్న నిబంధనలకులోబడి శాసన సభ, శాసన పరిషత్తు తమ కార్య విధానానికి, కార్యనిర్వహణకు సంబంధించిన నియమావళిని విడివిడిగా రూపొందించుకున్నాయి. ఉభయ సభల సమావేశాలలో జరిగే కార్యక్రమం అన్ని అంశాలపైన నిర్దిష్టమైన నియమాలున్నాయి. వీటిని అనుసరించే ప్రతి సమావేశపు రోజువారీ కార్యక్రమం నిర్ణయించటం జరుగుతుంది. శాసన సభ విషయంలో స్పీకరు, శాసన పరిషత్తు విషయంలో ఛైర్మను సభా నాయకులతో సంప్రదించి కార్యక్రమ నిర్వహణకమిటీల సలహాల ప్రకారం సమావేశపు రోజుల్లో జరపాల్సిన కార్యక్రమాన్ని నిర్ణయిస్తారు. ఆవిధంగా తయారైన అజెండా ప్రతులను సభ్యులకు, మంత్రులకు ముందు రోజున అందజేస్తారు; సమావేశపు రోజున ఉభయసభల్లో సభ్యుల బల్లలపైనకూడా పెడతారు. శాసనమండలి కార్యాలయం ఈ పనులన్నీ సక్రమంగా నిర్వహిస్తుంది.

(సశేషం)



మన సమాజంలో కులతత్వం పోవాలంటే ఏమి చేయాలి?

శ్రీ జె. వీరాస్వామి

"కులానికి, కులతత్వానికి అవినాభావ సంబంధం వుంది. 'నిప్పు' లాంటిది కులమైతే, 'పొగ' లాంటిది కులతత్వం. 'కులం' అనే నిప్పుతో సమాజం తగులబడుతుంటే, 'కుల తత్వం' అనే పొగ వాతావరణమంతా ఆవరించి వుంది. నిప్పు లేనిదే పొగలేదు గదా! మంటను ఆర్పకుండా, ఆపొగను పోగొట్టటానికి ప్రయత్నించటం అవివేకమైన వృథా ప్రయాస" అంటారు శ్రీ వీరాస్వామిగారు యీ వ్యాసంలో.

మన దేశంలోని అధిక సంఖ్యాకులైన హిందూ మతస్థుల యొక్క ప్రత్యేకత కులవ్యవస్థ. ఇటువంటి సాంఘిక వ్యవస్థ ప్రపంచంలో ఇంకెక్కడా కన్పించదు. భారత జాతిని నిర్జీవంచేసి దేశాన్ని విదేశీయుల దాడులకు గురిచేసి, కొన్ని శతాబ్దాలు బానిసత్వానికి లోను చేయటానికి ఎక్కువగా తోడ్పడ్డది, ఈ కుల వ్యవస్థ. లెక్కలేనన్ని కులాలను సృష్టించి, మనిషికి మనిషికి మధ్య అసహజ భేదాలను కల్పించి మన సమాజాన్ని తునకలు తునకలుగా చేసింది. ఈ కులవ్యవస్థ, కొన్ని కులాలలో పుట్టిన వారు అగ్రవర్ణస్థులుగాను, మరికొన్ని కులాలలో పుట్టినవారు 'అంట రానివారుగను పరిగణింపబడుతూ, అంచెలవారిగా, హెచ్చుతగ్గులు కులాల రూపంలో దాపురించాయి.

"కులతత్వం పోవాలంటే ఏమి చేయాలి" అని ఆలోచించే ముందు, అసలు యీ కులతత్వం సమాజంలో ఎలా వ్యాప్తి చెందుతున్నది అని విచారించటం ప్రయోజనకరంగా వుంటుంది. దాన్నిబట్టి, ఎటువంటి చర్యలు తీసుకోవాలో తేలిపోతుంది.

జన్మతో కులం! కులంతోనే జన్మ!!

పుట్టుకతోనే పసిపాపను కులం ఆవరిస్తుంది. ఉగ్గుపాల తోనే, కులతత్వం బిడ్డకు నూరిపోయబడుతుంది. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కుల భేదాలను దైనందిన జీవితంలో పాటించటం ద్వారా, అమాయకులైన పసిపిల్లల మనసుల్లో కుల తత్వ బీజాలు నాటబడతాయి. పసికందుల హృదయాల్లో, ఆ పిన్న వయస్సులోనే కులతత్వం జొరబడుతుంది. ఎదురు ప్రశ్న వేసే శక్తి లేదుగనుక, జీర్ణం చేసుకుంటారు ఆ భావాన్ని. మంచీ, చెడ్డా తెలియని వయస్సు గనుక, తన కుటుంబ సభ్యులు, బంధు వర్గంతోపాటు తాము కూడా, యీ కులతత్వపు మొలకను నీరు పోసి పెంచుతూ, కులభేదాలను పాటించటంలో, తల్లిదండ్రులను అనుకరిస్తారు. తోటి పిల్లల్లోనే తక్కువ కులం వారితో కలిసి ఆడుకోరాదనీ, ఇంట్లోకి తీసికొని రాకూడదని, వాళ్ళ ఇళ్ళల్లో మంచినీరు త్రాగరాదని, ఏమైనా పెడితే తినకూడదని, తక్కువ కులంవారి యింట్లో ఏమైనా తింటే నాలుకపై చురక పెడ్తారని, మొదలైన బోధలన్నీ అమాయక దశలోనున్న పిల్లలకు బోధిస్తారు పెద్దలు.

ఇక పాఠశాలకు పోయే వయస్సు వస్తుంది. ఈ నాటికీ కొన్ని పల్లెటూళ్ళ బళ్ళల్లో విడిగా కూర్చోబెట్టడం ద్వారా అంట రానితనం పాటించటం జరుగుతుంటుంది. పాఠ్యపుస్తకాలు, వాచకాల్లో గూడా కులతత్వాన్ని బోధించే కథలు, పాఠాలు ఉంటాయి. "అనగా అనగా ఒక పేరుగల వ్యక్తి ఫలానా కులానికి సంబంధించినవాడు" అని కథ ప్రారంభమవుతుంది. ఇక కులాలవారి ఔన్నత్యాన్ని పొగిడే పురాణ గాథలు, కులాన్నిబట్టి గుణగణాలను బోధించే కొన్ని సూక్తులు నేర్పబడతాయి. హెచ్చు తగ్గు దృక్పథాన్ననుసరించి 'పంతులుగారు', 'శాస్త్రిగారు', 'ఎరుకలవాడు', 'చాకలివాడు' అని పాఠ్య గ్రంథాలలో ఉండటం, ఉపాధ్యాయుడు కూడా అలాంటి పద ప్రయోగం చేయటం జరుగుతుంది. ఈ రకంగా అక్షరాభ్యాసం అయిన మరుక్షణం నుంచి పాఠశాలల్లో గూడా, కులతత్వం పరోక్షంగా బోధింపబడుతుంది. అసలు బడిలో చేరేటప్పుడు, ప్రవేశ పత్రంలో కులం వ్రాయాలంటారు. ఇక, ఒకరినొకరు 'మీ కులం ఏమిటి?' అనే కొరగాని ప్రశ్న అడుక్కునే ఊహ వస్తుంది. అట్లా అడగ కూడదని చెప్పేవారే వుండకపోగా, 'వారు మన కులంగాదు', 'వీళ్ళు మన కులంవాళ్ళు' అనే భావాలను పెంపొందించే విధానం పిల్లలు గమనిస్తారు. ఈ వయస్సులోపడ్డ భావాలు, వారి మనసుల్లో గాఢంగా నాటుకుంటాయి. ఈ భావాలే, కళాశాల విద్యాస్థాయివరకు పోషింపబడి, కులతత్వపు ముఠారాజకీయాలకు లోనౌతారు.

మూఢ విశ్వాసాలు

ఇక పండుగలు—పబ్బాలు, మడి—ఆచారాలు, వడుగులు—పెళ్ళిళ్ళు, పురుళ్ళు—సూతకాలూ, పూజలూ—పునస్కారాలూ, ఆచార—వ్యవహార విషయాల్లో, ఇంకా కులం పేరుతో, అనేక మూఢాచారాల సందర్భాలలో, కులం పూర్తిగా పాటింపబడటం, ఆయా కులాలవారే సమీకృతంగావటం, సమాజంలో మనిషికీ—మనిషికీ మధ్యవున్న అడ్డుగోడలు ఎంత గట్టివో ద్యోతక మవుతుంది. వీటిని అధిగమిస్తే, అతిక్రమించినవారిని సమాజం ఎలా బహిష్కరిస్తుందో, చుట్టాలు, పక్కాలు ఎలా దూరమౌతారో గమనిస్తారు పిల్లలు. యౌవనులు, వారు అప్పటికి ఆర్జించిన శాస్త్రీయ విజ్ఞానంకన్న, పసితనంనుంచి మెదడులో కరుడుకట్టుకొని పోయిన మూఢ విశ్వాసాలే బలీయంగా పనిచేయటాన, హేతుబద్ధం కాని మూఢాచారాలవైపే మొగ్గు చూపుతూ సమాజం యొక్క మూఢ బలానికే దాసులైపోతారు.

కులాన్ని—మతం, కర్మ సిద్ధాంతం, తదితర తత్వాలతో ముడిపెట్టారు. దైనందిన జీవితంలో, ప్రతి కార్యానికి సంబంధించి మూఢ విశ్వాసాలతో గూడిన విధులు, నియమాలు, క్రోడీకరించి విధించారు. ఎదురు చెప్పినవారు కులంనుండి బహిష్కరింపబడతారు, మరో కులంలో చేరే అవకాశం కులవ్యవస్థలో లేదు. దిక్కులేని వానిగా చేస్తారు.

ఈ విధంగా సంకుచిత దృక్పథం, వివిధ కులాల మధ్య పరస్పర ద్వేషం, కులాభిమానం, మొదలైన దుర్గుణాలకు లోనైపోతారు. తమకులం ఎక్కువ కులముగా చూడబడుతున్నా, తమకంటే తక్కువ కులాలను చూసుకొని సంతృప్తితో మునిగి, తేలుతుంటారు. ఎక్కువ కులపు వ్యక్తిని, అగౌరవంగా సంబోధించటానికి వెనుదీయరు. మానవత్వంకన్న, కుల ప్రతిష్ఠ, కులగౌరవమే ముఖ్యం, వీరికి.

ఆహార, వ్యవహారాల్లో ఆంక్షలు విధిస్తుంది కులం. కుల రీత్యా కొందరు శాకాహారులు, కొందరు మాంసాహారులు. కులానికొక కులదైవం. ఎవరి గుడి వాళ్ళది. గ్రామంలోని దేవాలయం లోనికి హరిజనులు రాకూడదు. అమాటకొస్తే, లోనికి ప్రవేశిస్తే వారిని నానా హింసలు పెట్టడమే కాకుండా, వారిని లోనికి రానిచ్చినందుకు ఆ దేవుడుగూడా మైలబడ్డాడని, ఆ దేవుణ్ణి గూడ వెలివేసి, ఆ దేవాలయాన్ని పాడుబెట్టిన సందర్భాలు గూడా లేకపోలేదు. ప్రాణాధారములైన మంచి నీటి చెరువులలో, కుక్కలను గేదెలను నీరు త్రాగనిస్తూ, హరిజనులు ఆ చెరువులలో నీరు త్రాగితే వాళ్ళను నానా హింసలుపెట్టిన రోజులు నీరు మైలపడదన్న ఊహతో, ఆ నీటిని గోవుయొక్క మల మూత్రాదులనెడి మంత్ర జలముతో, శుద్ధిచేసిన మతాచార్యులు లేకపోలేదు.

జీవనోపాధికి ఎవరే వృత్తి చేయాలో, కులమే నిర్ణయిస్తుంది. ఎవరి ఇష్టమైన వృత్తి వారవలంబించి, గౌరవంగా బ్రతక నివ్వరు. కులవ్యవస్థను కాపాడే కులాలవారు. కాస్త తెల్లగుడ్డలు వేసుకొని, ఒక హరిజన వ్యక్తి గ్రామ వీథిలో నడిస్తే, 'ఎంత పొగరో చూడ' మని విస్తుపోతారు. అందరికీ విద్య అక్కరలేదని, వేదం చదివినా విన్నా, శూద్రుని నాలుక అంటరానివాని నాలుక కోయాలని, చెవుల్లో సీసం కరిగించి పోయాలని, న్యాయశాస్త్రాన్ని రూపొందించారు మనువులాంటి వారు. అదే నిజమైన ధర్మమని నమ్ముతారు, కులతత్వవాదులు.

ప్రేమకు కూడా కులం సంకెళ్ళు

ఇక వివాహ విషయానికొస్తే, తమకులంలోనే వియ్యం పొందాలనే ఆంక్ష. తన జీవిత భాగస్వామినిని ఎంచుకునే విషయంలో గూడా వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛలేదు. కులాన్ని అధిగమించి వివాహం చేసుకుంటే, బంధువర్గాలు, రాకపోకలు ఆ క్షణం నుంచి అకస్మాత్తుగా ఆగిపోతాయి. కుల ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందని, వారిపై అమానుషంగా, దౌర్జన్య కాండకు దిగి, వారిని సుఖంగా బ్రతకనివ్వరు, కులం చెడ్డారని, కులంలేనివారని అదేదో సమాజంలో అనర్హతగా ఎంచి సమాజం వారియెడల, చిన్న చూపు చూచి వారిని కష్టనష్టాల పాలుచేస్తుంది.

ఆఖరుకి, పట్టణాల్లో అద్దె ఇల్లు కావాలన్నా, ముందు "మీరెవరు" అని అడుగుతారు. "మనుషులమే" అనే సమాధానం సరిపోదు వారికి. కులం ఏమిటో కావాలి. రైలు ప్రయాణం చేస్తున్నా, కులం ఏమిటో తెలుసుకోవాలనే ఆతురత కులము తెలుసుకొన్న తరువాత, సంభాషణ ధోరణే మారిపోతూ ఉంటుంది.

అభ్యుదయ భావాలతో, హేతువాద దృక్పథంతో విద్యావంతులు, సంస్కరణాభిలాషులు, కుల రాజకీయాలను ఎదిరిస్తే వారి ముందూ, చాటునా గూడా వారిని దూషిస్తుంది సమాజం.

గోడమీద పిల్లివాటం!

ఈ బాధంతా ఎందుకులే అని, కొందరు ఆర్ద్రహృదయంతో కులతత్వానికి నాగరికతకు మధ్య నలిగిపోతూ, కనీస కుల నియమాలను పాటిస్తుంటారు. ఇంట్లో ఒక రకంగా, బయట ఒక రకం గా జీవిస్తూ, ఆత్మవంచన చేసుకుంటూ ఉంటారు. అవసరమైనప్పుడు, తద్దినానికో, పిల్లల పెండ్లికో జంధ్యం వేసుకొని, మిగతా రోజుల్లో తీసేస్తారు కొందరు. బంధువులేమనుకుంటారోనని భోజనం దగ్గర, ఆపోశనం పడతారు వాళ్ళిళ్ల దగ్గర మాత్రమే. మరి కొందరు. ఇంట్లో భార్యకు తెలియకుండా, బయట స్నేహితుల ఇండ్లల్లో, హోటళ్లలో, మాంసాహారం భోంచేస్తారు, కొందరు. ఉపన్యాసాల్లో అంతాసమానమే అని మాట్లాడినా, హరిజన బస్తీలో మంచినీళ్ల గూడా త్రాగరు, మరికొందరు. కొన్ని ప్రాంతాల హోటళ్లలో, హరిజనులని తెలిస్తే వేరే పాత్రలు, గ్లాసులు వారికి ఉపయోగిస్తారు. మరికొందరు, వర్ణాంతర వివాహాలు చేసుకోవచ్చునంటారేగాని, తమ ఇంట్లో మట్టుకు ఈ సిద్ధాంతాన్ని పాటించరు,

మనవాడు !

స్వాతంత్ర్యము వచ్చింది. ప్రతి పౌరునికి, సమాన ప్రతిపత్తి, హోదా అవకాశం కల్పించేందుకు, సర్వప్రజల శ్రేయస్సుకు

వీలు కల్పించే విధంగా, మత ప్రమేయములేని లౌకిక వ్యవస్థను స్థాపిస్తూ, ఉత్తమ రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాము. ప్రపంచ రాజ్యాంగాలలో, భారత రాజ్యాంగం మేటిగా పరిగణింపబడుతోంది. వయోజన వోటింగు హక్కు, స్త్రీ, పురుష తదితర వర్గభేదం లేకుండా, సంక్రమింప జేసుకున్నాము. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, మన రాజ్యాంగంలో పొందుపరుపబడ్డాయి. స్వాతంత్ర్యము వచ్చి రెండున్నర దశాబ్దాలు అయింది. ఇప్పటి మన పరిస్థితి ఏమిటి? ఎన్నికలలో రాజకీయ వ్యవస్థలో కులతత్వం క్రమంగా చోటు చేసుకొని, వీర విహారం చేస్తూ ఉంది. అన్ని రంగాలలో, కులతత్వం ప్రవహించి, వాతావరణాన్ని కలుషితం చేస్తూ, ఐకమత్యాన్ని పోగొట్టి మానవత్వాన్ని నశింపజేస్తూ ఉంది. కుల సంఘాలు నానాటికి పెరుగుతూనే ఉన్నాయి 'ఇందు గలడందులేడని సందేహము వలదు' అన్నట్లు ఉంది, ఈ కుల వ్యవస్థ. 'మనవాడు' అన్నదానికి, మన కులం వాడన్నదే మనదేశంలో వాడుకలో ఉన్న అర్థం. మనవాడు దొంగ వ్యాపారముగాని, కల్తీ వ్యాపారముగాని చేస్తున్నా, లంచగొండి ఐనా, మనకు దోషాలుగా కన్పించవు. పైగా, ఇతర కులాలవాళ్లు దొడ్డిదారిన సంపాదించిన ఉదాహరణలు చూపి, వాళ్లకు లేని తప్పు, మనకెక్కడిది అని సమర్థించడం, మనకు పరిపాటి. వాడిని అపరాధ విముక్తుడిగా చేయడానికి సర్వవిధముల ప్రయత్నము చేస్తాము.

అవినీతి, నానాటికి హెచ్చు అవటానికి, ఒక ప్రధానకారణం కులతత్వం. మన సాంఘిక వ్యవస్థ, ఎంత అస్తవ్యస్తంగా కలుషితంగా ఉందో, చాలామంది గమనించడంలేదు. సంపద పెద్దపెట్టున ఉత్పత్తి చేస్తే, మన లోట్లన్నీ తీరిపోతాయని, ఇన్నాళ్ల భ్రమలో ఉన్నాము. సంపద, ఉత్పత్తి, పెరగగానే, పేదరికం, దానంతట అదే పోతుందని చెప్పలేకుండా ఉన్నాము. ఎందువల్లనంటే, ఎన్నో ప్రణాళికలు రూపొందించుకొని, ఉత్పత్తి ఎక్కువ చేసుకొన్నాము. జనాభా తగ్గువలకు, కుటుంబ నియంత్రణ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాము. అయినా, పెరిగిన సంపద, సక్రమంగా పంపిణీ కావటం లేదు. పెరిగిన సంపద ఎక్కువభాగం, కొద్దిమంది బ్లాక్‌మార్కెటు వ్యాపారుల రహస్య మందిరములలోను, స్వలాభము కొరకు, ప్రజానీకానికి, ఘోరప్రమాదాలను కలుగజేస్తూ ఉన్న, కల్తీ వ్యాపారస్థుల ఆస్తిపాస్తులలోను, కష్టపడకుండా, 'ఈజీ' మనీకి అలవాటుపడ్డ స్పెక్యులేషన్ కొనుగోలు వ్యాపారస్థుల అండదండలలోను, లంచగొండి ఉద్యోగస్థులు, పన్ను ఎగవేతదారుల అదుపులోను, ఉండిపోతూ ఉంది.

ఆర్థిక అసమానతలు

సంపదను, ఉత్పత్తిచేస్తూ ఉన్న పారిశ్రామిక జనం, తాము ఉత్పత్తిచేసిన సంపదలో, తగిన పాలువంచుకోవాలి. మన దేశంలో, అనాదిగా, తక్కువ కులాలనబడేవారు, శ్రామిక జనంగా ఉంటూ వచ్చారు. కాయకష్టం చేయడం, వాళ్ళ వృత్తి. వయస్సుతో నిమిత్తము లేకుండా, కుటుంబములో, అందరు పాటుబడితేగాని భుక్తి గడవదు. పూర్వజన్మ దుష్కృతంవల్ల, తమ తమ ఖర్మల వల్ల, వాళ్ళు తక్కువగా చూడబడే కులాలలో పుట్టారు గాబట్టి, వాళ్ళ ఖర్మ అంతే అనే ధోరణి చలామణిలో ఉంది. ప్రారబ్ధ ఖర్మ, నుదుటివ్రాత, పెట్టిపుట్టటం అనే సిద్ధాంతాలు, హిందూ సమాజములో, తిష్టవేసుకొని ఉన్నాయి. ఈ దుష్ప్రభావం, కుల నిర్మూలనతోనే అంతమొందుతుంది. ఆర్థిక సమానత్వం వస్తే, సాంఘిక సమానత్వం దానంతట అదే వస్తుందనడం గూడా ఒక భ్రమే. అన్ని రోగాలకు ఒకే మందు ఇవ్వలేముగదా! గుండెజబ్బుకు కంటిజబ్బు మందు వాడలేము. వ్యాధి లక్షణాన్ని బట్టి, చికిత్స చేయాలి. సాంఘిక అసమానతలు తొలగించడానికి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సాంఘిక విప్లవ కారులు, దేశ స్వాతంత్ర్యంకంటే, సాంఘిక సంస్కరణ ముందు జరగాలని భావించారు. యుగ పురుషుడైన కందుకూరి వీరేశలింగంగారు, హిందూ సమాజం, మూఢాచారాలు, మూఢ విశ్వాసాలతో శిధిలావస్థలో ఉన్నదని, సంస్కరణ ద్వారా, సాంఘిక వ్యవస్థను, పునః నిర్మాణము చేస్తేనే తప్ప, రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినా, పూర్తిగా అనుభవించే భాగ్యం, మనకు కలుగదని చెబుతూవచ్చారు. ఆయన స్వాతంత్ర్య సమరంలో, ముఖ్య పాత్ర వహించడం లేదని, ఎంతసేపూ సాంఘిక దురాచారములను దుయ్యబట్టడంలోనే కాలం వ్యర్థం చేస్తున్నారని, ఆనాటివారు ఆయన్ని విమర్శించడం జరిగింది. కాని ఆయన వెనుకాడకుండా, తన సాంఘిక సంస్కరణ కార్యక్రమాన్ని, నిర్విఘ్నంగా కొనసాగించారు. సంఘంలో, నీతి, నిజాయితీ, ఓర్మి, ఋజువర్తన, లోపించినప్పుడు, పరిపాలనా విధానం ఏదైనా, ఫలప్రదం కాజాలదు. ఈనాడు, మన సంఘంలో ఉన్న దోషాలకు, ఒక ప్రధాన కారణం సాంఘిక పరివర్తనపట్ల, మనం శ్రద్ధవహించక పోవడమే. ఈ శతాబ్ది ప్రారంభములోనే వీరేశలింగంగారు, చెప్పిన మాటలలోని సత్యం ఈ రోజు మనకు కండ్లకు కట్టినట్లు కనబడుతోంది. స్వార్థపరత్వం పెచ్చు పెరిగి, సమాజం విలువ కోల్పోయినప్పుడు, స్వాతంత్ర్యం, అడవినగాచిన వెన్నెలలాగా నిరుపయోగమౌతూ ఉంది. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టరు అంబేద్కరు గూడా, దేశానికి రాజ్యాంగాన్ని అందిస్తూ, మనకు రాజకీయ స్వాతంత్ర్యము మాత్రమే వచ్చిందని, సాంఘిక స్వాతంత్ర్యము రాలేదని, దానిని సాధించేవరకు, భారతీయులు విశ్రమించరాదని హెచ్చరించారు. ఆ ధ్యేయంతోనే, 'హిందూ కోడ్ బిల్లు'ను, ఆయన రూపొందించి, పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదింప చేయడానికి ప్రయత్నించారు. తను అనుకున్న పద్ధతిలో, బిలు ఆమోదం పొందే అవకాశం సన్నగిల్లినప్పుడు, న్యాయశాఖ మంత్రిగా రాజీనామా చేయడానికి గూడా ఆయన వెనుకాడలేదు. కుల నిర్మూలన జరగనిదే అంటరానితనం పోదని, ఆయన స్పష్టంచేసారు. సాంఘిక వ్యవస్థ మారాలనేది, భారతీయ సమాజాన్ని కూలంకషంగా అర్థం చేసుకొన్న పెద్దల అభిప్రాయం. మన దేశంలో ఏ సంస్కరణగాని, కుల వ్యవస్థను మార్చడంతో ప్రారంభం కావలసి ఉంది. రక్త సంబంధం, ఇతర సంబంధాలకన్న విలువైనది. రక్తసంబంధం అనేది వివాహ వ్యవస్థపైన ఆధారపడి ఉంటుందనేది నిర్వివాదాంశము. వివాహ విషయంలో, వ్యక్తి స్వాతంత్ర్యం లేకుండా, సమాజపరంగా ఒత్తిడి ఉన్నంతకాలం, కులాలవారిగా, ప్రజలు విడిపోయి, అస్వాభావికమైన, వర్గాలుగా నిలిచిపోక తప్పదు.

కుల ప్రాతిపదికపై ఎన్నికలు, ప్రయివేటు ప్రాక్టీసు, వ్యాపార సరళి, పరిశ్రమల స్థాపన, రాజకీయ ఉద్దేశ వ్యవస్థల నిర్మాణం తప్పనిసరిగా ఏర్పాటు చేయవలసి వస్తుంది. పైకి వినడానికి హాస్యాస్పదంగా ఉంటుందిగాని, మన దేశంలో జరుగుతున్నది దీనికి భిన్నంగా ఉన్నదని అనగలమా?

కులానికి, కులతత్వానికి అవినాభావ సంబంధం వుంది. 'నిప్పు' లాంటిది కులమైతే, 'పొగ' లాంటిది కులతత్వం. 'కులం' నే నిప్పుతో సమాజం తగులబడుతుంటే, "కులతత్వం" అనే పొగ వాతావరణమంతా అవరించి వుంది. నిప్పు లేనిదే పొగ లేదు గదా! మంటను ఆర్పకుండా, ఆ పొగను మాత్రమే పోగట్ట డానికి ప్రయత్నించటం అవివేకమైన వృథా ప్రయాస.

కులతత్వం పోవాలంటే కులం గూడా పూర్తిగా నిర్మూ లించబడాలి. అన్ని రూపాల్లో కులం మటు మాయం కావాలి ఆనాడే సమాజంలో కులతత్వం సమసిపోయి, ఆరోగ్యవంతమైన మానవ సమాజం ఏర్పడుతుంది. కులతత్వస్థానంలో మానవత్వం వ్యాపిస్తుంది. మనుష్యులను, సంకుచిత దృక్పథంతో ఒక కులం వారుగా కాకుండా, విశాల హృదయంతో, 'మానవులు' గా చూడ గలుగుతాం.

వర్ణాంతర వివాహాలు

కులవ్యవస్థ, సంఘ ఐకమత్యానికి, శ్రేయస్సుకు గొడ్డలి పెట్టుగా ఉన్నదని ప్రజలకు తెలియజేప్పే కార్యక్రమం, ప్రభుత్వం ముమ్మరంగా చేపట్టాలి.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు, వర్ణాంతర, మతాంతర వివాహాలు, చేసుకున్న వారికి నగదు బహుమతులు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవ్యాంధ్ర నిర్మాత, సాంఘిక విప్లవాన్ని ప్రజ్వలింప చేసిన మహా యుగపురుషుడు, నాయకులు, కందుకూరి వీరేశలింగం గారి 125వ జన్మదినోత్సవం జరిపి కొందరు వర్ణాంతర వివాహాలు చేసికొన్న దంపతులను,ఆ సందర్భంలో, సన్మానం చేసి, వారి గౌరవార్థం ఒక ప్రత్యేక తపాల బిళ్లను కేంద్ర ప్రభుత్వము వారిచే, ప్రచురింపచేశారు. ఒక వర్ణాంతర వివాహము గూడా, ఆ సందర్భములో చేయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, ఈ విష యంలో మనము అభినందించవలసిఉంది. ఈ ప్రయత్నమే చాలదు. ఉధృతమైన పూనిక కావాలి.

మౌలిక స్థితిగతులు మారాలి

కులతత్వం పోవాలంటే, అది సమాజంలో వ్యాపించటానికి కారణ భూతములైన పరిస్థితులన్నిటిని మార్చాలి. అట్టి కారణాలను ఎదుర్కొని, వాటిని తొలగించుటకు కృషిచేయాలి

ముందు తరాలవారికి కులభావాలు రాకుండా జాగ్రత్త పడాలి. పుట్టబోయే పిల్లలకు కుల సంకేతాలు లేకుండా నామకరణం చేయాలి వ్యక్తులు, తమ పేర్లనుండి అట్టి కుల చిహ్నాలను తొలగించి, కులం అన్ని రూపాల్లో అదృశ్యమయ్యేట్లు చేయాలి.

ప్రతి ఒక్కరూ "కుల ప్రసక్తి లేకుండా ప్రతి విషయము లోను వ్యవహరిస్తే, మన దృక్పథంలో మార్పు వస్తుంది. మన పిల్లలకు అట్టి భావాలు ఒంట బట్టకుండా తగు జాగ్రత్త వహించాలి.

సత్వర పారిశ్రామికీకరణ ద్వారా, కుల వృత్తులు అనేవి పోయి. ఎవరికి చేతనైన వృత్తిని, వారు ఏమి ఆశించిన అట్టి చేయుటకు అవకాశాలు పెంపొందింప జేయాలి. వంశపారంపర్య వృత్తులు ఎంచుకునే వ్యవస్థ క్రమేపి పోయి, వ్యక్తి ఆసక్తి, శక్తి సామర్థ్యాలననుసరించి వృత్తులు చేబట్టే ఏర్పాట్లు ఉండాలి.

విద్యాలయాల్లో, పాఠ్యపుస్తకాలో కులతత్వాన్ని స్ఫురింప జేసే విషయాలు తొలగింపబడి, సమ సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని మానవత్వాన్ని ప్రబోధించే పాఠాలు చేర్చాలి. సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలు, సాంఘిక విప్లవోద్యమాల గురించి గ్రంథాలు రచింపజేసి బోధనా ప్రణాళికలలో పెట్టాలి. విద్యార్థులలో సమ సమాజ దృక్పథం నెలకొల్పటానికి, కులతత్వభావాలు విస్మరింప జేయటానికి, ఉపాధ్యాయులు ఎంతో కృషి చేయాలి. హేతువాద శాస్త్రీయదృక్పథం నెలకొల్పి, మూఢ విశ్వాసాలను తొలగించడానికి తగు నాన్‌డిటైల్డ్ పుస్తకాలను పాఠ్యప్రణాళికలలో చేర్చాలి.

వార్తా పత్రికలలోను, రేడియోలద్వారాను, పాఠశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలద్వారాను, సభలు, సదస్సులద్వారాను, సాంఘిక సంస్కరణలకు ఇతోధిక ప్రచారం జరగాలి సినిమాలు, స్లైడుల ద్వారా ప్రభుత్వం కులరహిత సమాజ స్థాపనకు విరివిగా, ప్రచారం సాగించాలి. కళాశాలల్లో కుల నిర్మూలన సదస్సులు నిర్వహించాలి.

సంఘ సేవకులు, ఐచ్ఛిక సంస్థలు, యువతీ యువకులు కుల నిర్మూలన కృషికి పూను కోవాలి. అందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలి.

కులాంతర వివాహాలు విరివిగా జరగాలి. ప్రభుత్వం అన్ని కులాల మధ్య అంతర్వివాహాలకు ప్రోత్సాహమివ్వాలి. అట్టి దంపతులకు, ఉద్యోగావకాశాలు కల్పించాలి. రాజకీయపార్టీలు అభ్య ర్థుల నియామకములలో కులాంతర వివాహములు చేసికొన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకు వీలు కల్పించే విధంగా రాజ్యాంగ సవరణ గావించాలి. కులాంతర దంపతులు తమసంతానానికి కుల ప్రసక్తి రానీయగూడదు.

ఆడపిల్లల వివాహ వయస్సు 18 సం॥కు పెంచి, తాము స్వతహాగా కోరిన వరుని ఎంచుకునే అవకాశం కల్పించాలి. స్త్రీకి గూడా, తల్లిదండ్రుల ఆస్తిలో, పురుషునితో పాటు సమాన వాటా వుండేట్లు, సమగ్ర సివిల్ కోడ్ రూపొందించాలి. ఆ వాటా రాకుండా చేసే పద్ధతులకు స్వస్తి చెప్పాలి. పురుషులతో పాటు స్త్రీలకు గూడా సమానంగా విద్య నేర్పించాలి. స్త్రీ పురుషుల సహవిద్యాల యాలను ఏర్పరచాలి స్త్రీలకు పూర్తి స్వాతంత్ర్యము. సమాన ప్రతి పత్తి ఉన్ననాడు, వారికి ఇష్టమైన వారినే, పురుషుల మాదిరి గానే ఎన్నుకునే పద్ధతి, అమలులోకి వస్తుంది. కట్నాల బెడద గూడా తగ్గుతుంది.

కులాల వారీగా కాలనీలు, బావులు, హాస్టళ్లు, నిషేధింపబడాలి. అందరూ కలిసి, కులప్రసక్తి లేకుండా, సహజీవనం చేసే అవకాశం కల్పించాలి.

పాఠశాల ప్రవేశ దరఖాస్తులలో, దస్తావేజులలో, ఉద్యోగ దరఖాస్తులలో, ప్రభుత్వ రికార్డులలో, జనాభా లెక్కలలో, కులముల వివరాలు సేకరించరాదు.

ఎన్నికలలో, ఓట్లకోసం కులతత్వాన్ని రెచ్చగొట్టకుండా రాజకీయ పార్టీలు వ్యక్తియొక్క నీతి నిజాయితీకి ఎక్కువ విలువ ఇచ్చి, కుల ప్రసక్తి లేకుండా సంఘసేవా పరాయణులను అభ్యర్థులుగా నిర్ణయించి, ఆదర్శ ప్రమాణాల్ని నెలకొల్పాలి. ప్రజలు కుల ప్రాతిపదికపై కాకుండా, అభ్యర్థి యోగ్యతను బట్టి ఓట్లువేసేటట్లు గట్టి ప్రచారం చేయాలి.

కొంత కాల పరిమితి వరకు యీ క్రింది చర్యలు గూడా తీసుకోవాలి

కులాల పేరట సంఘాలను నిషేధించాలి.

రిజర్వేషనుల వలన, కులతత్వం బలపడే ప్రమాదమున్నందున, కుల పద్ధతిపై రిజర్వేషనులు రద్దుజేసి, ఆర్థికంగా వెనుకబడియున్న వారందరికి, స్కాలరు షిప్పులు ఇచ్చి, వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలి.

దేవాలయాల్లో అర్చకులుగా శిక్షణ పొందటానికి అందరికి అర్హత కల్పించాలి.


వేద పాఠశాలలు మొదలైన విద్యా సంస్థలలో ఆర్థికంగా వెనుకబడి యున్న వర్గాల ప్రజలందరికి ఉపకార వేతనములిచ్చి కొన్ని సీట్లు కేటాయించాలి.

ప్రతిసంస్థ ఎన్నికలలోను, కుల ప్రసక్తి లేకుండా సాంఘిక రంగంలో కృషిచేసే వ్యక్తులను, వర్ణాంతర మతాంతర వివాహాలు చేసికొన్న వ్యక్తులను అభ్యర్థులుగా నిలబెట్టాలని, రాజకీయ పార్టీలు ఒక అంగీకారానికి రావాలి. ఓట్లకోసం కుల ప్రచారంచేసే వారిని గట్టిగా శిక్షించాలి.

ప్రైవేటు కంపెనీలలో, మరియు ఫ్యాక్టరీలలో, యజమానులు తమ కులం వారికే ఉద్యోగాలివ్వటం నిషేధించాలి. అలా చేసే వారిని శిక్షార్హులుగా చేయాలి.

ఇప్పటికైనను శాసనకర్తలును, సాంఘిక విప్లవాన్ని త్యాగనిరతితోను దీక్షలోను నిర్వహించి సమాజంలో ఏ రూపంలోను కుల ప్రసక్తి లేకుండా మార్పు తేవటానికి ప్రభుత్వమూ, ప్రజలూ కలిసి కృషి చేయాలి. ఆనాడే, సమాజంనుండి కులతత్వం తొలిగింపబడి, మానవత్వం పెంపొందుతుంది. మతాంతర వివాహాలకు గూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆర్థిక సహకారం ఇవ్వటం, హర్షించదగిన విషయం. మతం అనేది, వ్యక్తిగతమైన, నమ్మకంతో కూడుకున్న వ్యవస్థ మాత్రమే. భార్యాభర్తలు వేరువేరు రాజకీయ పార్టీలలో ఉండవచ్చు ఒకరు శాకాహారులు రెండవవారు మాంసాహారులు కావచ్చు, అలాగే వారిద్దరు వేరువేరు మతాలలో నమ్మకము ఉంచుకోవచ్చు. మతాంతర వివాహాలు గూడా జరగాలి. వారి పిల్లలకు, ఏ మతము కావాలనుకుంటే ఆ మతాన్ని వారు స్వీకరించవచ్చు. ఈ విధంగా, ఒక కుటుంబములోనే భిన్నభిన్న మతాల వారున్నప్పుడు మతపరమైన కొట్లాటలకు తావుండదు సంఘములో దేశములో అదే విధమైన సర్దుబాటు అవగాహన ఉంటే మతపరమైన విభేదాలు సమసిపోయి, మానవత్వపు విలువలు పెరుగుతాయి. కృత్రిమమైన మానవ నిర్మితములైన ఈ అడ్డంకులు భారత జాతీయ భావానికి ఐకమత్య సముద్ధరణకు అడ్డురాకుండా, మతం, భాష విడదీసే శక్తులుగా కాక సమ్మేళనపరిచే శక్తులుగా పని చేస్తాయి. మానవత్వం పెంపొందుతుంది. మానవత్వం పెంపొందితే, అంటరానితనం, కట్నీవ్యాపారం, లంచగొండితనం, తక్కిన సాంఘిక దురాచారములు నశిస్తాయి. అన్ని మతాల ముఖ్యధ్యేయం, మానవ శ్రేయస్సే గాబట్టి, మానవత్వం పెంపొంది, మానవతా వాదుల సంఖ్య దేశంలో పెరిగినప్పుడు సాంఘిక వాతావరణం బాగుపడుతుంది. కనుక కులరహిత సంఘ నిర్మాణం జరిగినప్పుడు భారత రాజ్యాంగంలో ఉదహరించిన సౌభ్రాతృత్వం సమానత్వం వ్యక్తి గౌరవంగల ఆదర్శ సమాజం మనం నిర్మించుకోగలుగుతాము.

మీదేకుల మంచు ప్రశ్న వెలయించి
చివుక్కున లేచి పోవుచో
బాకున క్రుమ్మినట్లగును
పార్థివచంద్ర ! వచింప సిగ్గగున్ —జి. జాషువ








★

తరతరాల
తెలుగు జాతి
వైభవం


★















తెలుగు గడ్డ రమ్యమైన చరిత్ర పుటలు తిరగ దోడుకొంది. సాహిత్యం, సంస్కృతి సంగమమైంది అలనాటి బమ్మెర పోతన, యఱ్ఱా ప్రెగ్గడ, సర్వజ్ఞ సింగ భూపాలుడు సత్కరించిన శ్రీనాథ కవిసార్వభౌముడు, నాగార్జునుడు మన తెలుగు తల్లి కన్న ముద్దు బిడ్డలు. పురాప్రాభవ చిహ్నాలు అమరావతి, నాగార్జునకొండ; ఇంకా ఆంధ్ర దేశమంతటా వెలసిన అలంపూర్ వంటి దేవాలయాలు; శిల్ప, చిత్ర, నాట్య, సంగీత కళా విన్నాణ సౌరభాలు; తరతరాలుగా పొంగి పొరలు తోన్న తెలుగు సంస్కృతి సంపదలు.

హైదరాబాద్ శాతవాహన నగర్‌లో యీయేటి ఉగాదినాడు ప్రారంభమై మే 18 వరకు సాగిన "తరతరాల తెలుగు జాతివైభవం" ప్రదర్శననొక శాశ్వత మ్యూజియంగా పబ్లిక్ గార్డెన్స్‌లో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రకటించారు.







వావిళ్లవారి వాఙ్మయ సేవ

శ్రీ బులుసు వెంకటరమణయ్య

గత శతాబ్ది రెండవ భాగం జరిగేవరకూ మనదేశంలో గ్రంథ పఠన పద్ధతి కష్టసాధ్యంగా ఉండేది. పాఠకులు వ్రాత ప్రతులపైనే ఆధారపడవలసి వచ్చేది. వ్రాయటకు ఎంతో కాలం పట్టేది. శ్రమపడినా అధికంగా కొన్ని వ్రాత పుస్తకాలు చదవడానికే సాధ్యంకాని రీతిని ఉండేవి. క్రమంగా పుస్తకాలు అచ్చుకావడం ప్రారంభమై కొంత సౌకర్యం ఏర్పడింది. కాని అప్పట్లో అచ్చుపడ్డ పుస్తకాలు సంతృప్తికరంగా వుండేవికావు.

అప్పుడు దొరికే కాగితం పేలుకాగితం. ముట్టుకుంటే చినిగి పోయే స్థితిలో ఉండేది. ముద్రణ పదానికీ పదానికీ మధ్య విరామం (Spacing) లేకుండా జరిగేది. ఒక్క అక్షరం పట్టే స్థలం కూడా ఖాళీగా విడవబడేది కాదు.

రీము కాగితం వెల రూపాయి. అచ్చు కూర్పు ఛార్జీ ఫారానికి రూపాయి. కావలసినన్ని అక్షరాల దిమ్మలు లేకపోతే ప–వ లు, స–న లు, శ–శ లు, జ–జ్ఞ లు ఇత్యాదులు భేదంలేకుండా ఉపయోగింపబడేవి. సంస్కరించే పండితులకు ఫారానికి రూపాయి కిట్టుబడి అయ్యేది. అచ్చుకు శుద్ధ ప్రతి వ్రాయడం, అచ్చు తప్పులు దిద్దడం పండితులు చెయ్యవలసినదే. ఆ రూపాయితోనే వారు తృప్తి పొందేవారు. ఇలా తయారైన గ్రంథాలు నిర్దుష్టంగా ఎలా ఉంటాయి? అందువల్ల పాఠకులకు శ్రమ తప్పలేదు.

ఈ విధంగా గ్రంథ ప్రకటన అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో సమర్థులూ, విద్వాంసులూ, వ్యాపార మర్మజ్ఞులూ అయిన శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులుగారు సరియైన పద్ధతిలో గ్రంథ ముద్రణకూ ప్రకటనకూ పూనుకొన్నారు.

తెల్లదనం ఏమాత్రమూ లేని పలుచని పేలు కాగితాలకు బదులుగా ముద్రణకు ఆయన ఎక్కువ వెల ఇచ్చికొని తెల్ల కాగితాలనే ఉపయోగించేవారు. పద్యాలు ముద్రించవలసి వచ్చినప్పుడు పాదానికి పంక్తి చొప్పున నాలుగు పంక్తులను ఉపయోగించేవారు. పదానికీ, పదానికీ మధ్య విరామం వుంచడంవల్ల పాఠకులకు ఎంతో సౌకర్యంగా వుండేది. ఆయన స్వయంగా గొప్ప విద్వాంసులైనందున తామే గ్రంథ సంస్కరణం చేసేవారు. అందువల్ల తప్పులు లేని చక్కని ముద్రిత ప్రతులు తయారయేవి. అంతకు పూర్వం చేతులలో యిముడని పెద్ద సైజులోనే తరచుగా పుస్తకాలుండేవి. శ్రీ శాస్త్రిగారు డెమ్మీ, క్రౌను, రాయలు మొదలైన చిన్న సైజుల్లోనే అచ్చు కూర్పించేవారు. అందువల్ల అంగళ్ళలో ఇతరుల పుస్తకాలు వున్నా వావిళ్ళ వారి పుస్తకాలకే గిరాకీ ఎక్కువగా వుండేది. వీరు వేదాధ్యయన సంపన్నులు కూడా ఆదరించిన సంస్కృతాంధ్ర గ్రంథ ములతో పాటు వేదసాహిత్యమునకు సంబంధించిన ఉపయుక్తములైన పెక్కు గ్రంథములను కూడా ప్రకటించేవారు. తెలుగులిపిలో సంస్కృత సవ్యాఖ్యా రామాయణాన్ని, భారతాన్ని తొలుత ప్రకటించిన వారు శ్రీ శాస్త్రులు గారే! ఇప్పుడు బహుళ వ్యాప్తిలో ఉన్న తెలుగు గ్రేట్ ప్రైమరు టైపును తీర్చి అక్షరములను పోతపోయించి ముత్యాల కోవవలె అచ్చుకూర్పించిన కీర్తి వీరికే దక్కినది.

1851–62 సం॥ మధ్యలో వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారు అనేక ఉద్గ్రంథములను ప్రకటించినట్లు లండనులోని బ్రిటిషు మ్యూజియం అధికారులు 1873 సం॥ లో ఇండియాలో ప్రకటితమైన గ్రంథముల జాబితాలో పేర్కొనిరి. శ్రీ శాస్త్రులవారిని గురించి సుప్రసిద్ధ తెలుగు పండితులు సి. పి. బ్రౌన్ గారిట్లు వ్రాసిరి. "చేతి వ్రాత పుస్తకములు చదువుకొనే రోజులలో వావిళ్ల రామస్వామి శాస్త్రులు గారు ముద్రణాలయమును స్థాపించి చదువరుల కష్టముల నివర్తింపజేసిరి" దీనినిబట్టి ముద్రణ వసతులు లేని ఆ రోజులలో శ్రీ శాస్త్రులవారు ఎంతటి వ్యయప్రయాసల కోర్చి ఉద్గ్రంథములను అచ్చొత్తించిరో తెలియుచున్నది.

రామస్వామి శాస్త్రులగారి ఏకైక పుత్రులు శ్రీ వేంకటేశ్వర శాస్త్రులుగారు. తండ్రిగారు మరణించునప్పటికి ఈయన వయస్సు ఆరేండ్లు. ప్రతిభాశాలియైన వేంకటేశ్వర శాస్త్రులవారు స్వల్ప వయస్సులోనే పాఠశాలా విద్యను ముగించి పచ్చయప్ప కళాశాలలో ప్రవేశించారు. అప్పటికి వీరి దృష్టి తండ్రిగారు స్థాపించిన వావిళ్ల సంస్థపై పడింది. విద్యను సాగిస్తూ సంస్థను పురోభివృద్ధికి తీసుకొని రావడం సాధ్యం కాదని యీయనకు తోచింది. సంస్థ యొక్క అభివృద్ధియే ప్రధాన లక్ష్యంగా గల వేంకటేశ్వర శాస్త్రులవారు చదువుకు స్వస్తి చెప్పి సంస్థా కార్యాలలో నిమగ్నులైనారు.

శ్రీ శాస్త్రిగారికి ఉదారమైన ఆశయాలున్నాయేగాని వాటిని కార్యరూపంలో పెట్టడానికి తగిన ఆర్థిక స్తోమత లేదు. ధైర్య సాహసాలు, మంచిపలుకుబడి మాత్రం పుష్కలంగా ఉన్నవి. వానికి తోడుగా అడిగినదే తడవుగా అప్పిచ్చే శ్రీమంతులైన మిత్రులున్నారు. అందువల్ల వీరు తలపెట్టిన కార్యాలు వెంటనే ఫలోన్ముఖానికి వచ్చేవి. చెన్నపట్నం జార్జిటౌనుకు చెందిన మలయ పెరుమాళ్లు వీధిలో ఉన్న వారి 'ఆది సరస్వతీ నిలయ ముద్రాశాల' నుండి అమూల్యమైన సంస్కృతాంధ్ర గ్రంథాలు అతి సుందరంగా తయారై ఆంధ్రుల కరతలాలను అలంకరించేవి.

తెలుగువారికి తమ భాషా వాఙ్మయాలపైని ఉన్నదే సంస్కృత భాషావాఙ్మయాలపైని కూడా అపారమైన గౌరవాభిమానాలు ఉన్నాయి. కాని అప్పటివరకూ సంస్కృత గ్రంథాలు దేవనాగరి లిపిలోనే ముద్రితాలవుతూ వుండినవి సంస్కృత పండితులలో కూడా కొందరికి దేవనాగరి లిపి తెలిసేది కాదు. సంస్కృతం అభ్యసించే విద్యార్థులు తొలుత శబ్దమంజరి, బాల రామాయణం, చదవడం పరిపాటి వారికిన్నీ మొదట్లో నాగరిలిపి తెలియదు. అట్టివారి ఉపయోగార్థం శ్రీ శాస్త్రిగారు అమరం, బాలరామాయణం, శబ్దమంజరి, పంచకావ్యాలు మున్నగువాటిని తెలుగులిపిలోనే ముద్రించి సంస్కృత భాషా వ్యాప్తికి మహోపకారం చేశారు. గనులలో రత్నాలు ఉన్నట్లుగా వ్రాత ప్రతులలో శిథిలావస్థలో ఉన్న అమూల్య గ్రంథాలను వెలికితీసి శుద్ధ ప్రతులు తయారు చేయించి చక్కగా ముద్రించేవారు.

సంస్కృత విద్వాంసులు

తెలుగుదేశంలో అప్పుడు సమర్థులైన విద్వాంసులున్నా. వారి ప్రతిభా పాండిత్యాలు వెల్లడికావడానికి తగిన అవకాశాలు ఉండేవి కావు. వేంకటేశ్వర శాస్త్రులు గారు అట్టివారికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారు కొందరిచేత గ్రంథాలను పరిష్కరింపజేసి, చక్కని విమర్శాత్మక పీఠికలను వ్రాయించేవారు. కొందరిచేత అనువాదాలను చేయించేవారు. ప్రూఫులు దిద్దే పండితులను స్థిరంగా ఏర్పాటు చేసుకొనేవారు. ప్రౌఢంగా వుండే సంస్కృతాంధ్ర గ్రంథాలకు టీకలను, తాత్పర్యాలను కొందరిచేత వ్రాయించేవారు. సుప్రసిద్ధులైన రాయదుర్గం నరసయ్యశాస్త్రిగారు శతఘంటం వేంకటరంగశాస్త్రిగారు, జనమంచి శేషాద్రిశర్మగారు, శేషాద్రి రమణకవులు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, పురాణం సూర్యనారాయణతీర్థులుగారు, వఝ్జల చిన సీతారామస్వామిశాస్త్రిగారు, ఉత్పల వేంకటనరసింహాచార్యులుగారు, అకుండి వేంకటశాస్త్రిగారు నిడుదవోలు వేంకటరావు గారు—అట్టి పండితులలో ముఖ్యులు. ఉత్పలవారు వావిళ్ళవారి ముద్రాక్షరశాలలో ప్రధాన పండితులు. ఆయన అనేక సంస్కృతాంధ్ర గ్రంథములను పరిష్కరించి వ్యాఖ్యానాలు రచించారు శ్రీ శాస్త్రిగారి ఆదరాభిమానాలు, ఆర్థిక సహాయం లేకపోతే చాలామంది విద్వాంసుల పాండిత్యం వెలుగులోకి రావడం అసాధ్యమయ్యేది.

వీరికి ప్రాచీన సంప్రదాయాలతోపాటు నవీన సంప్రదాయాల మీద, గ్రాంథికంతోబాటు వ్యావహారిక భాషమీద కూడా ఆసక్తి ఎక్కువే! శ్రీ శాస్త్రిగారికి గురజాడ అప్పారావుగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, అక్కిరాజు ఉమాకాంతంగారు ఆప్తులు. అప్పారావుగారు సంస్కరించి పెంచిన కన్యాశుల్క నాటకాన్నీ, డిసెంబరు పత్రాన్నీ తొలుత శ్రీ శాస్త్రిగారే ప్రకటించారు. ప్రాచీన కవితా సంప్రదాయాలను ఘాటుగా విమర్శించి నూతన పద్ధతిలో కవితా విమర్శచేస్తూ కళాపూర్ణోదయంపైని కట్టమంచి వారు వ్రాసిన విపుల విమర్శను వీరు ప్రకటించారు. నూతన కవిత్వంపై ధ్వజమెత్తిన అక్కిరాజువారి 'నేటి కాలపు కవిత్వం' ముద్రించారు టాగూరుగారి గ్రంథాల వ్యావహారికానువాదాలను ఎంతో చక్కగా ముద్రించారు.

జాతీయ వాది

వేంకటేశ్వరశాస్త్రి గారు గొప్ప జాతీయవాది. ఈయన శ్రీ సి రాజగోపాలాచారి (రాజాజీ) గారికీ, దివ్యజ్ఞాన సమాజ స్థాపకురాలు శ్రీమతి అనిబిసెంటమ్మ గారికీ, తీవ్ర స్వతంత్రవాది బాలగంగాధరతిలక్ మహాశయునికీ, ఆంధ్రుల ఆరాధ్య నాయకుడు శ్రీటంగుటూరి ప్రకాశంపంతులు మున్నగు ఎందరికో సన్నిహితులు. అనిబిసెంటు భగవద్గీతకు చేసిన ఆంగ్లానువాదాన్ని ఈయనయే ప్రకటించారు. తిలకు మహాశయుని గీతా రహస్యమనే కర్మయోగ శాస్త్రాన్ని మరాటీ నుండి తెలుగులోనికి ఆయన కోరికపైనే తర్జుమా చేయించి ప్రకటించారు.

శాస్త్రి గారి నివాసం పాత చాకలపేటలోను, అచ్చాఫీసు జార్జి టౌనులోను ఉండడంవల్ల మొదట్లో ఆయన కార్యకలాపాలను స్వయంగా చూచుకోవడం శ్రమగానే వుండేది వ్యాపారం దిన దినాభివృద్ధి పొందుతూ ఉండడం వల్ల, తమ నివాసానికి ప్రక్కనే ఒక విశాల భవనం నిర్మింపజేసి అందులోనికి ముద్రణాలయాన్ని మార్చారు. జార్జి టౌనులో ఉన్నప్పుడు కూడా ముద్రణాలయం 'వావిళ్ళ ప్రెస్సు'గానే వాడుకలోనికి వచ్చింది అందువల్ల కొత్త భవనంలోనికి వచ్చిన తర్వాత ప్రెస్సు పేరు 'వావిళ్ళ ప్రెస్సు' గా స్థిరీకరించబడింది నూతన యంత్ర పరికరాలు చేకూర్చబడినవి. సంస్కృతాంధ్ర గ్రంథాలతో బాటు తమిళ గ్రంథాలు, ఆంగ్ల గ్రంథాలు కూడా ప్రకటింపబడేవి. సంస్కృతాభిమానులైన ఆంధ్రేతరుల ఉపయోగం కొరకు ఎక్కువ ప్రచారంలో ఉన్న సంస్కృత గ్రంథాలు దేవనాగరి లిపిలో ముద్రింపబడేవి. సంస్కృత విద్యార్థులకనువుగా ఉండుటకు కొన్ని కావ్యాలు, నాటకాలూ ఆంగ్లానువాదాలతోనూ. ఇంగ్లీషు నోట్సుతోనూ సహా ప్రకటింప బడేవి వీరు ప్రకటించిన తమిళ గ్రంథాలలో రామాయణం, దేవనాగరి లిపిలోని మహాభారతం పేర్కొనదగినవి. దక్షిణదేశ పాఠాల ననుసరించి యీ భారతం సమర్థులైన పండితులచే సంస్కరింప బడింది. ఇట్టి బృహద్గ్రంథాన్ని దక్షిణ దేశంలో నాగరి లిపిలో శుద్ధంగా ప్రకటించిన యశస్సు వేంకటేశ్వరశాస్త్రి గారికే దక్కింది. ఆంగ్లంలో ప్రకటించిన గ్రంథాలలో భగవద్గీతకు శ్రీ అల్లాడి మహాదేవశాస్త్రి గారు కూర్చిన శంకర భాష్యానువాదం ప్రసిద్ధమైనది. ఇది విదేశీయుల ఆదర, ప్రోత్సాహాలను అందుకొన్నది.

ఆంధ్ర వాఙ్మయములో నున్న ప్రాచీన గ్రంథాలనన్నిటినీ, అవసరమైన వాటికి వ్యాఖ్యానాలతో కూడా ప్రకటించాలనీ ముఖ్యమైన సంస్కృత గ్రంథాలకు అనువాదాలను, కొత్త పుస్తకాలనూ ప్రకటించాలనీ వీరి సంకల్పం.

ఏ పండితుడు సంస్కృతాంధ్రాలలో ఏ వ్రాతప్రతిని తెచ్చినా తిరస్కరించకుండా తృణమో పణమో ముట్టజెప్పి, తృప్తిపరచి ఆ గ్రంథాన్ని ఈయన తీసుకొనేవారు. ఈ విషయంపై గ్రంథాన్ని వ్రాయాలనీ, దీన్ని తర్జుమా చెయ్యాలనీ, దీనికి చక్కని వ్యాఖ్య రచించి యివ్వాలనీ తమకు నచ్చిన విద్వత్కవులను ఈయన కోరేవారు వావిళ్ళవారు తమ గ్రంథాన్ని ప్రకటించడమే తమకు గౌరవంగా భావించి ఆ విద్వాంసులు తమ రచనలను శ్రీ శాస్త్రి గారికి అందజేసేవారు.

రకరకాల గ్రంథాలు

వావిళ్ళవారు సంస్కృతంలో వైదిక గ్రంథాలను, పురాణాలను జ్యోతిష, వైద్య, ధర్మశాస్త్ర గ్రంథాలను, వ్యాకరణ, వేదాంతములను, నిఘంటువులను, వ్రతకల్పాలను, స్తోత్రములను ప్రకటించారు. తెలుగులో భారత, భాగవత, రామాయణాలను, ప్రబంధాదులైన యితర పద్య కావ్యాలను, గద్య గ్రంథాలను, నవలలు, నాటకములు, కథలు, చరిత్రలు, జీవిత చరిత్రలు, శతకాలు, ఛందో వ్యాకరణాలంకార గ్రంథాలు, నిఘంటువులు మున్నగువాటిని స్కూలు పుస్తకాలను ప్రకటించారు. తెలుగులో ఏ పుస్తకం కావలసినా అది వావిళ్లవారివద్ద వారి ప్రచురణమే లభించేది. ఇంత పెద్ద గ్రంథ ప్రకాశన సంస్థ మరొకటి లేదనే ప్రఖ్యాతి దీనికి వచ్చింది.

వేంకటేశ్వర శాస్త్రిగారు అనుభవజ్ఞులైన విద్వాంసులు స్వయంగా కొన్ని జీవిత చరిత్రలను రచించి ప్రకటించారు. వీరి రాజాజీ గాంధీజీ, ప్రకాశం గార్ల చరిత్రలు ఎన్నదగినవి.

గ్రంథ ప్రకటనతో పాటు శ్రీ శాస్త్రిగారు 'త్రిలింగ' అనే తెలుగు వార పత్రికను, 'ఫెడరేటెడ్ ఇండియా' అనే ఆంగ్ల మాస పత్రికను నడుపుతూ ఉండేవారు. వాటిలో వీరి సంపాదకీయాలు, వాఙ్మయాభిమానులనూ, సంఘ సంస్కర్తలనూ, రాజకీయ వేత్తలనూ మిక్కిలి ఆకర్షించేవి. నిష్పాక్షికంగా, నిర్భయంగా వుండే వీరి వ్రాతలు అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించేవి

నిఘంటువులు

వావిళ్ల వారి గ్రంథ ప్రకటనలో నిఘంటువులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. మొదట్లో సంస్కృతాంధ్ర నిఘంటువును, పంచ భాషా నిఘంటువును వారు ప్రకటించారు. శంకర నారాయణ గారి ఇంగ్లీషు–తెలుగు, తెలుగు–ఇంగ్లీషు నిఘంటువులను ప్రకటించి ఒక్కొక్క కూర్పులోనూ, వందలూ, వేలూ కొత్త పదాలను చేర్పిస్తూ దానిని మిక్కిలి పెద్ద నిఘంటువుగా తయారు చేశారు. అదే ఆర్థికంగా మిక్కిలి సహకరించినది. 'వావిళ్ల నిఘంటువు' మూడు సంపుటాలు శాస్త్రిగారి జీవిత కాలంలోనే వెలువడినవి. మిగిలిన నాల్గవ సంపుటము తర్వాత పూర్తి అయింది.

గ్రంథ ప్రకటన చురుకుగా జరుగవలెననే సంకల్పంతో శ్రీ శాస్త్రిగారు 'శ్రీరామప్రెస్సు' అనే అనుబంధ ముద్రాశాలను కూడా స్థాపించారు. దానిని రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కాగితం కొరత వల్ల మూయ వలసివచ్చింది.

భావికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచి పండితులను తయారుచెయ్యాలని తలచి తెలుగు ప్రధానంగా ఎం.ఏ. చదివే కొందరు విద్యార్థులకు బస, భోజన సౌకర్యాలను కలిగించి వీరు ఆదుకొనేవారు. కొందరికి ఆర్థికంగా సహాయం చేసేవారు. వీరివల్ల ప్రతినెల ఉపకార భృతిని పొందినవారు చాలమంది వున్నారు. వీరి ఔదార్యానికీ, దయాళుత్వానికి ఇవి నిదర్శనాలు

శ్రీ వెంకటేశ్వర శాస్త్రిగారి భాషా వాఙ్మయ సేవను గుర్తించి ప్రజానీకం ఎన్నడో 'భాషోద్ధారక' బిరుదంతో వీరిని సత్కరించింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 1955 లో 'కళా ప్రపూర్ణ' బిరుదంతో గౌరవించింది,

పక్షవాత వ్యాధి వల్ల వీరు కొన్ని యేండ్లు మంచం పట్టివున్నా ఆ స్థితిలో కూడా అన్ని పనులనూ ఈయన స్వయంగానే చూచుకొనేవారు. సంస్కృతాంధ్ర గ్రంథ ప్రకటనలో సవ్యసాచియైన శ్రీ వేంకటేశ్వర శాస్త్రులు గారు 1956 సం॥ లో యశశ్శరీరులైనారు. వీరి మృతివల్ల గ్రంథ ప్రకటన కళ చాలా దెబ్బతిన్నది. తర్వాత కొంత కాలం పని జరిగినా సంస్థ చిక్కులలో పడి చివరకు తమిళనాడు హైకోర్టు పర్యవేక్షణలోనికి వచ్చింది.

నూటపాతిక సంవత్సరాలకు పైగా ప్రఖ్యాతి చెందిన వావిళ్ల సంస్థ యీ స్థితికి రావడం ఆంధ్రులందరినీ చకితులను చెయ్యడంలో ఆశ్చర్యంలేదు. ఆంధ్రులందరూ యీ సంస్థ పునరుద్ధరణ విషయమై శ్రద్ధ వహిస్తారని ఆశిస్తున్నా.

" విశ్రాంతి లేకుండా కష్టపడి పనిచేయడం మనతరం కర్తవ్యం. ఈ కాయకష్టం నిర్మాణాత్మకమైనదిగా వుండాలి. ఇది కష్టతరంగా వున్నప్పటికీ జాతి స్థాయిని పెంపొందిస్తుంది. ఈ కాయకష్టాన్ని నిర్మాణాత్మక, సృజనాత్మక మార్గంలో పెట్టి, ముందుతరాలవారు సుఖించడానికి వీలుగా దేశాన్ని పటిష్టవంతం చేయడానికి ఈ తరం శాయశక్తులా తోడ్పడిందనే పేరు తెచ్చుకోవాలి...

— పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ

తెలుగు సాహిత్యంలో భారతీయ దృక్పథం

—డా. ముదిగొండ శివప్రసాద్

మన ప్రాచీనులు కావ్య ప్రయోజనాన్ని నిర్వచిస్తూ "కావ్యం యశస్సును కలిగించాలి. అర్థాన్ని ఇవ్వాలి. వ్యవహార శక్తిని పెంపొందించాలి. శివేతరక్షతిని సాధించాలి. కాంతా సమ్మితంగా ఉపదేశాన్ని ఇవ్వాలి" అని చెప్పారు. కావ్యమంటే కేవలం రసానందాన్ని కల్గించేదే కాదు; రమణీయార్థ ప్రతిపాదకమైనదే కాదు; రసాన్ని (ధ్వనిని) అనుపానంగా చేసుకొని ఉపదేశౌషధాన్ని పరిపాలించేదేనని భారతీయాలంకారికుల దృక్పథం."

అయితే మన "జాతీయ జీవన మూల సూత్రాలేమిటి? భారతీయ సాహిత్యములోని ఆ ఉపదేశం ఏమిటి? అన్నది ప్రస్తుతం మనం గమనింపవలసివుంది. భారతీయ మహర్షులు ప్రతి విషయాన్నీ లౌకికంగానూ, ప్రయోజనాత్మకంగానూ పరిశీలించారు. వాల్మీకి వ్యాస భాస కాళిదాస రవీంద్రారవింద వివేకానంద తిరువళ్లువర్, వల్లథోల్ ప్రఖ్యాత సాహితీద్రష్టలు ఈ విధమైన భారతీయ సాహిత్యజీవనానికి వైతాళికులై నిలిచారు. వీరు తాత్కాలిక సమస్యలకు తక్కువ ప్రాధాన్యమిచ్చారు. మానవుడు ఎక్కడవున్నా అతడి కామక్రోధలోభమోహాదులూ, ప్రేమ త్యాగము దయ వంటి దైవ భావనలూ సమానంగానే వుంటాయి. ఇలియడ్ కానీయండి, రామాయణం కానీయండి భాషలు వేరైనా మానవీయ గుణాలు మాత్రం సమానమే. అందువల్ల మన మహర్షులు విశ్వజనీనమైన సార్వకాలిక, సార్వదేశికమైన మానవ లక్షణాలకు ప్రాధాన్యాన్నిచ్చే అంశాలమీద తమ సాహిత్య సోపానాలను నిర్మించారు. ఈ రకమైన ఆలోచనా విధానం మొట్టమొదటిసారి వికసించింది, భారత దేశంలోనే. అంతేకాదు; ఇంత సమగ్రంగానూ సర్వాంగీణంగానూ వికసించింది, ఈ ఒక్క దేశంలోనే! అందుకే ఇక్కడ 'దేశభక్తి' అంటే సమస్త మానవకళ్యాణ కారకమైన ఒక జీవనవిధానాన్ని ప్రేమించడం అని అర్థం. 'సర్వేజనా స్సుఖినో భవంతు సర్వేస్సంతు నిరామయాః' అన్నది మన యుగయుగాల ప్రార్థన.

జాతీయ సమైక్యతా సాధనం

సాహితీవేత్తల ముందు సువిశాలమైన ఈ సమాజం కన్పడింది. బాహిరంగా చూస్తే ఈ దేశంలో ఏకత లేదని ఎవరికైనా అనిపిస్తుంది. ఇన్ని రకాల భాషలు, వేషాలు, ఆహార వ్యవహారాలు, మతాలూ, శీతోష్ణస్థితులూ, ఇవన్నీ భిన్నత్వాన్ని ప్రతిపాదిస్తున్నాయి. కాని ఇంతటి వైవిధ్యంగల జీవనగంగా ప్రవాహంచాటున ఏదో తెలియని ఒక సరస్వతీ స్రోతస్విని అంతర్లీనంగా ప్రవహిస్తున్నది. దానిని మన ఋషులైన సాహితీవేత్తలు గమనించి గ్రహించి ఆవాహన చేశారు. ఆ ఏకతా భావనకు కవితా సుమాంజలులు సమర్పించి నివాళులెత్తారు. కాళహస్తి మాహాత్మ్యాలూ, పాండురంగ మాహాత్మ్యాలూ, కాశీఖండాలు, భౌతికదృష్టితో చూస్తే పుక్కిటి పురాణాలుగా కన్పడ్డా నిజానికి మన జాతీయ సమైక్యతకు దోహదం చేసిన గ్రంథాలు అవే! ఇవి కేవల స్థలపురాణాలేకాదు. భాషకూ, ప్రాంతానికి అతీతంగా ఈ దేశంలోని ప్రత్యంగుళమూ ప్రతి భారతీయునికీ ఆరాధనా యోగ్యమే నని నిరూపించిన ఏకతా సూత్రాలు. అతడు ఏ మతస్థుడైనాసరే హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు సందర్శించనిదే ముక్తి లేదని చెప్పారు. ముక్తి సంగతి నాకు తెలియదుగాని దేశభక్తి మాత్రం తద్వారా వస్తుంది. రామాయణం, మహాభారతం, భాగవతం సాధించినంత జాతీయ సమైక్యత కొన్ని వందలమంది జాతీయ నాయకులు సాధించిన దానికన్నాకూడా ఎక్కువేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

నిరాడంబర జీవనం

భారతీయ దృక్పథంలో 'సామాన్యజీవనమూ అసామాన్య దీక్షశక్తి' (Simple living and bigger thinking) ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది. ఇంద్రియసుఖాలను పరిమితంలో వుంచుకొని లేదా సమాజ సౌఖ్యంకోసం పూర్తిగా త్యాగంచేసి సమున్నతమైన ఆలోచనాపథంలో విహరించడం భారతీయ జీవన వైశిష్ట్యం. సరిగ్గా నేడది తల్లక్రిందులైంది. అంతస్థుల మీద అంతస్థులు భవనాలు పైకి లేస్తున్నాయి. కాని మానవుని విలువమాత్రం క్రమక్రమంగా తరిగిపోతూ పాతాళాన్ని అందు కుంటున్నది. అగ్నిలోవేసిన ఆజ్యంవలె ఇంద్రియోపభోగం సంతృప్తి పరచ ప్రయత్నించిన కొద్దీ ఇంకా జ్వలిస్తూనే వుంటుంది. ఇది గమనించని ఆధునిక సమాజం జీవితంలో ఆ భారతీయ దృక్పథాన్ని అనుసరించి భౌతిక సంపత్తిని పెంపొందించు కోవాలనిచూస్తూ దుఃఖ జీవులౌతున్నారు. తినడం కన్నా తినిపించడంలోవున్న ఆనందం గ్రహించిననాడు సమాజంలోని సమస్యలు చాలా మటుమాయం అవుతాయి. అయితే ఆ ఆనందం వ్యాపారదృష్టిగల హోటల్ యజమానికి తెలియకపోవచ్చు కాని తల్లికి మాత్రం తెలుస్తుంది భారతీయసాంస్కృతిక సతీమతల్లికి తెలుస్తుంది.

చతుర్విధ పురుషార్థసాధన

భారతీయ సాహిత్యానికి అంతర్ముఖీన దృష్టి ప్రధాన లక్షణం ఇది మానవ జీవన సాఫల్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని రచింపబడింది. మానవుడు కేవలం 'అర్థ' జీవి అని కొన్ని సమాజాలూ, కేవలం 'బుద్ధి' జీవి అని మరికొన్ని వ్యవస్థలూ నిర్వచిస్తున్నాయి. 'మానవుడు కోరికలపుట్ట' అనీ వాటిని తృప్తిపరచడంలోనే ప్రయోజనమున్నని మరి కొందరు నిర్వచిస్తున్నారు. భారతీయ సాహితీ స్రష్టలైన ఋషులు ఈ అంశాలన్నీ పరిశీలించి "చతుర్విధపురుషార్థ సాధన" ను జీవన లక్ష్యంగా నిర్వచించి దానినే సాహిత్యంద్వారా ఉపదేశించారు. కామమూ, ధర్మమూ, అర్థమూ ఈ మూడు మానవునికి

కావాలి. కామం తప్పేమీకాదు కాని అది 'ధర్మబద్ధంగా' వుండాలి. అలాగే అర్థజీవనం కూడాను. అర్థమూ కామమూ, ధర్మంచేత నియమితం చేయబడాలి. అదే 'ధర్మరాజ్యం' లేదా గాంధీజీ చెప్పిన 'రామరాజ్యం'. సాహిత్యంలో ఈ రామరాజ్య ప్రతిపాదన చేయడం వ్యాస భాస కాళిదాసుల యొక్క లక్ష్యం. ఇకపోతే చతుర్విధ పురుషార్థాలలో నాల్గవది మోక్షం. ఇది పరలోకానికి సంబంధించినది. ఇక్కడ మాత్రం వ్యక్తికి పూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వబడింది. లౌకిక రాజ్య వ్యవస్థకు భంగం రాకుండా వ్యక్తి మోక్షాన్ని గూర్చి తనకు నచ్చిన ఆరాధనా విధానాన్ని తాను స్వీకరించవచ్చునని నిర్దేశింపబడింది. అది పోయి మతాల పరస్పర సంఘర్షణ ప్రారంభమై జాతీయ ప్రయోజనం విస్మరించినప్పుడే మన దేశం పతనం చెందినట్లు చరిత్ర సాక్ష్యమిస్తున్నది. గత వేయేళ్ళ సాహిత్యంలో కూడా మన మీ సమైక్యతా భావంతోబాటు అప్పుడప్పుడు చెలరేగిన వికృతులను కూడా చూస్తాము.

వ్యక్తి కేంద్ర బిందువు

ఇంతటి బృహత్ సమాజ రచన మొత్తానికీ కేంద్ర బిందువుగా మన మహర్షులు 'వ్యక్తి'ని స్వీకరించారు. చెట్టు నుండి వచ్చిన శాఖల్లాగా శాఖల్లోని పత్రాలవలె పత్రాల చాటునవున్న పుష్పాలవలె సమాజం వివిధ వ్యక్తుల కింద విశ్లేషించబడింది. అంటే వ్యక్తుల యొక్క సమాహార స్వరూపమే సమాజం. అందువల్ల వ్యక్తికీ సమిష్టికీ మధ్య సంఘర్షణకాక సమన్వయాన్ని ప్రతిపాదించడానికి భారతీయ మహర్షులు సాహిత్యం ద్వారా ప్రయత్నించారు. అంతేకాక వ్యక్తిలో శరీరం, బుద్ధి, మనస్సు, ఆత్మ అనే భిన్నమైన అరలు వున్నాయి. వాటి నన్నింటినీ తృప్తిపరచనిదే మానవుడు 'పూర్ణపురుషుడు' కాజాలడు. కాబట్టి భారతీయ జీవన రచనలో వ్యక్తి యొక్క "సర్వాంగీణ" వికాసానికీ ప్రాధాన్యం కల్పింపబడింది.

కాళిదాసు - పెద్దన

ఇప్పుడు మనం కొన్ని ఉదాహరణలు చూద్దాము. ఆధునిక కవులు "శ్రీలుపొంగిన జీవగడ్డగా" మన దేశాన్ని వర్ణించారు. "ఓడల జెండాలు ఆడునందాక మన భూమివంటి కమ్మని భూమి లేదని" ప్రశంస చేశారు. ఈ ఆత్మాభిమానం మంచిదే! కాని "తనగీతి అరవ జాతికి" సంతం నేర్పిందనడంలో ప్రాంతీయ దురభిమానమూ జాతీయ సమైక్యతా విచ్ఛిత్తికూడా వుంది. ఇక్కడ తెలుగు దేశం, తమిళ దేశం మధ్య ప్రదేశం, అంటూ ఎన్నో దేశాలు లేవు ఉన్నది ప్రకాశవంతమైన జ్ఞానదాయకమైన 'భారత దేశం' ఒక్కటే! (భా = జ్ఞానమునందు, శాంతియందు, రత = కోరికగలది.)

అలాగే కాళిదాసు రఘువంశం వ్రాయడానికి కారణం పరిశీలించండి. ధర్మంకోసం ఒక వంశానికి వంశం ఎలా త్యాగ నిరతిలో తరించారో చెప్పడం ఆయన లక్ష్యం. కుమారసంభవంలో పార్వతి శరీర సౌందర్యం చేత శివుణ్ణి ఆకర్షించలేక తపస్సు ద్వారా ఫలసిద్ధిని పొందుతుంది ఇంద్రియాల వైఫల్యం, ఆత్మసౌందర్య ప్రశస్తి ఇందులో కాళిదాసు ప్రధానంగా చెప్పదలచాడు. తెలుగులోకి వస్తే ప్రబంధాలను మనం జఘన్య శృంగార కావ్యాలని విమర్శించడం నేడు పరిపాటి. కాని మనుచరిత్రంలో ప్రతిపాదించిందేమిటి? హిమాలయాల మీద ఒంటరిగా దొరికిన మహా సౌందర్యవతిని తిరస్కరించి, 'తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్' అంటూ ప్రవరుడు అరుణాస్పదం చేరిపోతాడు. హిమాలయాలు మన జ్ఞానానికంతా కేంద్రబిందువులు. గంగ, శివుడు, పార్వతి, విష్ణువూ, సమస్త దేవతలూ అక్కడే వున్నారనేది మన వర్ణన. అది 'దేవతాత్మ'. అక్కడ ప్రదర్శింపబడ్డ ప్రవరుని శీలం భారతీయాత్మకు దర్పణంగా చెప్పవచ్చు. ప్రవరుడు, సన్యాసీ, పురుషత్వహీనుడూ కాదూ. అతనికి సోమిదేవమ్మ వుంది. కాని 'ధర్మ విరుద్ధమైన కామం' మాత్రమే అతడు తిరస్కరించాడు. అందుకే పెద్దనగారు ఈ కథకు మణిదీపాన్ని ఎత్తి నివాళులర్పించాడు!

జాతీయ జీవన ప్రతిబింబం

సాహిత్యం జాతీయ జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే కేవలం వర్తమాన జీవనాన్ని ప్రతిబింబించడమేకాదు; మనం ఆశించే ఆదర్శసమాజ స్థాపనకు కూడా తోడ్పడుతుంది. అంటే గత భారతీయ వైభవాన్ని ప్రదర్శించడంతోపాటు భవిష్యత్తులో తిరిగి ఆ వైభవ సాధనకు సోపానంగా భారతీయాత్మను ప్రతిబింబించేందుకై తన రచన ఉపయోగపడాలని జాతీయ కవి భావిస్తాడు. "సాహిత్యానికి ప్రయోజనం కూడా ఉండాల"నే వాక్యంలోని అర్థమిదే!!

ఏ వర్గానికి చెందిన పౌరులైనాసరే, ఇతరులకు లేకుండా చేసే హక్కులూ, ప్రత్యేకావకాశాలూ, తమకుతాము ఆపాదించుకోరాదు. మతంపేరిట ఏ వ్యక్తి అనర్హతకుగాని, విచక్షణకుగాని లోనుకారాదు. అందరూ సరిసమానంగా, ఒకేవిధంగా, సామాన్య సామూహిక జీవనంలో సంపూర్ణంగా పాలుపంచుకోవాలి. ఇదే మతప్రమేయంలేని లౌకిక పరమార్థం.

—డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

తెలుగు లిపి పరిణామం

-శ్రీ తిరుమల రామచంద్ర

(గత సంచిక తరువాయి)

ఋ గుణింతం ప్రాచీన సంస్కృత శాసనాలలో అక్షరం కింది కొసను ఒక వంపు గీతతో సూచించేవారు. ఋకారోచ్చారణ ప్రాకృతంలో లేకపోవడంవల్ల ఇది సాతవాహనేక్ష్వాకులశాసనాలలో కానరాదు; సంస్కృత శాసనాలు ప్రారంభమైన తర్వాత కనిపిస్తుంది. చాళుక్యుల కాలానికే ఇది వట్రువ సుడిగా మారింది. కాని రెడ్డిరాజుల కాలంవరకు వట్రువసుడి అక్షరాన్ని అంటిపెట్టుకొని వుండేది. విజయనగర కాలానికి అక్షరాన్ని అంటిపెట్టుకోడం మానింది. సంస్కృత శాసనాలలో ఈ ఋకారాన్ని, ఋ గుణింతమయిన వట్రువసుడిని చక్కగా పాటించేవారు గాని, తెలుగు పద్యాలు, వచన భాగాలలో రి, రు గాను, క్రావడిగాను చెక్కేవారు. దీనికి కారణం ఋకారోచ్చారణ విశిష్టంగా ఉండడం. ఔత్తరాహులు దీనిని రి గా పలుకుతారు. మనం రు గా పలుకుతాము. అశోకుని శాసనాలలోనే ఇది అ, ఇ, ఉ, ఎ లుగా కనిపిస్తుంది. మృగ అనేది మగ, మిగ, ముగ, మొగ. మనం మ్రిగ, మ్రుగ లుగా వ్రాయడం కనిపిస్తుంది. ప్రిథ్వీవల్లభ చోళకుల శేఖర కులో తుంగచోళ గొంకరాజున కిష్టభ్రిత్యుండైన. ఋకారరేఫలలోని ఉచ్చారణ సామీప్యంవల్ల కలిగిన భ్రాంతితో రేఫానికి వట్రువ సుడి పెట్టడమూ విరివిగా కనిపిస్తుంది—సంతేశ్వర కొమారగురువు మహాపాత్ృల కొమారుడు తిరుమలదాసు మహాపాత్ృండు.

ఏకారం గుణింతం సూచించడానికి అశోక భట్టిప్రోలు లిపులలో ఎడమవైపున అక్షరంపైన అడ్డుగీత కనిపిస్తుంది. వేంగీ చాళుక్య లిపిలో ఈ గీత కొస ఎడమకు వంగింది. కాకతీయుల కాలంలో కొక్కెరలాగ మారింది. విజయనగర కాలానికి ఇప్పటి రూపం దగ్గరికి వచ్చింది. సంస్కృత ప్రాకృతాలలో ఎ హ్రస్వం లేదు గనుక, తెలుగు భాష వ్రాసినప్పుడు సందర్భానుగుణంగా చదువవలసి వచ్చింది. తర్వాత ఈ దీర్ఘ ఎకారాన్నే హ్రస్వంగా భావించి, దీనికి మరొక గీత కుడివైపున పెట్టారు. అది క్రమంగా కొస వంగి నేటి రూపం పొందింది. ఎ, ఏ ల ఉచ్చారణ తమిళ ప్రథమ వ్యాకరణమయిన తొల్కాప్పియంలో తెలుపబడిందని త్రికోణాకారం ఏ కారమయితే దాని మధ్యన చుక్కతో హ్రస్వం సూచించబడిందని రెండు సంవత్సరాల క్రింతం దొరికిన శాతవాహన క్రీస్తుశకం 2వ శతాబ్ది శాసనం ఒక దానిని గురించి ప్రసంగించినప్పుడు మద్రాసు మ్యూజియం క్యూరేటరు శ్రీ పి. ఎన్ మోహన్‌దాస్ తెలిపారు.

ఐ గుణింతానికి ఎ గుణింతమిచ్చి అక్షరం కుడిప్రక్కన కిందుగా అంటిపెట్టుకొన్న అరసున్న వంటి గుర్తు ఇచ్చేవారు. ఇది కాకతీయుల కాలానికి అక్షరాన్ని అంటిపెట్టుకొనడం మాని శ్రీనాధుని కాలానికి మొదట సుడి ఏర్పడింది.

ఓ గుణింతం అశోక లిపిలో అక్షరంపైన చిన్న అడ్డుగీతలు రెండు పెట్టి సూచించేవారు. ఇవి నన్నయ కాలానికి రెక్కలు విచ్చిన పక్షిలాగ అయాయి. కాని, ఓ గుణింతం ఇచ్చి, పక్కన కొమ్ముకు దీర్ఘమిచ్చి సూచించే పద్ధతి మొదటినుంచీ వుంది. ఇది అచ్చు వచ్చిన తర్వాత మ, య, హలలో మాత్రం తప్పనిసరిగా మిగిలింది. ఏమయినా ఎ, ఏ, ఒ, ఓ ల హ్రస్వ దీర్ఘాల భేదం 16వ శతాబ్ది వరకు పాటించినట్టు కనిపించదు.

ఔ గుణింతం ప్రాచీన ప్రాకృత శాసనాల్లో లేదు. నన్నయ కాలానికి నేటి ల వత్తును ఏటవాలుగా పెట్టినట్టున్న గుర్తు కనిపిస్తుంది. శ్రీనాధుని కాలానికి అసలు అక్షరానికి మించి, నేటి ఙ అక్షరం తలమీద మోపినట్లుంది. మ, య వంటి కొమ్ములున్న అక్షరాలకు కొమ్ములకు ఔత్వ మిచ్చే పరిస్థితి ఏర్పడింది.

సున్నను ఇప్పుడు మనం అక్షరం ప్రక్కన వరుసలో వ్రాస్తున్నాము. కాని, మొదట్లో అక్షరం పైనగాని, కుడివైపు పై ప్రక్కనగాని వ్రాసేవారు. అనుస్వారాన్ని అనునాసికాలకు మారుగా వాడేవారు. ఈ బిందువు అనునాసికాక్షరంతో సమానం—అమ్బుజ
ం
అబుజ మకారానికి బిందువు వాడడం అశోకుని శాసనాలలోనే ఉంది. తక్కిన అనునాసికాలకూ క్రమంగా బిందువు వాడడం అలవాటయింది. కాని హ కారానికి ముందు మాత్రం మ కారం వాడడం గిర్‌నార్ శాసనంలో కనిపిస్తున్నదని శ్రీ ఎ. సి. బర్నెల్ తెలిపారు ఈ బిందువును పంక్తిలో వ్రాయడం తెలుగులో నన్నయ కాలానికి అలవాటయింది. అక్షరం పక్కన చుక్క కనిపించక పోవచ్చుననే ఉద్దేశంతో ఈ చుక్కను నిండుగా, చంద్రమండలం లాగ గుండ్రంగా చెక్కే అలవాటయింది.


మనం ద్విత్వాక్షరాలను ఒత్తులు అంటున్నాము. మనం ఇప్పుడు ద్విత్వాక్షరాలను వ్రాసే పద్ధతి అశాస్త్రీయం. అశోక, భట్టిప్రోలు లిపులలో ద్విత్వాక్షరాలను సూచించడానికి అక్షరాలను ఒక దానిక్రింద మరొకటి చెక్కి వుండడం కనిపిస్తుంది. ద్విత్వాక్షరా

రిలో పై అక్షరం అప్రధానం, క్రిందిది ప్రధానం. గుణింతాన్ని పై అక్షరానికే చెక్కేవారు. కొంతకాలానికి లేఖకులు, లిపికారులు ఈ పొరపాటును గ్రహించి క్రింది అక్షరానికి గుణింతాలు, ఒత్తులు ఇవ్వసాగారు. తలకట్టు స్థిరపడిన తర్వాత పై అక్షరానికే గుణింతాలు ఇవ్వడం అలవాటయింది. ఇది నన్నయ కాలపు శాసనాలలో కనిపిస్తుంది. ఇది శ్రీనాధుని కాలానికి స్థిరపడింది.

ఈ ఒత్తులు ఇవ్వడంలోని పద్ధతి విచిత్రంగా ఏర్పడింది. తలకట్టు అకారానికి చిహ్నమనే భావం బలపడిన తర్వాత తలకట్టు లేనివి అక్షరాలనే భావం ఏర్పడింది. తలకట్టు కలవాటిని తలకట్టు తొలగించి, తలకట్టు లేనివాటిని వున్నదున్నట్టుగాను పంక్తికి దిగువ చిన్నవిగా చెక్కడం మొదలయింది. క త న మ య ర ల వ వత్తులు ఇప్పుడు మనకు క్రొత్తవిగా, మూలాక్షరాలకు భిన్నంగా కనిపిస్తున్నా, పాత అక్షరాల స్వరూపాలే. య వత్తును కియ్యావడి, క్యావడి అని అంటారు. దీనికి, పూర్వపు క వత్తుకు భేదం తెలియడానికి కావంటి యావడి (వడిఅక్షరం) అనే వ్యవహారం ఏర్పడింది. ఇలాగే ర వత్తునకు క్రారావడి అనే వ్యవహారమూ ఉంది. దీనికి కారణం ఏమిటో తెలియదు. తెలుగు–కన్నడ లిపి సంధికాలంలో క వర్ణం పశ్చామార్థ భాగం అకారం వంటిదనే భావమేమో. ఇప్పుడు అచ్చునుంచి, వ్యవహారం నుంచి మరుగయిన క్రావడి మరొకరూపం వలపలి గిలక. కర్మ అనడానికి మారు కమన్ రకారంపొల్లు అని వ్రాసేవారు, చెక్కేవారు. రేఫం ఒత్తును అశోకుని కాలంనుంచి అక్షరం కుడిపై చివర ఏటవాలుగా వ్రాసే పద్ధతి వుంది. దీనికి క్రమంగా కుడివైపున గిలకలాగ వ్రాయడం వల్ల వలపలి గిలక అయింది.

నేటి కామా, ఫుల్‌స్టాపుల లాగ ఒంటి నిలువుగీత. జంట నిలువు గీత విరామ, సమాప్తి సూచకాలుగాను, అడ్డుగీత వివరణ కోసం విరామ సూచకంగాను పెట్టేవారు.

ముద్రణ వచ్చిన తర్వాత అక్షర స్వరూపం పూర్తిగా స్థిరపడిపోయింది. ముద్రణను మన దేశానికి బుడతకీచులు గోవాకు తీసుకొని వచ్చారు. తెలుగు పుస్తకం తొలిసారిగా ముద్రణ కావడం 1746లో, జర్మనీలోని హాలీ నగరంలో. ఇది క్రైస్తవ ప్రార్థనా పుస్తకం. రెవరెండ్ బెంజమిన్ షూల్జ్ అనే పాదరీ దీనిని ముద్రించాడు. ఇదే సమయంలో 1746–47లో కర్నాటక మిషన్‌వారు తక్కిన కొన్ని భాషలతోపాటు బైబిలును తెలుగులోను కలకత్తా సమీపంలోని శ్రీరామ్‌పూర్‌లో ముద్రించారు. ముద్రణ



యంత్రం 1772లో మద్రాసుకు వచ్చింది. మద్రాసు నగరంలో మొదటిసారిగా ముద్రితమైన పుస్తకం తెలుగు వ్యాకరణం. ఇది 1807లో ముద్రితమైంది. 1830 ఆంధ్రదేశంలోని పెక్కు పట్టణాలలో ముద్రణ యంత్రాలు నెలకొనడంతో పెక్కు తెలుగు గ్రంథాలు తెలుగునాట ముద్రణ కాసాగినవి. ఇలా అచ్చు రావడంతో తెలుగు లిపి పూర్తిగా స్థిరపడిపోయింది. ఆంగ్లంలోని విరామ చిహ్నాలు, ప్యారాగ్రాపు విభజనలు మొదలయినదంతా తెలుగులోకి వచ్చింది.

నేడు మోనోలిపి అచ్చులో గొప్ప మార్పులు తెచ్చింది. దీనివల్ల చేతితో అక్షరాలు పేర్చే బాధతొలగి, టైపు యంత్రంలో టైపు చేసినట్లు టైపు చెయ్యడంవల్ల ముద్రణలో వేగము అక్షరాల సొంకము పెరిగినవి. రానున్న కాలంలో మరెన్ని మార్పులు కలుగనున్నాయో తెలియదు.

విదేశ సంబంధం, పరిపాలన రావడంవల్ల ముద్రణ సౌకర్యం కోసం పెక్కు మార్పులు జరిగి మోనోలిపి, లైనోలిపి, ఫోటో స్టాట్ ముద్రణ, టైపు యంత్రాల అవసరం బట్టి మనలిపి సౌందర్యం చెడకుండా పెక్కు మార్పులు జరిగాయి. ఇక ఎన్ని జరుగుతాయో తెలియదు. (సమాప్తం)

" తెనుగ దేలయన్న దేశంబుతెనుగేను
తెనుగువల్లభుండ, తెనుగొకండ
ఎల్లనృపులు వినగ నెరుగనే బాసాడి
దేశభాషలందు తెలుగులెస్స"

తెలుగు ఆధునికతకు వాడుకే ప్రమాణం

డా. భద్రిరాజు కృష్ణమూర్తి

ఆదిమ సమాజాలుంటాయి గాని ఆదిమ భాషలంటూ ఉండవు. కొన్ని భాషలే ఆధునిక విజ్ఞానానికి సాధనంగా పనికి వస్తాయని, కొన్ని ఆ ప్రయోజనానికి శాశ్వతంగా పనికిరావని అనటానికి వీల్లేదు. ఏ భాష అయినా దాన్ని మాట్లాడే వాళ్లు వినియోగించిన హద్దుల్లోనే పెరుగుతుంది.

ఆధునిక విజ్ఞానం, భాష పెరుగుదల అంగ్లం, ఫ్రెంచి, చైనీస్, జాపనీస్ మొదలైన భాషల్లో సాధ్యమైనప్పుడు భారతీయ భాషల్లో ఎందుకు సాధ్యం కాకూడదు? ఆ యా భాషల నిర్మాణంలో ఏదో విశేషం ఉండటం వల్ల అవి వృద్ధి పొందలేదు. కొన్ని శతాబ్దులుగా శాస్త్రీ విజ్ఞాన సాధనాలుగా వినియోగించటమే వాటి అభివృద్ధికి హేతువు. భాషా నిర్మాణానికి భాషా వినియోగానికి కార్య కారణ సంబంధం లేదు. ఒక సమాజంలో ఉన్న వ్యక్తుల భౌతిక వైజ్ఞానిక జీవితం స్వభాషలోనే వర్ధిల్లినప్పుడు ఆ భాషకూడా నీటి కొద్దీ తామర లాగా పెరుగుతుంది కాని వైజ్ఞానిక జీవితం అన్య భాషలోను దైనందిన జీవితం స్వభాషలోను జరిగినప్పుడు వినియోగం లేని రంగాల్లో స్వభాష పెరగక పోవటం ఆశ్చర్యం కాదు. వాడుకే భాషకు పెరుగుదల. ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఇంగ్లీషు ద్వారా మనం నేర్చుకొన్నాం. ఆ జ్ఞానాన్ని తెలుగు వాక్యాల్లో మాటలన్నీ తెలుగువైనా కాకపోయినా మనం మాట్లాడుకొనే అలవాటు 20, 30 ఏళ్లుగా చేస్తే తెలుగు గూడా ఆధునిక విజ్ఞాన సాధనంగా రూపొందేది.

తెలుగు నాట పుట్టి పెరిగిన వ్యవసాయం, చేనేత, మేదర పని, జాలరిపని, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం..మొదలైన దేశీయ వృత్తుల్లో తెలుగు ఎంతగానో పెరిగింది ప్రతి పనిముట్టుకూ, పనికీ తెలుగువాళ్లు మాటలు కల్పించుకొన్నారు పంటల తెగుళ్లకు 600 పేర్లున్నాయి; పెడ్ల రకాలకు 500 పేర్లున్నాయి. వడ్ల పెంపకం అట్టేలేని అంగ్లంలో పది పేర్లు గూడా దేశీయమైనవి ఏర్పడలేదు. దీనినిబట్టి భాషా సౌభాగ్యం గాని దారిద్ర్యం గాని ఆ భాషా వ్యవహర్తల వాడుక వల్ల వచ్చే పరిణామం కాని భాషా గత లక్షణం కాదని గుర్తించాలి.

ఆధునిక భాషకు మూడు లక్షణాలు

అయితే ఆధునికావసరాలకు యోగ్యంగా తెలుగు పెంపొందాలంటే ఏం చెయ్యాలి అనే ప్రశ్న వస్తుంది. ఆధునిక పరిణత భాషకు మూడు లక్షణాలుండాలి.

1. అనువైన లేఖన విధానం, 2. ప్రమాణమైన ఉచ్చారణ, వ్యాకరణం. రచనా విధానం 3. ఆధునిక విజ్ఞానానికి సంస్కృతికి ఉపయోగించే పదజాలం.

లేఖన విధానం

తెలుగులో ఈ సమస్య అట్టే లేదు. భారతీయ భాషలన్నిటికీ ఉచ్చారణ విధేయమైన వర్ణ సమామ్నాయం ఉంది. ఇంగ్లీషు మొదలైన భాషల్లో వచ్చే స్పెల్లింగ్ సమస్యలు మనకు లేవు. చక్కటి లేఖన విధానంలో గుర్తుకు ఉచ్చారణకు సరైన సమన్వయం ఉండాలి. ఒకే గుర్తుకు రెండు మూడు ఉచ్చారణలున్నా, ఒకే ఉచ్చారణకు రెండు మూడు గుర్తులున్నా ఈ సమన్వయం లోపించినట్లు గుర్తించాలి. భాషలో వచ్చే మార్పులకు అనువుగా గుర్తుల్లో మార్పులు చేసుకోవాలి. తెలుగులో 'ర ఱ' లతేడా పోయింది. ఒకే గుర్తు 'ర' రెండిటికీ చాలు, అర సున్నాకు ఉచ్చారణ లేదు. అలాగే 'ఋ, ౠ, ఌ, ౡ' లను వేరుగా ఉచ్చరించటం లేదు. 'థ ధ' లను 'ధ' గానే ఉచ్చరిస్తున్నాం. ఉదా:— అర్థం, అర్ధం. బ్యాంక్, పార్ట్స్ లాంటి మాటల్లో ఉన్న అచ్చుకు తుల్యమైన అచ్చు తెలుగు మాటలో ఏర్పడది. ఉదా:— చెప్పాడు, మరాఠీకు, మేక మేనరికం, చారు మొదలైన శబ్దాల్లో ఈ ధ్వని ఉంది. కొందరు 'య' వత్తుతో సూచిస్తున్నారు. బ్యాంకు' అని. ఆఫీసు, కాఫీ మొదలగు చోట్ల 'ఎఫ్' అనే ధ్వని తెలుగు వాళ్ల ఉచ్చారణలో చేరింది. గుర్తులు లేని ధ్వనులకు కొత్త గుర్తులు ఏర్పరుచుకోవాలి. అలానే ధ్వనుల వేర్పాటు లేని గుర్తులను పరిహరించాలి. ఈ సంస్కరణ ఎంత తొందరగా జరిగితే అంత మేలు. అచ్చుకు అనువుగా తెలుగు లిపిలో కూడా కొద్దిపాటి సంస్కరణ చెయ్యవలసి ఉంటుంది.

భాషా ప్రామాణికత

జరిగిన 30 ఏండ్లుగా ఒక రకమైన ఆధునిక శిష్ట భాష ప్రమాణంగా చలామణి అవుతున్నది. వార్తాపత్రికలు, సినిమాలు,

రేడియో కథలు, నవలలు, నాటకాలు మొదలైన సాధనాల ద్వారా ఈ భాష వ్యాపించి లక్షలాది తెలుగు వ్యవహర్తలకు సమ్మతమైంది. చదువుకొన్న వాళ్లు ఈ భాషనే అలవాటు చేసుకొని రాస్తున్నారు. సభ్య సమావేశాల్లో మాట్లాడుతున్నారు. దీన్నే 'శిష్ట వ్యావహారికం' అని 'ఆధునిక ప్రామాణిక భాష' అని అంటున్నారు. ఈ భాషలో కొంత మాండలిక వైవిధ్యం లేకపోలేదు. అయినా ఎక్కువమందికి అర్థమవుతున్నది; ఆమోదయోగ్యమైంది. తెలుగు వ్యవహర్తలకు ఉచ్చారణలో ఏది ప్రమాణమో ఏది అప్రమాణమో అందరికి తెలుసు ఉదాహరణకు—

ప్రమాణోచ్చారణ	అప్రమాణోచ్చారణ
1. భాగవతం, కధ, ధర్మం	బాగోతం, కత, దర్మం
2. చాప, చూపు, చిలక, చెక్క	సాప, సూపు, శిలక, శెక్క
3. వేడి, వెండి, వీధి	యేడి, యెండి, యీది
4. వాన, వచ్చినవాడు	ఆన, అచ్చిండు
5. అలా, అట్లా, అల్లా	గట్ల

పామరులు విద్యావంతులైనప్పుడు ఒత్తులు నిలపటం, శ, స ల బదులు 'చ' వాడటం, వకారోచ్చారణ, మొదలైనవి క్రమంగా నేర్చుకొంటారు. ఎవరు ఎవరిని ఏ లక్షణాల్లో అనుకరిస్తున్నారో గుర్తించటంవల్ల ఏది ప్రమాణమో ఏది అప్రమాణమో తెలుస్తుంది. క్రియాపదాల్లో పోద్ది, వచ్చుద్ది, తెలవదు అప్రామాణికాలు. 'పోతుంది, వస్తుంది, తెలియదు' ప్రామాణికాలు. ఈ భేదాలు నిజంగా భాషాగతమైనవి కాదు. సాంఘిక వ్యవస్థలో చదువుకొన్నవాళ్లను పామరులు వేషభాషల్లో అనుకరిస్తారు. చదువుకొన్నవాళ్లు స్వభాషతో బాటు అన్యభాషాపదాలను స్పష్టంగా పలకటం నేర్చుకొంటారు. వారికి వ్యవహార దక్షత ఎక్కువగా ఉంటుంది. వాళ్లలాగా మాట్లాడగలగటం, చదువు, సభ్యతలకు లక్షణాలవుతాయి. ప్రమాణభాష కొద్దిమంది వ్యవహారంవల్ల ఏర్పడి కాలాంతరంలో దేశం అంతటా వ్యాపిస్తుంది. ఆ వ్యాప్తిలో మాండలిక భేదాలు కొన్ని ప్రమాణభాషలో చేరతాయి. విద్యాసంస్థల్లో చిన్న తరగతులనుంచి పెద్ద తరగతులదాకా అధ్యాపకులు ప్రమాణభాషా వ్యాప్తికి శ్రద్ధతో ప్రయత్నంచెయ్యాలి. పాఠ్య గ్రంథాల్లో 'సరళ గ్రాంథికం' పేరుతో ఉన్న కృత్రిమభాష బదులు ఆధునిక ప్రమాణభాష రావాలి. తెలుగు పరీక్షలన్నిటికీ ఆధునికభాష మాధ్యమం కావాలి. కావ్య భాష చదవటానికేగాని రాయటానికి వాడకూడదు. ఇది ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు తక్షణం చేయవలసిన సంస్కరణ.

ప్రామాణిక భాషకు మరో లక్షణం విషయాన్నిబట్టి రచనా విధానంలో కొన్ని ప్రమాణాలు ఏర్పడటం. కాల్పనిక సాహిత్యం, శాస్త్రసాహిత్యం అనే వేర్పాటు రచనా విధానాన్నిబట్టి మనభాషలో ఏర్పడలేదు. శాస్త్ర విషయ చర్చలో మాటల కుదింపు, స్పష్టత అవసరం. వాక్యాలు చిన్నవిగా ఉండాలి. పునరుక్తిదోషం ఉండరాదు. వ్యక్తీకరణ సూటిగా, సులభంగా ఉండాలి. 'గ్రాడ్యుయేట్' తరగతుల్లో తెలుగు బోధించే వారిమీద ఈ బాధ్యత ఉంది. సమాసాలు, సంధులు, ప్రకృతి వికృతులు, క్లిష్టపదాలకు అర్థాలుచెప్పటం మొదలైన వాటినిగూర్చి చేసే బోధనావ్యవధి తగ్గించి, భిన్న విషయాలను గురించి తెలుగులో చేసే రచనల్లో ఏయే లక్షణాలుండాలో భాషాధ్యాపకులు చెప్పటం అవసరం. వీరంతా ఆధునిక వినియోగానికి అనువుగా తెలుగు వాడుకను ఎలా రూపొందించాలో ఆలోచించటం మంచిది. భాషాధ్యాపకుల శిక్షణలోనూ చాలామార్పులు రావాలి.

పారిభాషిక పదాలు

కొత్త విషయాన్ని గురించి చెప్పాలంటే దానికి అనువైన పదజాలం కావాలి. కొత్తభావాలు ఏ భాష నుంచి తెచ్చుకుంటామో ఆ భాష నుంచే పదాలు కూడా ఎరువు తెచ్చుకోవటం సహజమైన మార్గం. ప్రతి భాష అన్య భాషా సంపర్కం వల్ల పెరుగుతుంది. ఎన్ని అన్యదేశ్యాలను ఒక భాష ఇముడ్చుకోగలదు అనటానికి నిజంగా అవధి లేదు. ఆధునిక ప్రాచ్య పాశ్చాత్య భాషలన్నీ ఈ విధంగా పెరిగినవే. క్రియలకంటే నామాలు ఎక్కువగా తెలుగులో ఇముడుతాయి. తెలుగులో కొన్ని వేలు సంస్కృతాంగ్ల అరబ్బీ పారశీక పోర్చుగీసు పదాలు చేరాయి. చాలా మంది తెలుగువాళ్లకు 'రోజు,' అసలు, కిటికీ, అస్పత్రి, రొట్టె, మొదలైనవి తెలుగు మాటలు కావనే సంగతికూడా తెలియదు. మాటలు ఇమిడితేనే భాషలో చేరతాయి. మన కావ్యాల్లో వచ్చే దీర్ఘ సంస్కృత సమాసాలు తెలుగు వచన రచనలో కాని వ్యవహారంలో కాని ఇమడలేదు. కాబట్టి వాటికి ప్రాచుర్యం రాలేదు.

అనువాద వైక్లబ్యాలు

అన్య భాషలో ఉన్న ఒక్కొక్క మాటకు అనువాద రూపంగా ఒక్కొక్క పారిభాషిక పదం కల్పించుకోవాల్సిన అవసం లేదు. ముఖ్యంగా తెలుగు క్రియల అర్థం సందర్భాన్ని బట్టి విస్తృతం అవుతుంది. ఇంగ్లీషులో ప్లై, డ్రైవ్, రన్ అనే వాటికి తెలుగులో 'నడుపు' అనే ఒక్కక్రియ చాలు—విమానం నడపటం, కారు నడపటం, రైలు నడపటం మొదలైనవి. అలానే ఒక పారిభాషిక పదాన్ని అనేక పదాలలో ఒక్కొక్కప్పుడు చెప్పుకోవలసి వస్తుంది.

దేశం అంతటికీ ఒకే రకమైన పారిభాషిక పదజాలం సృష్టించుకోవాలని కొందరివాదం. దీని ఫలితంగా 'బండి' కారు, 'అద్దె కారు' అనే మాటలను 'వాహనం శకటం, వాహిక అని రాయమంటారు. 'పన్ను' బదులు రాజస్వం అనాలిట. రూఢ పదాలను భాషలో నుంచి తప్పించటం మంచి పని గాదు. సాధ్యమూ కాదు సంస్కృతం నుంచి రెండు మూడు మాటల కలయికతో కూర్చిన పదాలు తెలుగులో అతక వచ్చును. దీర్ఘ సమాసాలు ఇమడవు. ఉదా :— రూపాంతర ప్రాప్తి వ్యవస్థ. (మెటమోర్ఫిక్ ఫేస్,) ఉదాసీన వక్రి రేఖా విశ్లేషణ, (ఇన్‌డిఫరెన్స్ కర్వ్ అనాలిసిస్) మొదలైనవికుప్పతిప్పలుగా తెలుగు అకాడమీ పుస్తకాల్లో వేస్తున్నారు ఏ సందర్భంలోనూ అర్థం కానీ రూపం గానీ మారకుండా ఉండేవి రసాయనిక శాస్త్రంలో వచ్చేవి ఇంగ్లీషు నుంచి ఎరువు తెచ్చుకోటం మంచిది. సందర్భాన్ని బట్టి అర్థం మారే మాటలను

వివరణాత్మకంగా తెలుగులోకి తెచ్చుకోవాలి. కొత్త భావాలు వారి ఆలోచనా విధానంలో కలిసిపోతే కొత్తమాటల కూర్పు సహజంగా ఏర్పడుతుంది. మాటల కంటె కాన్సెప్ట్స్ అర్థం చేసుకోటం ప్రధానమైంది.

శాస్త్రజ్ఞులే శాస్త్ర విషయ చర్చలు, సందర్భోచితంగా కొత్తమాటలు కూర్చుకోటం సహజమైన విధానం. అకాడమీలు కోశకారులు మాటలను సృష్టించి ఇతరులను వాడుకోమనటం భాషా సహజ పరిణామానికి దోహదం కాదు. ఈ పద్ధతి ప్రపంచంలో చాలా భాషలో జరిగింది గాని సత్ఫలితాలు రాలేదు.

ద్విభాషా మిశ్ర శైలి

పరిపాలనలోను, న్యాయ స్థానాల్లోను తెలుగును ప్రవేశ పెట్టాలంటే ద్విభాషా శైలి వాడటం మొదటి మెట్టు. అంటే ఇంగ్లీషు మాటలు. పదబంధాలు అవసరమైనచోట కలిసి తెలుగు వాక్యాల్లో మాట్లాడటం. క్రమంగా తెలుగులో ఆలోచించి రాయటం సాధ్య పడ్డప్పుడు అన్యదేశ్యాల స్థానంలో దేశ్య శబ్దాలు వస్తాయి. లేదా అన్యదేశ్యాలు మన భాషలో కలిసిపోతాయి. న్యాయస్థానాల్లో వాదోప వాదాలు మిశ్రశైలిలో జరిగినా నిర్ణయాలు కొంతకాలం ఆంగ్లంలోనే ఉండవచ్చు మరో ఇరవై ఏళ్లలో తెలుగులోనే చట్టాలు, న్యాయ సూత్రాలు నిక్కచ్చిగా రాయటం సాధ్యమవుతుంది

మన భాష పెరుగుదలలో గుర్తు పెట్టుకోవలసినవి

కొత్త భావాల అవగాహన కొత్త మాటలను సృష్టించటం కన్నా ప్రాథమికం. సందర్భం, వాడుక లేని పొడి మాటల సృష్టి వల్ల భాష పెరగదు.


దేశ్యాలయినా అన్యదేశ్యాలయినా మాటలు భాషలో అతకటానికి వాడుక ప్రధానం. సంస్కృతం నుంచి తెచ్చుకొన్న మాటలే తెలుగులో కలుస్తాయనుకోటం ఇంగ్లీషు, మొదలైన ఇతర భాషల నుంచి తెచ్చుకొన్నవి కలవవు అనుకోటం. భాషా స్వభావం తెలియని వాళ్లలో అపోహ. ముఖ్యంగా గ్రంథకర్తల్లోను. అధ్యాపకుల్లోను ఇది పోవాలి.

ఆధునిక విద్యా బోధనలోను, న్యాయస్థానాల్లోను. రాష్ట్ర పరిపాలనలోను కొంతకాలం మిశ్ర శైలిని సహించాలి. ప్రోత్సహించాలి. ఇలాటి శైలి మనం ప్రతిదినం వాడుతూనే ఉన్నాం. దీన్ని లిఖిత రూపంలో గూడా ఆమోదించాలి.

అధునిక అవసరాలకు అనువుగా భాషా బోధన విధానంలో మార్పులు రావాలి బి. ఏ. ఎం. ఏ లలో 'తెలుగు' ప్రధాన విషయంగా చదివేవారి పాఠ్య విషయంలోను శిక్షణ విధానం లోను మార్పు రావాలి.

శాస్త్ర విషయాలను గురించి స్వతంత్ర గ్రంథ రచనను ప్రోత్సహించాలి. వేరు వేరు శాస్త్రాలకు సంబంధించిన పరిశోధక పత్రికల ప్రచురణకు ప్రభుత్వం విశ్వ విద్యాల యాలు అవకాశాలు కలిగించాలి.

భాష విజ్ఞాన సాధనం. అది ఉపకరణంగా మన విజ్ఞానం ఎంత పెరిగితే భాష అంత పెరుగుతుంది. వాడుకే భాషకు జీవగర్ర



ప్రవర్తించాలి. మనశక్తి యుక్తులన్నీ ఆ లక్ష్యసాధనకు ఉపయుక్తం కావాలి. దేహదారుఢ్యంగల వారూ, బుద్ధిబలం కలవారు అందరూ సాంఘిక ఆర్థిక న్యాయప్రాతిపదిక పైన ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో శాయ శక్తులా కృషి చేయడానికి పరిపూర్ణమైన అవకాశం వుండాలి. మూఢనమ్మకాలకూ, స్వార్థానికీ దూరంగా వుండి కృషి చేయాలి. పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా చేపట్టిన పనియందు గౌరవాభిమానాలతో స్త్రీ పురుష లందరూ ఏకోన్ముఖంగా దీక్షతో కృషి చేయాలి.

కృషితో నాస్తి దుర్భిక్షం

ప్రకృతియందు దాగియున్న శక్తులను మనం ఉపయోగించుకోవాలి. భూగర్భంలో దాగియున్న సంపదను మనం వెలికి తీయాలి.

మనం యిదివరకే సస్య విప్లవంలో అడుగు పెట్టినాము. వ్యవసాయరంగంలో శాస్త్రీయ విజ్ఞాన సహాయంతో, యింకా యెక్కువ కృషి చేసి వ్యవసాయోత్పత్తులను అధికంగా సాధించి, తద్వారా భవిష్యన్నిర్మాణానికి గట్టి పునాదులు వేయగలము. మన శక్తి అపారమైనది. నూతన మార్గంలో మన పద్ధతులను అనుసరించి మన ఆశయాలను నూతనోత్తేజంతో నెరవేర్చుకోడానికి మనం పాటుపడాలి.

మన పంచవర్ష ప్రణాళికలలో మన ఉజ్వల భవిష్యత్తుకు రూపురేఖలు తీర్చి దిద్దడం జరిగింది. మన ఆశయాలు, మన భావితరాలవారి ఆశయాలు కూడా వాటిలో పేర్కొనబడి వున్నాయి. మూఢ విశ్వాసాల మీద కాక జ్ఞానమార్గంలో నవభారత నిర్మాణానికి పంచవర్ష ప్రణాళికల్లో పునాదులు వేయడం జరిగింది. నిరాశాపేతమైన గతనుంచి విడివడి, ఆశాజనకమైన భవిష్యత్తులో అడుగు పెట్టడమే మన ప్రణాళికల లక్ష్యమైవుంది. మన ప్రణాళిక కృషి బృహత్తరమైనది, అపూర్వమైనది. వనరుల నన్నింటినీ సమీకరించి. జాతినంతటినీ చైతన్య వంతం చేయడమే ప్రణాళికల ప్రధానోద్దేశ్యమై వుంది. వేలాది ప్రజలు నడుము బిగించి నూతనోత్తేజంతో కృషిచేసే కార్యక్షేత్రాలు మనకు పూజనీయములు. వ్యక్తిగత నీతి, సాంఘిక నీతి, విజ్ఞానము, హేతు బద్ధమైన వాదము యీపునాదులపైన ఏర్పడిన మతమే జాతి మతముగా ప్రకటించబడాలి. "కృషి ఆరాధన" అనేది మన భవిష్యత్తుకు రాచబాటగా వుండాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రులు ఈ ఆరాధనా కార్యక్రమంలో యీ యజ్ఞంలో పాల్గొని అజ్ఞానము లేమి అనే పీడలను నిర్మూలన చేయాలి.

మన గత తరంవారు మనస్వాతంత్ర్యం కొరకు పాటు పడినారు. మనదేశంలో అనేక గొప్ప సంఘటనలు జరుగుతున్న సమయంలో దేశస్వాతంత్ర్యం కోసం ప్రజలు ఎనలేని త్యాగాలు చేస్తున్న సమయంలో మీరు జన్మించారు. ఆకాలపు సంఘటనల ప్రభావం మీకు ప్రత్యక్షంగా తెలియదు. వారు చేసిన కృషి, త్యాగాల ఫలితాలను మనం అనుభవిస్తున్నాము. ఇప్పుడు మనం సర్వతంత్ర ప్రజాతంత్రంలో గర్వించ తగిన పౌరులుగా వున్నాము. భావితరాల వారి కొరకు ఇప్పటితరం వారు చేయదలచుకొన్నది ఏమిటి ? మనం కష్టపడి పనిచేసి భావితరాల వారికి అభివృద్ధి అనే దివ్యజ్యోతిని అందించాలి. మన పిల్లలకు మన పిల్లల పిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మనం ప్రసాదించాలి. ప్రణాళికాయుతమైన జాతీయోద్యమంలో పాల్గొని భారత భాగ్యవిధాతలుగా పటిష్ఠమైన నవభారత నిర్మాతలుగా మనం రాణించాలి. దేశభవిష్యత్తును తీర్చి దిద్దడంలో మనమంతా సముచితమైన పాత్రను నిర్వహించాలి. దీక్షతో శ్రద్ధా సక్తులతో కృషి చేయాలి. ఇదే వ్యక్తిగతంగా మనం దేశానికిచేయగలిగిన సేవ.

బహు భాషా పాండిత్యం

గత రెండున్నర దశాబ్దాలలో హైదరాబాదు తెలుగు భాషాధ్యయనానికీ తెలుగు సంస్కృతికీ గొప్ప కేంద్రంగా రూపొందింది తెలుగు సాహిత్య ప్రచారానికి పాటు పడుతున్న అనధికారసంస్థలు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలు విశ్వ విద్యాలయ అనుబంధ సంస్థల కృషిఫలితముగా ఇతర నగరాలకంటే హైదరాబాదు నగరం తెలుగు అభివృద్ధి విషయంలో ప్రధాన స్థానం ఆక్రమించింది. సాధ్యమైనంత వరకు హైదరాబాదు యొక్క సమిష్టి సంస్కృతిని పరిరక్షించేందుకు కృషిచేయాలి ఉర్దూ భాషా కేంద్రాలలో హైదరాబాదు కూడా ఒక ప్రధాన కేంద్రంగా రాణించాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషకు సముచితస్థానం కల్పిస్తున్నందుకు హర్షిస్తున్నాను తగిన విధంగా ప్రయత్నాలు చేయనిదే ఆంగ్లభాషను తొలగించడం సాధ్యంగాదు ఆధునిక విజ్ఞానానికి ఆంగ్ల భాష మార్గాలు చూపుతున్నది.

ఇక్కడ భాషాశాఖలు పటిష్ఠంగా పని చేస్తున్నందుకు హర్షిస్తున్నాను. అయితే మన విశ్వ విద్యాలయములలో భాషావిషయాలలో అనేక మంది మంచి శిక్షణ పొందాలని కోరుతున్నాను. ఒరియా, గుజరాతీ, మళయాళం వంటి భాషలను నేర్చుకొన్న తెలుగువారు చాలా అరుదుగావున్నారు. మన దేశం బహు భాషాయుతమైనదిగా వుండడం అనేది కనిపిస్తున్న యథార్థం. పరస్పర అవగాహన లేకుండా. మనం ఏకాకిగా వుండగలమా ? భారత దేశ భాషలను నేర్చుకున్న పండితులు చాలామంది వుండడం అవసరం. ఇది భావసమైక్యతకు దారితీస్తుంది. భాషలను నేర్చుకొనడానికి తగిన సౌకర్యాలు కల్పించే బాధ్యత విశ్వవిద్యాలయాలపైన వున్నది. కొన్ని సందర్భాలలో భాషలను నేర్చుకొనడం తప్పనిసరి చేయాలి.

జీవిత ధ్యేయం

పోస్ట్‌గ్రాడ్యుయేట్లయి మీరందరూ యువ వయస్సులో వున్నారు. జీవితమంటే ఏమిటో మీకు కొంతవరకు తెలుసు. ఇప్పుడు జీవితపు నూతన ప్రాంగణంలో మీరు అడుగు పెడుతున్నారు. మీ కాళ్ళపై మీరు నిలబడబోతున్నారు. ఇప్పటి నుంచి మీ జీవితానికి మార్గం చూపడానికి మీ అధ్యాపకులు మీకు వుండరు. ఇంతవరకు మీకు ఒక విధమైన రక్షణ, అండదండలు వుండినాయి. మీరు సుశిక్షణ పొందినారు. విశ్వవిద్యాలయపు ప్రాంగణాన్ని విడిచి, మీరు మరొక జీవితంలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటి నుంచే జీవితపు నిజమైన పాఠం మీరు నేర్చు

కర్ణునకు సూర్యుని యుపదేశము

"జనమేజయ మహారాజా! పాండవులకు పన్నెండు సంవత్సరముల వనవాసము ముగిసి పదమూడవ సంవత్సరము మొదలైన తోడనే ఇంద్రుడు పాండవులకు మేలు చేయదలచి కర్ణుని వద్దకు భిక్షార్థమై పోయెను. "ఇంద్రుడు కుండలముల కొరకు కర్ణుని యాచించుటకు పోయినా" డని యింద్రుని మనోభావమును తెలిసికొని కర్ణుని తండ్రియగు సూర్యుడు కర్ణుని వద్దకు వచ్చెను. అప్పుడు కర్ణుడు అమూల్యమైన సుందరశయ్యయందు శయనించియుండెను. సుఖనిద్రలో నున్న బ్రాహ్మణభక్తుడు సత్యసంధుడునైన కర్ణునకు బ్రహ్మణ రూపములో స్వప్నమునందు సూర్యుడు ప్రత్యక్షమై, పుత్ర ప్రేమచేత కర్ణుని హితమునుగోరి దయాపూర్వకముగా నిట్లనెను.

"నాయనా! కర్ణా! నేను స్నేహపూర్వకముగా నీ హితము గోరి చెప్పబోవు మాటలను సావధానుడవై వినుము. ఇంద్రుడు పాండవుల హితమునుకోరి బ్రాహ్మణరూపముతో నీ నుండి కుండలములను అపహరించుటకుగాను రాబోవుచున్నాడు. "నీవు ఎవరు ఏది యాచించినను లేదనకుండ ఇచ్చెద'వని నీ స్వభావము అతడెరిగెను, నాయనా! నీవు బ్రాహ్మణులు యాచించిన వస్తువులన్నియు సందేహించక ఇచ్చెదవు. ఎవరికిగూడ 'లేదు'అని అనజాలవు. నీవు యిట్టి ఉదారుడవనితెలిసి యింద్రుడు నిన్ను కుండలములను యాచించుటకు స్వయముగా రానున్నాడు, అతనికి కుండలములను ఈయకుము. నీశక్తి కొలది అతనికి శాంత వచనములు చెప్పి పంపుము. ఇందులో నీకు శ్రేయస్సు గలదు.

"ఇంద్రుడు కుండలముల కొరకు నిన్ను యాచించినప్పుడు, నీవు అతనికి అనేక కారణములనుచెప్పి, 'వాటికి బదులుగా ఇతర ధనములనిచ్చెద'నని చెప్పి అతడు కుండలము మాటయెత్తినపుడెల్ల మాటిమాటికి అతనిని వారించుము. అనేక రత్నములను, గోవులను, స్త్రీలను, ఇతర ధనములను అతనికి ఈయజూపుచు, అతని మాటలను దాటించుచు పొమ్ము. కర్ణా! ఒక వేళ నీవు నీ సహజ కుండలములను ఇంద్రునకు ఇచ్చినచో నీ ఆయుష్యము క్షీణించి తప్పక నీవు మృత్యువువాత పడెదవు. నీవు సహజ కుండములు, కవచము కలిగియున్నంత వరకు యుద్ధము నందు శత్రువులకు అవధ్యుడవుగా నుండెదవు. కర్ణా! నీకు ఉండు సహజములైన రత్నమయ కవచకుండలములు అమృతము నుండి పుట్టినవి. జీవితము నీకు ప్రియమైనచో ఆ రెంటిని నీవు రక్షించుకొనుము" ఆ మాటలు విని కర్ణుడు 'నాయెడల ఇంత మైత్రిని చూపుచు, బ్రాహ్మణ వేషముననున్న నీవుఎవడవు భగవన్! నిస్సంకోచముగా చెప్పుము అని యడిగెను, దానికి బ్రాహ్మణుడు 'నాయనా! నేను సూర్యుడను. నీయందలి స్నేహముచేత చెప్పుచున్నాను. నామాట ప్రకారము నడచుకొనుము ఇది నీకు శ్రేయస్సు కలిగించును' అని కర్ణునితో ననెను. అది విని కర్ణుడు సూర్యునితో నిట్లనెను.

"భగవన్ సహస్ర కిరణుడవైన నీవు నా హితమును కోరి శ్రేయస్కరమైన మాటను చెప్పినావు. నా మాటను గూడ వినుము. ప్రభూ! నీవు వరప్రదాతవు. నా యెడల ప్రసన్నుడవుగా నుండుము. నీయందలి భక్తి ప్రేమలచేత చెప్పుచున్నాను. నాయెడ నీకు ప్రేమ యున్నచో నీవు నన్ను ఈ దాతృత్వ వ్రతము నుండి వారించకుము భగవన్! 'బ్రాహ్మణోత్తములకు నా ప్రాణములనుగూడ నిచ్చెదను' అను ఈ నిశ్చయమైన నా వ్రతము సర్వలోకములకు తెలియును. త్రిలోకాధిపతియైన ఇంద్రుడే బ్రాహ్మణ వేషముతో, పాండవ హితార్థమై నన్ను యాచించుటకు వచ్చిన యెడల, నా కవచకుండలములను ఒలిచి అతనికి ఇచ్చెదను. దీనివలన మూడు లోకముల యందు ప్రసిద్ధిచెందిన నా కీర్తి నశించదు. నావంటి శూరుడు ప్రాణములను అర్పించియైనను కీర్తిని రక్షించుకొనవలెను. అపకీర్తినిపొంది ప్రాణరక్షణము చేసికొనుట ఉచితమైన పనికాదు. మంచి యశస్సుతో ఒకవేళ మృత్యువు ప్రాప్తించినను, అది లోక సమ్మతమే యగును. కనుక నేను ఇంద్రునకు కవచకుండలములను, అతడు వచ్చి యాచించినప్పుడు, తప్పక యిచ్చెదను. ఇంద్రుడు పాండవుల హితమును కోరి నన్నడిగి నప్పటికిని, అది నాకు కీర్తికరము, ఇంద్రునకు అకీర్తికరము నగును.

కీర్తి ప్రశంస

"భగవన్! నేను నా జీవితమును అర్పించియైనను లోకము నందు కీర్తినే వరించెదను. కీర్తిమంతునకు స్వర్గము లభించును. కీర్తిహీనుడు నశించిపోవును. లోకమునందు కీర్తి తల్లివలె పురుషుని రక్షించును. అకీర్తి యనునది, జీవముతోనున్న పురుషుని యొక్క జీవితమును గూడ నశింపజేసి యతనిని జీవచ్ఛవముగా చేయును. పూర్వము బ్రహ్మదేవుడు గానము చేసిన యీ ప్రాచీన శ్లోకార్థమును వినుము :—

"కీర్తియే మనుష్యునకు ఆయుష్యము. పరలోకమునందు కీర్తియే పురుషునకు గొప్ప ఆశ్రయము. ఈ లోకమునందుగూడ పరిశుద్ధమైన కీర్తి పురుషుని యాయుష్మము పెంచునదిగా నుండును" కనుక నేను నశ్వరమైన నా శరీరముతోపాటే సహజముగా పుట్టినవి కనుక ఈ కవచకుండలములు గూడ నశ్వరములే యగును. కనుక వీటిని ఇచ్చి, శాశ్వతమైన కీర్తిని పొందగలను. 'బ్రాహ్మణులకు శాస్త్రోక్త ప్రకారము దానముచేసి, యుద్ధమునందు శరీరమును ఆహుతిగా సమర్పించి, అత్యంత దుష్కరమైన కార్యమునుచేసి, యుద్ధమునందు శత్రువులను జయించి, ఒక్క కీర్తిని మాత్రమే సంపాదించెదను.

"యుద్ధమునందు భయపడి ప్రాణరక్షణార్థమై శరణుజొచ్చిన వారికి అభయ ప్రదానముచేసి, వృద్ధులను, బాలురను, బ్రాహ్మణులను మహాభయము నుండి విడిపించి, యీ లోకమునందు ఉత్కృష్టమై, స్వర్గయోగ్యమైయుండు ఉత్తమ కీర్తిని సంపాదించెదను. నా జీవితమును ఒడ్డియైనను కీర్తిని రక్షించుకొందును. ఇది నా వ్రతమని తెలిసికొనుము. కనుక నేను బ్రాహ్మణ వేషధారియై నా వద్దకువచ్చు ఇంద్రునకు అత్యంత శ్రేష్ఠమైన యీ భిక్షను ఇచ్చి, ప్రపంచమునందు ఉత్తమ గతిని పొందగలను"

(సశేషం)

వ్యావహారిక భాషా విజయం

''కళాప్రపూర్ణ'' వడ్లమూడి గోపాలకృష్ణయ్య

(గత సంచిక తరువాయి)

శ్రీగిడుగు సీతాపతి, శ్రీ బుజ్జసు వేంకట రమణయ్య మొదలైన వారు ఈ వ్యాకరణ రచనను ప్రశంసించారు. శ్రీతిరుమల రామచంద్రగారు దీనిని "పాణినీయం" సరసకు చేరుస్తూ "వ్యావహారిక పాణినీయం" అని పేరు పెట్టనే పెట్టారు. ఇంతగా విజయాన్ని సాధించినా వ్యావహారిక భాషా ప్రామాణికత్వ అప్రామాణికత్వాల గురించి, మాండలిక భేదాల గురించి, నిత్యపరిణామ శీలత్వం గురించి భాషలోని తప్పుల గురించి, అపరూపాల గురించి ఇంకా కొందరు ఆక్షేపణలను తెలియ జేస్తున్నారు. వ్యావహారిక భాషా విషయమై లోకంలో వున్న సందేహాల గురించీ, అడ్డు ప్రశ్నల గురించీ సమాధాన రూపమైన సమగ్ర పరిశోధనా గ్రంథం రచించాను "వ్యావహారిక భాషా వాదం" అన్న పేరుతో నేను వ్రాసిన ఈ గ్రంథం దాదాపు 15 సంవత్సరాల క్రిందట "ఆంధ్ర పత్రిక" దిన పత్రికలో సీరియల్‌గా కొంతవరకు ప్రకటించడం జరిగింది. త్వరలోనే ఈ గ్రంథం పుస్తకరూపంలో వెలువడుతుందని ఆశిస్తున్నాను.

విశ్వ విద్యాలయాలలో పి హెచ్.డి. డిగ్రీలకై జరిగే పరిశోధనా గ్రంథ రచనలలో శిష్ట వ్యావహారిక భాషను ఉపయోగించవచ్చునా? ఉపయోగించరాదా? ఇతర పరీక్షలలో ఉపయోగించవచ్చునా? ఉపయోగించరాదా? విశ్వవిద్యాలయం పక్షాన వివిధ తరగతుల పాఠ్య గ్రంథాలలో తెలుగు శిష్ట వ్యావహారిక గ్రంథాలు ఉండవచ్చునా? ఉండరాదా? అన్న సమస్యలను మూల మట్టంగా పరిశీలించి, చర్చించి తగు నిర్ణయాలతో ఒక నివేదికను సమర్పించవలసిందని కోరుతూ ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులైన శ్రీ లంకపల్లి బుల్లయ్యగారు. శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతను ఆంధ్ర–వేంకటేశ్వర–ఉస్మానియా విశ్వ విద్యాలయాల ప్రతినిధులతో కలిపి 1971 లో ఒక కమిటీని నియమించారు. శ్రీ ఎమ్. ఆర్. అప్పారావు గారు అధ్యక్షులుగా ఉన్న ఈ కమిటీలో ఇతర సభ్యులు శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు, ప్రొఫెసర్ ఖండవల్లి లక్ష్మీరంజనం గారు, ప్రొఫెసర్. భద్రిరాజు కృష్ణమూర్తి గారు, ప్రొఫెసర్ జి. ఎన్. రెడ్డిగారు, ప్రొఫెసర్ కె. వి. ఆర్. నరసింహము గారు, శ్రీ పురిపండా అప్పలస్వామిగారు. డా॥ ఎన్. వి. ఆర్. కృష్ణమాచార్యులుగారు, డాక్టర్ పి ఎస్: ఆర్. అప్పారావు గారు. డాక్టరు సి రామారావుగార్లు–డాక్టరు. టి. దొణప్పగారు మెంబర్–సెక్రటరీగా వున్నారు. ఈ కమిటీ భాషానిష్ణాతులైన ఇరవై మంది ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి, పరిశీలించి, చర్చించి తుదకు శిష్ట వ్యావహారిక భాషను, అన్ని స్థాయిలలోనూ ఆమోదించవచ్చునని తీర్మానించింది. ఈ కమిటీ సంప్రదించిన ఇరవై మంది ప్రముఖుల పేర్లు:

డాక్టర్ జి. వి. కృష్ణారావు, డాక్టర్ నార్ల వేంకటేశ్వరరావు, కళాప్రపూర్ణ వడ్లమూడి గోపాల కృష్ణయ్య, శ్రీ తెన్నేటి విశ్వనాథం, డాక్టర్ బి గోపాలరెడ్డి, డాక్టర్ పి.వి. రాజమన్నార్, శ్రీ జి. వి. శేషశాస్త్రి. శ్రీ ఆర్. అనంతకృష్ణ శర్మ, శ్రీ డి. పిచ్చయ్య శాస్త్రి, డాక్టర్ జె. చెన్నారెడ్డి, శ్రీ ఎం. రాజారామ్, కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ డి. రామానుజరావు, కళాప్రపూర్ణ బోయి భీమన్న, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, డాక్టర్ దివాకర్ల వేంకటావధాని. శ్రీ నోరి నరసింహ శాస్త్రి, డాక్టర్ సి. నారాయణరెడ్డి, జస్టిస్ శ్రీ ఆవుల సాంబశివరావు, డాక్టర్ నాయని కృష్ణకుమారి గార్లు.

ఈ కమిటీ ఆరుసార్లు సమావేశమై ఈ క్రింది తీర్మానాలతో చారిత్రాత్మకమైన నిర్ణయంచేసి 186 పుటలుగల నివేదికతో 1973 జూలైలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులైన శ్రీ బుల్లయ్య గారికి సమర్పించినది. ఆ కమిటీ ఆమోదించిన తీర్మానాలు ఇవి:

తీర్మానం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగులో పి హెచ్. డి. కై సమర్పించే పరిశోధన వ్యాసాలు వ్యావహారిక భాషలో కూడా వ్రాయవచ్చును.

కారణాలు : వ్యావహారిక భాషలో శాస్త్ర విషయాలపై ప్రామాణికరచనలు విరివిగా జరుగుతున్నాయి. శాస్త్రీయ భావ ప్రకటనకు వ్యావహారిక భాష సర్వ సమర్థమని ఋజువైనది.

తీర్మానం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అన్ని స్థాయిలలోనూ తెలుగు పరీక్షా పత్రాలకు సమాధానాలు వ్యావహారిక భాషలో వ్రాయవచ్చును. అన్ని తరగతులకు పాఠ్య పుస్తకాలుగా వ్యావహారిక భాషలోవున్న గ్రంథాలు కూడా నిర్ణయించవచ్చును.

కారణాలు : నేడు వ్యావహారిక భాష దేశమంతటా ప్రచారంలో వున్నది. పత్రికలు, రేడియో, సినిమాలు వ్యావహారికాన్నే వాడుతున్నాయి. పండితులు సహా అందరూ వ్యావహారికంలోనే వ్రాస్తున్నారు. ఉత్తమ సృజనాత్మక రచనలూ, సాహిత్య విమర్శలూ, ప్రామాణిక శాస్త్ర గ్రంథాలూ వ్యావహారికంలో వస్తున్నాయి. ప్రభుత్వ వ్యవహారాలన్నీ వ్యావహారికంలో జరుగుతున్నాయి.

ఈ తీర్మానాల రూపంలో వ్యావహారిక భాషా విజయ ధ్వజం గగన తలంలో అవికలమై, అచంచలమై, అమోఘమై తన జయ పతాకను రెప రెప లాడిస్తున్నది. ఎవరు అవునన్నా, కాదన్నా అమర భాషవలే వ్యావహారిక భాష అమృతమైనది. అమూల్యమైనది. అనన్య సామాన్యమైనది. (సమాప్తం)

గ్రంథ సమీక్ష

గుడీ - గుంపా

రచన :

శ్రీ జి. ఆర్. వర్మ


శ్రీ జి. ఆర్. వర్మగారు ప్రముఖ జర్నలిస్టు. గత 30 సంవత్సరాలకు పైబడి వీరు జర్నలిజంలో విశేషమైన అనుభవం గడించి ఆంధ్రదేశంలోని ప్రముఖ జర్నలిస్టుల కోవలో చేరారు. వీరు గతంలో ప్రముఖ వార, పక్ష, మాస, పత్రికలలో ఎన్నో వ్యాసాలు ప్రకటించారు. ప్రతీ వ్యాసంలోనూ ఏదో ప్రత్యేకత పాఠకులకు పదును పెట్టే విధంగానే ఉన్నది. వీరి రచనల ద్వారా వీరికి ప్రముఖ వ్యక్తులతో పరిచయం ఉంది. కేవలం రచన ఒక కాలక్షేపంగానే కాకుండా వర్మగారు తమ రచనల ద్వారా అనేక పరిశోధనలు వెల్లడి చేశారు. వీరు ప్రత్యేకంగా చరిత్ర పరిశీలనలో ఎక్కువ ఆశక్తి కనపరచి, అనేక పరిశోధనలు చేసి గతంలో 'మైలారదేవ' అనే చారిత్రిక పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించారు. ఈ గ్రంథం ప్రముఖుల ప్రశంసలనందుకొన్నది.

తెలుగు సాహిత్యంలో పౌరాణిక దేవతలను గురించిగాని, చారిత్రిక కాలంనాటి దేవతలను గురించి గాని పరిశ్రమ యింతవరకూ జరుగలేదు. ఆ లోపం శ్రీ వర్మగారు మైలారదేవ, గుడీ-గుంపా గ్రంథాల ద్వారా తీర్చారనే చెప్పవచ్చును. కళా ప్రపూర్ణ నిడదవోలు వెంకట్రావు గారన్నట్లు "ఈ కాలంలో క్రోడీకరణ విధానమే తప్ప పరిశోధనలో మౌలికమైన మార్గము త్రొక్కినవారు వేళ్లపై లెక్క పెట్ట తగ్గవారు మాత్రమే. అట్టి వారిలో పేర్కొనదగ్గవారు శ్రీ వర్మగారు. వీరిది నిర్నిద్ర పరిశ్రమ." గుడీ-గుంపా గ్రంథంలో ముఖ్యంగా రాక్షసులనాటి, కాపుల దేవుడు, పెద్దింటమ్మ, ఎల్లారమ్మ నత్తల రామేశ్వరం, పెనుగొండ ప్రతిమలు, గుంపాగుండపల్లి లంజ దిబ్బలు, గుడీ-గుంపా, ఎల్లమ్మ-రేణుక మొదలైన ప్రముఖ దేవతల ప్రాశస్త్యాన్ని, పుట్టు పూర్వోత్తరాలని ఫోటోలతో సహా ప్రచురించారు. ఇటువంటి పరిశోధనా గ్రంథం యీ విషయాలను గురించి ఇంతవరకు ప్రచురితం కాలేదనే చెప్పవచ్చును.

గుడీ-గుంపాకు వెనుక వీరు ప్రచురించిన 'మైలారదేవ' కన్న పదిరెట్లు ప్రచారం ఉందని చెప్పాలి. గుడీ అంటే అందరికీ తెలిసినదే కానీ "గుంపా" అంటే ఏమిటో అని చాలా మందికి అనుమానమొస్తుంది. 'గుంపా' అంటే 'కొంప' అని అర్థం. గుంప బౌద్ధుల గుహాలయము గుంపా జీవనంలోనే బౌద్ధులు సకల విద్యలు వ్యాప్తి చేశారు.

శ్రీ వర్మగారి గుడీ-గుంపా ఎన్నో ప్రయాసలకు గురి అయి ప్రచురించినట్లు వీరి పీఠికలో వ్యక్తమవుతుంది. ఇంత పరిశ్రమ చేసిన అమూల్య గ్రంథానికి ప్రభుత్వమో, పెద్ద సంస్థలో పూసుకోవాలి గాని వ్యక్తుల వలన ప్రచారం కావాలంటే ఈ రోజుల్లో చాలా కష్టం: వర్మగారు యీ నిరంతర కృషి యిక ముందు కూడా చేస్తారని, యింకా యిలాంటి గ్రంథాలు తెలుగు వారికి అందజేస్తారని ఆశిద్దాం.

—మద్దిపట్ల వెంకట్రావు



దేశంలో పట్టు పరిశ్రమాభివృద్ధి

గ్రామీణ ఆర్థిక పురోగతికి ఒక మంచి సాధనం

పట్టు పురుగుల పెంపకం పరిశ్రమకు పెద్ద ఎత్తున పెట్టుబడి గానీ, యంత్రసామగ్రి గానీ అవసరం లేదు. కొద్ది పెట్టుబడితో మంచి ప్రతిఫలం లంభించే పరిశ్రమ ఇది. సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు తమ తాహతు మేరకు స్వల్ప పెట్టుబడితో మంచి ఆదాయం సంపాదించడానికి అనువుగా ఉంటుంది. ఈ పరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం ఎక్కువగా గ్రామ గిరిజన ప్రాంతాలలో జరుగుతున్నది. ఫలితంగా ఈ పరిశ్రమవల్ల ఏర్పడుతున్న ఉపాధి అవకాశాలు దాదాపు పూర్తిగా ఈ ప్రాంతాలకే లభిస్తున్నాయి. గ్రామ, గిరిజన ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు బాగా పెంపొందించి ఈ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వం వారి ప్రధాన లక్ష్యాలలో ఒకటి. ఈ లక్ష్యసాధనకు పట్టు పురుగుల పెంపకం పరిశ్రమ బాగా ఉపయోగపడుతుంది. అంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, అందునా ముఖ్యంగా వెనుకబడిన, గిరిజన ప్రాంతాలను మెరుగుపరచడానికి ఈ పరిశ్రమను మంచి సాధనంగా ఉపయోగించుకొనవచ్చునన్న మాట.

గత ఇరవై అయిదేళ్లలో పట్టుపురుగుల పెంపకం రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమైంది. 1949, 1974 సంవత్సరాల మధ్యకాలంలో పట్టు ఉత్పత్తి 1,225 టన్నుల నుండి 3,075 టన్నులకు పెరిగింది. అంటే ఇరవై అయిదేళ్ల కాలంలో ఉత్పత్తి రెండున్నర రెట్లు పెరిగిందన్న మాట, పట్టు వస్త్రాల ఉత్పత్తిలో కూడా అభివృద్ధి జరిగిందని చెప్పవచ్చు. గత సంవత్సరం దేశంలో పట్టువస్త్రాల ఉత్పత్తి 452 లక్షలచదరపు మీటర్లకు పెరిగింది.

గత ఇరవై అయిదేళ్లలో మన ఎగుమతులు 39 రెట్లు పెరిగాయి. 1973–74 లో పట్టు ఎగుమతులద్వారా మనదేశం 1,471 లక్షల మేరకు విదేశీ మారకద్రవ్యం ఆర్జించింది. 1949 లో ఇలా ఆర్జించిన మొత్తం రూ. 41 లక్షల 21 వేలు మాత్రమే. మన పట్టు ఎగుమతులు ఏటేటా పెరుగుతూండడాన్నిబట్టి మనదేశంలో తయారైన పట్టుకు విదేశీ మార్కెట్లలో ఎంతగా ప్రజాదరణ లభిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు పట్టు దిగుమతులను బాగా తగ్గించడంజరిగింది. 1949లో మనదేశం రూ. 283 లక్షల నిలువచేసే పట్టును దిగుమతి చేసుకొన్నది. కాగా, గత సంవత్సరం జరిగిన దిగుమతుల నిలువ రూ. 15 లక్షల 32 వేలు మాత్రమే.

అయిదవ ప్రణాళికలో

అయిదవ ప్రణాళికా కాలంలో పట్టు ఉత్పత్తి (మల్బరీ పట్టు, ఇతర రకాల పట్టు) ని సంవత్సరానికి 1,645 టన్నులకు పెంచాలని ఉద్దేశిస్తున్నారు. ఇందుకు రూ. 3 కోట్ల 64 లక్షల మేరకు పెట్టుబడి అవసర మవుతుంది. ఇందువల్ల ఈ రంగంలో అదనంగా మరో ఎనిమిది లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అయిదవ ప్రణాళికా కాలంలో మల్బరీ పట్టు ఉత్పత్తి సుమారు 46 శాతం వరకు పెరుగుతుంది.

పరిశోధన కృషి

పట్టు పురుగుల పెంపకం రంగంలో పరిశోధన కృషిని కట్టుదిట్టం చేయడానికి చర్యలు తీసుకొన్నారు. వ్యవహారాల కేంద్ర మండలి వారు మల్బరీ పట్టుకు సంబంధించిన పరిశోధన సంస్థలు రెండింటిని – ఒకటి మైసూరులో, మరొకటి బర్హంపూరులో నెలకొల్పారు. రాంచీ, టిటాబర్‌లలో ఒక్కొక్కటి చొప్పున నెలకొల్పబడిన మరో రెండు కేంద్రాలలో ఇతర రకాల పట్టుకు సంబంధించిన పరిశోధన జరుగుతున్నది. ఇవికాక, కాలింపాంగ్, ఇంఫాల్ ఛీమ్‌తల్, బరోడ్‌లలో నాలుగు ప్రాంతీయ కేంద్రాలు కూడా పని చేస్తున్నాయి. ఇటీవల గత కొన్ని సంవత్సరాలలో ఈ పరిశ్రమకు సంబంధించిన పరిశోధన కృషి బాగా పుంజుకొన్నది. ఈ కృషి మంచి ఫలితాలనిచ్చింది. మైసూరులోని పట్టు పురుగుల పెంపకానికి సంబంధించిన కేంద్ర పరిశోధన, శిక్షణ సంస్థవారు మల్బరీ పట్టు పురుగుల పెంపకంలో ఉపయుక్తమయ్యే ఒక సూచన పద్ధతిని రూపొందించారు.

సిబ్బంది శిక్షణ సౌకర్యాలు

పట్టు వ్యవహారాల కేంద్ర మండలివారు మైసూరులోని పట్టు పురుగుల పెంపకానికి సంబంధించిన కేంద్ర పరిశోధన, శిక్షణ సంస్థలో పట్టు పురుగుల పెంపకంలో పట్టభద్రతానంతర డిప్లొమా కోర్సు ఒకటి ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలలోని పట్టు పురుగుల పెంపకం వ్యవహారాలశాఖల అధికారులకు ఈ మండలి వారు ప్రతి సంవత్సరం పునశ్చరణ శిక్షణ తరగతులుకూడా నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులు ఆరు వారాలపాటు సాగుతాయి.

జిల్లాల్లో..

నేలకొండపల్లిలో చక్కెర ఫ్యాక్టరీ

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మే 5న తిరుమలాయ పాలెంలోని రాజేశ్వర పురంలో తీవ్రతర పశుగణాభివృద్ధి పథకం క్రింద ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజేశ్వరపురంలో నాగార్జునసాగర్‌కు చెందిన 16,17 బ్రాంచి కాలువల స్లూయిస్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. కొత్తూరు గ్రామంలో నాగార్జునసాగర్ కాలువపై రు 72,000ల ఖర్చుతో నిర్మించిన రోడ్డు వంతెనకు ప్రారంభోత్సవం చేశారు. 1976 జనవరిలో సంక్రాంతి నాటికి నేల కొండపల్లిలో చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభిస్తారని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో సూపర్ బజార్

కార్మిక శాఖమంత్రి, శ్రీ టి. అంజయ్య, మే 6న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో "కరుణ" సూపర్ బజారుకు ప్రారంభోత్సవం చేస్తూ కార్మిక పారిశ్రామిక సత్సంబంధాలకు తగిన వాతావరణాన్ని సృష్టించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పారిశ్రామిక వివాదాలను సత్వరంగా పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న జిల్లా కలెక్టరును ఆయన అభినందించారు. కార్మికులకు ఇండ్లు నిర్మించడం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంవంటి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. 3600 మంది కార్మికుల నిమిత్తం నెలకొల్పబడిన సూపర్ బజారు నిమిత్తం ఉచితంగా వసతి కల్పించడమేగాక ఒక లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టినందుకు యాజమాన్యాన్ని అభినందించారు.

అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరు, శ్రీ జి కుమారస్వామి రెడ్డి ప్రసంగిస్తూ 1000 మందికి పైగా కార్మికులను నియమించే పరిశ్రమలు ఇటువంటి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రు. 50,000ల మేరకు షేర్ డిపాజిటును కార్మికులు చెల్లించినందుకు సంతోషం ప్రకటించారు.

ఆరుసూత్రాల పథకం క్రింద చిన్నతరహా నీటిపారుదలకు అధిక ప్రాధాన్యత

చిన్నతరహా నీటిపారుదల శాఖమంత్రి శ్రీ ఆనం వెంకట రెడ్డి యిటీవల చిత్తూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సర్పంచులు సమితి అధ్యక్షులు, శాసన సభ్యులతో కూడిన నీటిపారుదల విషయాల మహాసభకు ప్రారంభోత్సవం చేస్తూ చిన్నతరహా నీటిపారుదల క్రింద పూర్తి కాకుండా మిగిలిపోయిన పనులను పూర్తిచేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు.

ఆరుసూత్రాల పథకం క్రింద చిన్నతరహా నీటి పారుదల విషయాలకు అధిక ప్రాధాన్యత లభిస్తుంది. దానితోపాటు రాయలసీమ అభివృద్ధి కార్యక్రమాలు, భూగర్భజలాల సర్వే చిన్నతరహా నీటిపారుదల వనరుల పరిశోధన కూడా జరుగుతాయని అన్నారు.


మహాసభకు అధ్యక్షత వహించిన శ్రీ ఎన్. పి. చెంగలరాయ నాయుడు ప్రసంగిస్తూ మధ్యతరహా, పెద్దతరహా ప్రాజెక్టులు లేని యీ జిల్లాకు ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు.

జిల్లా పంచాయత్ రాజ్ పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎన్. పి. వెంకటేశ్వర చౌదరి ప్రసంగిస్తూ చిత్తూరు జిల్లాలో అత్యధిక సంఖ్యలో అంటే 8500 చిన్నతరహా నీటిపారుదల వనరులు ఉన్నాయనీ, వాటిక్రింద 3 0 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నదనీ, ఈ వనరుల మరమ్మతు, నిర్వహణకు రు. ఒక కోటి రూపాయలు అవసరమౌతాయనీ అన్నారు.

హిందూపూర్‌లో ఆసుపత్రి భవనానికి గవర్నరు శంకుస్థాపన

గవర్నరు శ్రీ ఎస్. ఓబులరెడ్డి మే 13న హిందూపూర్‌లో ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేస్తూ ప్రతితాలూకాలో 30 పడకలతో ఆసుపత్రులను నిర్మించడానికి ప్రభుత్వం తలపెట్టిందని అన్నారు. ఆసుపత్రి విస్తరణకు నిధులు సమకూర్చడానికి ప్రయత్నిస్తానని ఆయన హామీయిచ్చారు రు. 50,000లు విరాళంగా యిచ్చిన శ్రీ ఎల్. జి. బాలకృష్ణను ఆయన అభినందించారు.

జిల్లా వైద్యశాఖాధికారి డా. సి. భాస్కరరెడ్డి గవర్నరుకు స్వాగతం చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం కార్యదర్శి డా. రామసుబ్బయ్య నివేదిక చదివారు. సంఘం అధ్యక్షుడు, డా. సోమసుందరం ప్రసంగిస్తూ ప్రభుత్వం నుండి పెద్ద మొత్తంలో గ్రాంట్లు అడగకుండానే హిందూపూర్ దాతలు 20 పడకల విస్తరణ భవనానికి రు. 1, 2లక్షలు విరాళంగా యిచ్చారని తెలిపారు.



నెల్లూరు జిల్లా కలెక్టర్ యిటీవల భగవాన్ మహావీర్ జయంత్యుత్సవాల సందర్భంగా ప్రసంగిస్తోన్న చిత్రం.

ప్రకాశం జిల్లా పెద్ద కొత్తపల్లి హరిజనవాడలో ప్రైమరీ స్కూలు భవనం

ప్రకాశం జిల్లా మద్దిపాడు సమితిలోని పెద్ద కొత్తపల్లి గ్రామం హరిజనవాడలో 14 వేల రూపాయల ఖర్చుతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనానికి రాష్ట్రమంత్రి శ్రీ డి మునిస్వామి మే నెల 4 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు శ్రీ యం. పున్నయ్య చౌదరి అధ్యక్షత వహించి మంత్రికి సమితి తరఫున సన్మాన పత్రం సమర్పించారు.

సభలో శాసనసభ్యుడు శ్రీ ఆర్. టి. కోటయ్య మాట్లాడారు. మంత్రి శ్రీ మునుస్వామి ప్రసంగిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసికోవలసిందని హరిజనులకు విజ్ఞప్తి చేశారు. కుటుంబనియంత్రణ యొక్క ప్రాధాన్యతను తెలియజెప్పారు.

రాష్ట్ర స్థాయిని నిర్వహింపబడ్డ నాటక, నాటిక పోటీలలో గెలుపొందిన వారికి మంత్రి శ్రీ దామోదరం మునిస్వామి బహుమతి ప్రదానంచేశారు.


తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ పంట శిక్షణ కార్యక్రమం

అధిక దిగుబడి వంగడాలను ప్రవేశపెట్టడం ద్వారా రబీ పంట తరుణంలో అధికోత్పత్తి సాధించిన వ్యవసాయశాఖ కృషిపట్ల తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ పి. రంగాచారి సంతృప్తి వెల్లడించారు. 1975 సంవత్సరం ఖరీఫ్ పంట శిక్షణ కార్యక్రమానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. వచ్చే ఖరీఫ్ పంటకాలంలో కూడా అదే ఉత్సాహాన్ని నిలుపుకోవలసిందని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎరువుల సేకరణ ఎరువుల పంపిణీలో జిల్లా మార్కెటింగ్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ నిర్వహించిన పాత్రను శ్లాఘించారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను ఎక్కువ వేసినందుకు కపిలేశ్వరపురం సమితిలోని వెంకటాయ పాలెం గ్రామానికి పవర్ స్ప్రేయర్‌ను కలెక్టర్ బహూకరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు

ఇంతవరకూ పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమయి వున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు ఇక ముందు గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు కూడా విస్తృతం చేయబడతాయి. విశాఖపట్టణంలో మే 14 వ తేదీన జరిగిన అంతర్జాతీయ మహిళా సంవత్సరం సమావేశంలో ప్రసంగిస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిణి శ్రీమతి యమ్. లక్ష్మీదేవి పై విషయం తెలియజేశారు. సాంఘిక సంక్షేమ సలహా బోర్డు, సంక్షేమశాఖ, అభ్యుదయ సంస్థల మధ్య సమన్వయ, సహకారాలను పెంపొందించేందుకు ఒక సమన్వయ సంఘం స్థాపింపబడుతోందని అన్నారు.

అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా వివిధశాఖల్లో ఉద్యోగాలకు మహిళలకు ప్రాధాన్యం యివ్వటమేగాక, అన్ని సంఘాల్లోను ప్రాతినిధ్యం కల్పింపబడాలి. అన్ని మహిళా సంస్థలు వరకట్నాల నిషేధానికి దోహదంచేయాలి అన్నారు శ్రీమతి లక్ష్మీదేవి.




ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల వర్క్‌షాప్‌ను ఏప్రిల్ 21 వ తేదీన హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖా మంత్రి శ్రీ ఉకలాపు లక్ష్మణదాసు ప్రారంభించారు.

బి.ఎ.పి.ఆర్.ఒ. ల శిక్షణ శిబిరం

ఏ సంస్థకుగానీ, యాజమాన్యానికిగానీ పౌరసంబంధాధికారులు వెన్నముక వంటివారు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వంచేస్తున్న కృషిని గూర్చి ప్రజలకు తెలియజేయడం వారి విధి. ఈ సందర్భంలో సమాచార క్షేత్రాధికారులు ప్రముఖ పాత్ర నిర్వహించాల్సి ఉంది, అని టూరిజం శాఖ మంత్రి డా. సి. హెచ్. దేవానందరావు, మే 15 న హార్స్‌లీ కొండలలో మూడు రోజులపాటు జరిగిన బ్లాక్ అసిస్టెంట్ పౌరసంబంధాధికారుల శిక్షణ శిబిరానికి ప్రారంభోత్సవం చేస్తూ అన్నారు. పౌరసంబంధాలలో వచ్చిన ఆధునిక విధానాలను అవగాహన చేసుకొని పత్రికా సంబంధాలలో ఉత్తమ ప్రమాణాలను పెంపొందించడానికి వీలుగా పౌరసంబంధాధికారులకు శిక్షణ ఇవ్వడానికి సమాచార, పౌరసంబంధ శాఖ ఆధ్వర్యంలో యీ శిక్షణ శిబిరం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరు, శ్రీమతి శ్రీ రాజ్యం సిన్హా ప్రసంగిస్తూ అక్షరాస్యత తక్కువగా ఉన్న మన దేశంవంటి పెద్ద ప్రజాస్వామిక దేశాలలో పౌరసంబంధాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించాల్సివుంది. అభివృద్ధి కార్యక్రమాలలో ఆకర్షణీయమైన పద్ధతులలో గ్రామీణ ప్రజలభవిష్యత్తుకోసం ఎక్కువ బాధ్యతలు నిర్వహించడానికి వీలుగా ఉత్సాహం కలిగించే రీతిగా ప్రచారం చేయాల్సి ఉంటుంది, అన్నారు.

డా. దేవానందరావు ప్రసంగిస్తూ పౌరసంబంధాధికారులు అనుసంధాన సంస్థలుగా వ్యవహరిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య సద్భావం, సదవగాహన ఏర్పరచాలి అని అన్నారు.



హార్సిలీ కొండలలో మే 15 నుండి మూడు రోజులు నిర్వహింపబడిన బ్లాక్ అసిస్టెంట్ పౌర సంబంధాధికారుల శిక్షణ శిబిరాన్ని టూరిజం శాఖ మంత్రి డా. సి.హెచ్. దేవానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంలో శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టర్ శ్రీమతి శ్రీరాజ్యం సిన్హా ప్రసంగించారు.

లా కమీషన్ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డు జడ్జి శ్రీ పి. వెంకటేశ్వర రావుగారి అధ్యక్షతన లా కమీషన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో అడ్వకేట్ జనరల్ శ్రీ పి. రామచంద్రా రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శిగా రిటైరు అయిన శ్రీ యన్.వి. సుబ్బారావు సభ్యుడు – కార్యదర్శిగాను, రిటైర్డు జిల్లా జడ్జి శ్రీ కె ఉమాపతి రావు సభ్యులుగాను వుంటారు.

లా కమీషన్ పరిశీలన చేయవలసిన విషయాలు ఇవి :

చట్టాలను సులభతరంచేయడం, రాజ్యాంగానికి అనుకూలంగా లేనటువంటి నిబంధనలను తెలుసుకొని వాటిని సరిదిద్దడానికి మార్గాలను సూచించడం, న్యాయస్థానాల తీర్పులద్వారాకానీ, లేక యితరత్రాకానీ చట్టాలలోకొన్ని లోపాలు వున్నాయని పేర్కొనబడి వుండినట్లయితే, ఆలోటుపాట్లను తొలగించడానికి కృషి చేయడం, రాష్ట్ర శాసనంవల్ల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన రంగంలో స్థానిక వ్యత్యాసాలు ఏర్పడిన విషయాలను గమనించి అవి సర్వత్రా సమానంగా వర్తించేవిధంగా దానిని తగిన రీతిగా రూపొందించడం, ఒకే విషయానికి సంబంధించిన వివిధ చట్టాలను సమీకరించి, వాటి విషయంలో అవసరమైనట్లయితే సాంకేతికంగా పరిశీలనచేయడం రాష్ట్ర ప్రభుత్వ విధానాలకొరకై రాజ్యాంగంలో నిర్దేశించబడిన ఆదేశిక సూత్రాలను అమలుపరచే విషయాలకో తగిన సవరణలు సూచించడం, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన రంగంలో కేంద్ర ప్రభుత్వ శాసనాలను సవరించడానికై భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, సమిష్టి జాబితాలలో వుండవలసిన అంశాలను పరిశీలించి.(ఇవి రాష్ట్ర శాసనానికి సంబంధించినవై వుండాలి. ఉదాహరణకు ఖనిజ హక్కులపైన లెవీవంటివి.) వాటిని గురించి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సలహాలు ఇవ్వడం, ఈ విషయాలలో ఎప్పటికప్పుడు రాజ్యాంగ విషయాలు, న్యాయశాస్త్ర విషయాలలో ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం, రాష్ట్ర విధానాలకు సంబంధించిన ఆదేశిక సూత్రాలను కట్టుదిట్టంగా అమలుపరచేందుకు, కొ_ పన్ను విధానాలలో అనుసరించేందుకు అవసరమైనట్లయితే కొత్త శాసనాన్ని సూచించడం, చట్టాలను సవరణచేయడానికి సాధారణ విధానాన్ని సూచించడం.

ఈ లా కమీషన్ మూడేండ్లవరకు నియమించబడింది. దాని ప్రధాన కార్యాలయ కేంద్రం హైదరాబాద్‌లో వుంటుంది.

మహిళా సంక్షేమ కార్యక్రమాల సమీక్షా సంఘం

రాష్ట్ర మహిళ, బాలల సంక్షేమ శాఖవారు రాష్ట్రంలో అనాధ నిరాశ్రయ స్త్రీలు, వితంతువులు, అనాధ బాలల నిమిత్తం స్టేట్ హోమ్స్, సర్వీసుహోమ్స్, బాలల సంక్షేమ కేంద్రాలు మొదలైన వాటిని నిర్వహిస్తున్నారు ఈ హోమ్స్‌లో నివసించేవారిని విడుదలచేసిన తర్వాత వారు తమ కాళ్ళపై తాము నిలబడడానికి వీలుగా జీవనోపాధిని కల్పించుకోడానికి తోళ్ళ పరిశ్రమ, గాజు యాంపుల్స్ యూనిటు, బనీసుల తయారీ యూనిటు వంటి వృత్తిపరమైన పనులలో శిక్షణ యిస్తున్నారు ఈ హోమ్‌ల నుండి విడుదల పొందిన తర్వాత జీవనోపాధిని సంపాదించడానికి సమాజంలో వారికి తగిన స్థానం లభించడంలేదని ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగింది. 1975 అంతర్జాతీయ మహిళా సంక్షేమ సంవత్సరం సందర్భంగా మహిళా సంక్షేమం వారి ఆర్థిక పథకాల అమలును పటిష్టంచేసి, హోమ్స్‌లోని నివాసితులకు ఇతర వృత్తులలోను, ఉద్యోగాలలోను తగిన పునరావాసం కల్పించడానికి అర్థవంతమైన పథకాలు రూపొందించడానికి వీలుగా స్టేట్‌హోమ్స్, సర్వీసు హోమ్స్, బాలల హోమ్స్‌లోని సేవా కార్యక్రమాలను త్వరితగతిని మదింపువేసి సమీక్షించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది తదనుగుణంగా మహిళ, బాలల సంక్షేమశాఖ రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ హోమ్‌లను సంస్థలను తనిఖీచేసి, పరిశీలించడానికి ప్రభుత్వం 6 గురు సభ్యులతో శాసన సభ్యురాలు శ్రీమతి వి. రాజ్యలక్ష్మమ్మ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. నాలుగు నెలలలో యీ సంఘం తమ నివేదికను సమర్పిస్తుంది

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

కె. బాపురెడ్డి, 8-3-224 యూసఫ్‌గుడా, హైదరాబాద్

కె. వీరాస్వామి, ఆం. ప్ర. పబ్లిక్ సర్వీసు కమీషన్ సభ్యులు. ముకర్రాంజాహి రోడ్, హైదరాబాద్

తిరుమల రామచంద్ర, 69, ఆదర్శనగర్, హైదరాబాద్

వి. పాలవెల్లి, 188, యం. యల్. ఏ. క్వార్టర్స్, హైదరాబాద్

బులుసు వేంకట రమణయ్య, 34, పురుషోత్తమనగర్, కోదిన్‌పేట మద్రాసు

"కళాప్రపూర్ణ" వడ్లమూడి గోపాలకృష్ణయ్య, డైరెక్టర్, ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ అండ్ రీసెర్చి సంస్థ హైదరాబాద్

డా. భద్రిరాజు కృష్ణమూర్తి, భాషాశాస్త్ర శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

శ్రీమతి డి. శ్యామలాదేవి, పి. కృష్ణమూర్తి, సి. వి. రాజాచార్యులు, పిఠాపురం క్వార్టర్సు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు


కప్పగంతుల లక్ష్మణశాస్త్రి. 69, ఆదర్శనగర్, హైదరాబాద్

వి. సుబ్బరామశర్మ, సెక్షన్ ఆఫీసర్, అసెంబ్లీ సెక్రెటేరియట్, హైదరాబాద్

మణి, 10-216, చర్చివీధి, కావలి

మద్దిపట్ల వెంకట్రావ్, 6-2-50, జాంబాగ్, హైదరాబాద్

సుధామ, యం యస్. 86, మలక్‌పేటకాలనీ, హైదరాబాద్



PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS ANDHRA PRADESH, HYDERABAD

జాతీయ చరిత్ర ఆధారంగా - బొమ్మలు



